
నేతాజీ సుభాస్ చంద్రబోస్
రూ॥ 70/-
పేజీలు:68
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మాజీ ఎంపి మంద జగన్నాథం కన్నుమూత

'జమిలి' బిల్లును అడ్డుకోవాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రణాళిక సమీక్ష సమావేశం రసాభాస..

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 46 | సోమవారం | 13-01-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## భూభారతిలో నమోదైన సాగుయోగిత భూమికే

- భూ విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా
- పథకం నుంచి సాగుయోగ్యం కాని భూముల తొలగింపు
- ఆర్ఓ ఎఫ్ఆర్ పట్టాదారులకు కూడా ఆర్థిక సాయం
- రైతు భరోసా పథకం మార్గ దర్శకాలు జారీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి స్పష్టమైన మార్గ దర్శకాలను జారీ చేసింది. దీంతో ఊహాగానాలకు తెర పడింది. ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యంగా రైతు భరోసా పథకం పేరుతో రెండు దఫాలుగా రూ.6 వేల చొప్పున ఏడాదికి ఎకరాకు రూ. 12వేల చొప్పున రాష్ట్ర రైతాంగానికీ పంట పెట్టుబడి సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ పథకాన్ని ఈ నెల26 నుంచి అమలుకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించింది. ఈనేపథ్యంలో ఆదివారం మార్గదర్శకాలను విడుదల చేసింది. భూభారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతుభరోసా సహాయం అందించనున్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతుభరోసా నుండి తొలగించనున్నారు. ఆర్ఓ ఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతుభరోసాను అందించనున్నారు. రిజర్వు బ్యాంక్ నిర్వహించే డిబిడి పద్ధతిలో రైతుభరోసా సహాయం రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ నేషనల్ ఇన్ఫార్మటిక్ సెంటర్ ఐటి భాగస్వామిగా బాధ్యతలు నిర్వర్తిస్తుంది. రైతు భరోసా పథకం అమలు బాధ్యతలను జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లా కలెక్టర్లు అప్పగించారు. రైతు భరోసా కింద అర్హులైన వారికి పంట సహాయం అందకపోతే జిలా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తే వాటిని పరిష్కరిస్తారు. రైతు భరోసా పథకం పూర్తి పర్యవేక్షణ తరువాయి 2లో

# భేషజాలకు పోము



## ఎవరి సలహాలనైనా స్వీకరిస్తాం

- రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు విపక్షనేతల అనుభవాన్ని ఉపయోగించుకుంటాం
- తెలంగాణ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి నిరంతరం కృషి
- మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ఆత్మకథ 'ఉనిక' పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాజకీయాల్లో సిద్ధాంతపరమైన భావజాలం లేకపోవడం వల్లనే పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారు. ఏదో ఒక పదవి కోసం పార్టీలు మారుతున్నారు. విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన రాజకీయాలు చేస్తే పార్టీకి, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారు. సిద్ధాంతపరమైన విద్యార్థి రాజకీయాలను రాష్ట్రంలో పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలి, లేదంటే చైతన్యం కోల్పోయి, రాష్ట్ర అభివృద్ధిలో వెనుకబడిపోయే పరిస్థితి ఉత్పన్నమవుతుంది.

\- సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అవసరమైతే విపక్ష నేతల అనుభవాన్ని ఉపయోగించుకుంటామని, తాము ఎటువంటి భేషజాలకు పోబోమని, ఎవరి సలహాలనైనా స్వీకరిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి నిరంతరం కృషి చేస్తున్నామని, కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి త్వరగా పరిపూర్ణమవుతుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కొన్ని రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపై కలిసి పోరాడుతున్నాయని, రాష్ట్రంలో కూడా అలాగే వ్యవహరించాలని, ప్రపంచ స్థాయి నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలని తెలిపారు. మెట్రో, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించేందుకు రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు కూడా తమవంతు ప్రయత్నం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని, ఇందుకు మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు రాసిన ఆత్మకథ 'ఉనిక' పుస్తకాన్ని హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఒరిస్సా గవర్నర్ కె.హరిబాబు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎంపి సుబ్బిరామిరెడ్డి, పుస్తక రచయిత చెన్నమనేని విద్యాసాగర్ రావు, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో సిద్ధాంతపరమైన భావజాలం లేకపోవడం వల్లనే పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, ఏదో ఒక పదవి కోసం పార్టీలు మారుతున్నారని, విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన రాజకీయాలు చేస్తే పార్టీకి, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారన్నారు. సిద్ధాంతపరమైన విద్యార్థి రాజకీయాలను రాష్ట్రంలో పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు తెలంగాణప్రత్యేక రాష్ట్రం ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. యూనివర్సిటీలకు పూర్వవైభవం తీసుకురావడం కోసం నిర్ణయాలు తీసుకున్నామన్నారు. విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలని, లేదంటే చైతన్యం కోల్పోయి, రాష్ట్ర అభివృద్ధిలో వెనుకబడిపోయే పరిస్థితి వస్తుందని సిఎం తెలిపారు. ఒకప్పుడు దేశంలోని నగరాల్లో అగ్రగామిగా ఉన్న హైదరాబాద్ ప్రస్తుతం 9వ స్థానానికి పడిపోయిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద భూసేకరణ విషయంలో మహారాష్ట్ర సిఎంతో మాట్లాడే అంశంలో విద్యాసాగర్ రావు సహకారం తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తీర ప్రాంతం లేదని, అందుకే డ్రైపోర్టు ఇవ్వాలని ప్రధానిని కోరినట్టు రేవంత్ రెడ్డి వివరించారు. మెట్రో విషయంలో తమిళనాడు డిఎంకె ప్రభుత్వానికి ప్రధాని మోదీ సహకరించారని, అలాగే కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి మెట్రో ఇచ్చారని, ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడాలంటే మెట్రో రైల్‌కు అనుమతులు తెచ్చుకోవాలని కోరారు. రాబోయో కేంద్ర మంత్రివర్గ తరువాయి 2లో



# 26న రైతుల 'నిరసనజ్వాల'

- కేంద్ర ప్రభుత్వ ధోరణిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రాక్టర్లు, వెహికిల్స్, మోటార్‌సైకిల్ 'పరేడ్స్'కు పిలుపు
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన
- డల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో ప్రధాని మోదీ తక్షణమే చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** నిరవధిక నిరాహారదీక్ష కొనసాగిస్తున్న రైతునాయకుడు జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో రైతుల పోరాటం పతాకస్థాయికి చేరుకుంది. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో పాటు పలు ఇతర డిమాండ్లపై దీర్ఘకాలికంగా పోరాటం చేస్తున్న రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం 'నిమ్మకు నీరెత్తిన' చందంగా వ్యవహరిస్తోందని ఆక్షేపిస్తూ దేశవ్యాప్తంగా రైతులు తమ నిరసనలను మరింత ఉధృతం చేస్తున్నారు. ఇక 'తాడోపేడో' తేల్చుకుంటామంటూ అన్నదాతలు సమర శంఖం పూరించారు. రైతుల పెండింగ్ డిమాండ్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే రైతులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ జనవరి 26(రిపబ్లిక్ డే)న దేశ వ్యాప్తంగా ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) ఆదివారం పిలుపు ఇచ్చింది. 48 రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్ ఆరోగ్యంపై సర్వత్రా ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమై మద్దతు పెరుగుతోంది. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) కన్వీనర్ అయినటువంటి డల్లేవాల్ పంజాబ్‌హర్యానా రాష్ట్రాల మధ్య శంభుఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద గత ఏడాది నవంబరు 26వ తేదీనుండి రైతుల డిమాండ్లపై ఆమరణ నిరాహారదీక్ష తరువాయి 2లో

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఇద్దరు మహిళా నక్సల్స్ సహా ఐదుగురు హతం
- ఈ ఏడాది ఇప్పటివరకూ 14 మంది మావోయిస్టులను మట్టుబెట్టిన భద్రతా బలగాలు



ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సలైట్లతో సహా మొత్తం ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనను ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ధృవీకరించారు.. వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బీజాపూర్ జిల్లాలో మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొరంజాడ్‌మద్దేపారి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డిస్ట్రిక్ట్ రిజ్వర్ గార్డ్స్ (డిఆర్‌జి), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) సంయుక్త బలగాలు తరువాయి 2లో

# పతంగుల పండుగకు సర్వం సిద్ధం



ప్రజాపక్షం/హైదరాబాద్

రంగు రంగుల గాలిపటాలతో.. కన్నుల పండుగకు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికైంది. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే అంతర్జాతీయ కైట్ స్వీట్ ఫెస్టివల్ ను సోమవారం సాయంత్రం 4 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. జనవరి 13 నుంచి 15 వరకు జరగనున్న ఈ కైట్ ఫెస్టివల్ లో అంతర్జాతీయ, వివిధ రాష్ట్రాల కైట్ ప్లయర్లు పాల్గొనబోతున్నారు. పతంగుల పండగతో పాటు స్వీట్ ఫెస్టివల్‌ను కూడా తరువాయి 2లో

## గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రబోవో సుబియాంటో?



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది (జనవరి 26) గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరయ్యే అవకాశం ఉన్నట్లు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏళ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాంటో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోదీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గత ఏడాది ప్రబోవో ప్రధాని మోదీకి ఫోన్‌కాల్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర తరువాయి 12లో

# రూ.60కోట్ల అప్పుల ఊబిలో మదర్ డెయిరీ

## ఆస్తుల విక్రయానికి నిర్ణయం

- పాల రైతులకు రూ.20 కోట్ల బకాయి
- రెండు బ్యాంకుల్లో రూ.35 కోట్ల అప్పులు
- పాత రుణాల వడ్డీలకే ఏటా రూ.4 కోట్లు
- పరికరాల కొనుగోలు బాకీలు రూ.5 కోట్లు




ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

నల్లగొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్(నార్ముల్ మదర్ డెయిరీ) రూ.60 కోట్ల అప్పుల్లో కూరుకు పోయింది.భారీగా పేరుకపోయిన ఈ అప్పులను తీర్చేందుకు ఆస్తులను విక్రయించాలని నిర్ణయించింది. పరిపాలన పరమైన ఆమోదం పొందేందుకు రానున్న ఫిబ్రవరి 7న సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మదర్‌డెయిరీ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షులంతా సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరింది. తీర్మానం ఆమోదం పొందడమే ఆలస్యం..ఆస్తులు అమ్మి అప్పులు తీర్చనుంది.

**కర్ణుడి చావుకి అనేక కారణాలన్నట్లు**

నార్ముల్ మదర్ డెయిరీ రంగారెడ్డి నల్లగొండ రెండు జిల్లాల్లోని 24 చిల్లింగ్ కేంద్రాల ద్వారా 98 వేల మంది రైతుల నుంచి రోజుకు సుమారు లక్ష లీటర్ల పాలు సేకరిస్తుంది. వీటిలో 65 వేల లీటర్లను బహిరంగ మార్కెట్ లో విక్రయిస్తుండగా,మరో 35 వేల లీటర్ల పాలను పౌడర్, పెరుగుగా మారుస్తుంది.ప్రైవేటు డెయిరీల నుంచి పోటీ పెరగడం,నార్ముల్ మదర్ డెయిరీ బ్రాండ్ ప్రమోటింగ్ కోసం అధిక వ్యయం వెచ్చించడం, సేకరణ కంటే విక్రయాలు తక్కువగా ఉండటం, మిగిలిన ఈ పాలను పౌడర్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా లీటరుకు రూ.15 చొప్పున నష్టపోతుండటం,కోవిడ్ సమయంలో పాల అమ్మకాలు విపరీతంగా తగ్గిపోవడం.ప్రభుత్వ ఏజెన్సీల నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడం,పరిపాలన పరమైన ఖర్చులు అధిక మవడంతో నిర్వహణ ఖర్చుల కోసం యాక్సిస్, ఎన్‌డిడిబిల నుంచి రూ.35 కోట్లు అప్పు తీసుకుంది.ఈ రుణాలకు ఏటా రూ.4 కోట్ల చొప్పున వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. అంతేకాదు కన్స్యూమబు ల్స్, పరికరాల కొనుగోలు పేరుతో వివిధ సంస్థలకు రూ.5 కోట్లు బకాయి పడింది.ఫలితంగా తరువాయి 2లో



# కెనాల్‌కు గండి...

- మన్నెంపల్లి గ్రామం జలమయం
- ఇళ్లలోకి నీరు రావడంతో కొట్టుకుపోయిన నిత్యావసర సరుకులు.

ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామ శివారులో డి4 కెనాల్‌కు గండి పడింది. దీంతో నీళ్లు మన్నెంపల్లి గ్రామంలోని ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పండగపూట తెచ్చి పెట్టుకున్న నిత్యావసర సరుకులు తడిసిపోయి తీవ్రంగా నష్టపోయారు. బియ్యం, పప్పు, ఉప్పుతో సహా నీట మునిగాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే కాలువకు మూడుసార్లు గండి పడినా అధికారులు పట్టించుకోవడం లేదని తరువాయి 2లో

# ఎవరూ ఆందోళన చెందొద్దు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు
- ఇళ్ల సమస్య పరిష్కారం చేస్తాం : నగరవాసులకు అన్యాయం జరగనివ్వం
- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆదివారం హైదరాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 10వ తేదిన జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 4 పథకాల ప్రారంభోత్సవానికి సంబంధించి సమీక్షా సమావేశం ముఖ్యమంత్రి నిర్వహించారన్నారు. హైదారాబాద్‌కు సంబంధించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక ఈ రెండు పథకాలు హైదరాబాద్, జిహెచ్‌ఎంసి పరిధిలో లేనందున మిగతా రెండు కార్యక్రమాలు రేషన్ కార్డులు పంపిణీ ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక చేయనున్నామన్నారు.

**ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు**

ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా సర్వే ఎంపిక జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అర్హులైన తరువాయి 12లో

# ఆనాటి సంబరమేదీ ?





- తీరు మారుతున్న సంక్రాంతి
- కళ తప్పిన లోగిళ్లు
- జాడలేని గంగిరెద్దులు

ప్రజాపక్షం/ఖమ్మం

సంక్రాంతి తెలుగు వారి పండుగలలో పెద్ద పండుగ. తెలుగు పండుగలలో ప్రకృతి పరంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణం వైపు ప్రారంభమవుతున్న సందర్భంగా ఈ పండుగను జరుపుకుంటారు. వాతావరణంలోనూ ఎన్నో మార్పులు ఈ పండుగ నుంచి చోటు చేసుకుంటాయి. మానవ జీవన విధానాలలోనూ స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. అందుకే దీనిని ప్రకృతి పండుగ అంటారు. ఈ ప్రకృతి పండుగ రైతుల వ్యవసాయ ఉత్పత్తుల ఇంటికి చేరే సమయంలో జరుపుకునేది కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతికి ఒక ప్రత్యేక వాతారణం చోటు చేసుకుంటుంది. ఇప్పుడంటే రెండు, మూడు పంటలు వేస్తున్నారు కానీ ఒకప్పుడు సంక్రాంతికి పునాస పంటల పాటు అన్ని రకాల పంటలు చేతికి వచ్చేవి. ముగ్గులు, గొబ్బెలు, గంగిరెద్దులు, భోగిమంటలు, భోగిపళ్లు, కనుమ సంబురాలు ఇలా సంక్రాంతికి సంబురం అంతా ఇంతా కాదు. కోడి పందెల సంగతి చెప్పనక్కర లేదు. పట్టణాలు, నగరాల్లో జీవిస్తున్న అనేక మంది సంక్రాంతి పండుగకు పల్లెబాట పడుతున్న ఎందుకో పల్లెలకు వెనకటి సంక్రాంతి కళ రావడం లేదు. సంక్రాంతి పండుగ సందర్భంగా లోగిళ్లకు నాటి కళ లేదు. ఇక ముగ్గులు ఎంతగా అలరించేవో తరువాయి 2లో

# మిలనోవిచ్ గెలుపు ఖాయం

## క్రొయేషియా అధ్యక్ష ఎన్నికల్లో కొనసాగుతున్న హవా



**జగ్రేబ్ (క్రొయేషియా):** వామపక్ష భావజాలం ఉన్న జొరాన్ మిలనోవిచ్ మరోసారి క్రొయేషియా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఖాయంగా కనిపిస్తున్నది. రష్యా అనుకూలుడిగా ముద్రపడిన మిలనోవిచ్ గత నెల 29న జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచాడు. మరోసారి ఎన్నికయ్యేందుకు అవసరమైన 50 శాతం ఓట్లకు అతను కేవలం 5000 ఓట్ల దూరంలో ఉన్నాడు. ఆదివారం నాటి తుది విడత పోలింగ్ మిలనోవిచ్‌కు ప్రజలు అనుకూలంగా ఓటు వేసి ఉంటారని అంచనా. మిలనోవిచ్‌తో పోటీపడుతున్న డ్రాగన్ ప్రిమోరాక్‌కు కేవలం 19 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 3.8 మిలియన్ల జనాభాగల క్రొయేషియా భవిష్యత్తు, యూరోపియన్ యూనియన్, నాటో కూటమిలో ఆ దేశ స్థానం వంటి పలు కీలక అంశాలు ఈ ఎన్నికపై ఆధారపడి ఉంటాయన్నది పరిశీలకుల అభిప్రాయం.

58 ఏళ్ల మిలనోవిచ్‌కు గతంలో క్రొయేషియన్ ప్రధానిగా పని చేసిన అనుభవం ఉంది. అనుకున్న విషయాన్ని ముక్కుసూటిగా చెప్పడం, చేయాలనుకున్నది ఎన్ని అడ్డంకులు వచ్చినా చేసేయడం ఆయన నైజం. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్ మద్దతునివ్వడాన్ని పలు సందర్భాల్లో మిలనోవిచ్ తప్పుబట్టారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అనుకూలంగా వాదించారు. రష్యాపై ఆంక్షలను ఖండించారు. క్రొయేషియా డెమోక్రాటిక్ యూనియన్ (హెచ్‌డిజెడ్) 1991లో యుగస్లావియా నుంచి క్రొయేషియా విడిపోయి, స్వతంత్ర దేశంగా అవతరించినప్పటి నుంచి అధికారంలో కొనసాగుతున్నది. 2000 సంవత్సరంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రిమొరాక్ చిరకాలంలోనే కీలక నేతగా ఎదిగారు. అయితే, దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటూ, తన అభిప్రాయాలను, సిద్ధాంతాలను విస్పష్టంగా చెప్పే మిలనోవిచ్‌కు గట్టిపోటీనివ్వలేకపోతున్నారు. వామపక్ష భావాలున్న మిలనోవిచ్ అధికారంలోకి వస్తే, క్రొయేషియా అస్తిత్వం ఉండబోదని ప్రిమోరాక్ తన ప్రచారంలో ప్రజలను హెచ్చరించారు. రష్యాకు అనుబంధ దేశంగా మారిపోతుందని వ్యాఖ్యానించారు. అయితే, మొదటి విడత పోలింగ్‌లో ప్రజలు మిలనోవిచ్‌కు అనుకూలంగానే ఓటు వేశారు. రెండో దేశలోనూ అదే ట్రెంట్ కొనసాగడం ఖాయంగా కనిపిస్తున్నది. క్రొయేషియా రాజ్యాంగాన్ని అనుసరించి ప్రధానికి చట్టపరపైన పూర్తి హక్కులు ఉంటాయి. అధ్యక్షుడు త్రివిధ దళాలకు అధినేతగా వ్యవహరిస్తాడు. దేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవడంలో అధ్యక్షుడి పాత్ర కూడా ఉంటుంది.




# కాలిఫోర్నియా 'కార్చిచ్చు' విషాదం



**లాస్ ఏంజిలిస్ :** కాలిఫోర్నియా కార్చిచ్చు పెను విషాదాన్ని నింపింది. మృతుల సంఖ్య 16కు చేరినట్టు ఆదివారం అధికారిక ప్రకటన వెలువడింది. అమెరికా చరిత్రలోనే అత్యంత భారీ నష్టాన్ని మిగిల్చిన కార్చిచ్చుల్లో ఇది ఒకటిగా నిలిచిపోతుంది. ఈనెల 7న ప్రారంభమైన 'అణుబాంబు విస్ఫోటనం'లాంటి కార్చిచ్చు లేదా వైల్డ్ ఫైర్ అత్యంత వేగంగా ఐదు ప్రాంతాలను ఆక్రమించడం, 1.8 లక్షలకు పైగా ప్రజలను సురక్షిత స్థానాలకు లేదా శిబిరాలకు తరలించడం, మరో 2 లక్షల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా హెచ్చరికలు జారీ చేయడం వెంటవెంటనే జరిగిపోయాయి. మొదట మృతుల సంఖ్యను ఐదుగా పేర్కొన్న అధికారులు, క్రమంగా సంఖ్యను పెంచుతూ వస్తున్నారు. వందలాది మంది తీవ్రంగా గాయపడడంతో, మృతుల సంఖ్య ఇంకా పెరగడం ఖాయంగా కనిపిస్తున్నది. వేల ఇండ్లు కాలి బూడిదయ్యాయి. అనేక లక్షల ఇండ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేగంగా విస్తరిస్తున్న కార్చిచ్చు దాదాపుగా అదుపులోకి వచ్చిందని అంటున్నారు. అయితే, ప్రమాదం ఇంకా పొంచి ఉందని స్పష్టం చేస్తున్నారు. తొలుత 'పాలిసేడ్స్' ప్రాంతంలో మొదలైన చిన్న కార్చిచ్చు నేడు దాదాపు 18,000 ఎకరాలకు విస్తరించడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా నమోదు అవుతున్నాయి. 'ఈటన్' ప్రాంత కార్చిచ్చులు 13,000 ఎకరాలకు, 'హర్స్ట్' ప్రాంత కార్చిచ్చులు 700 ఎకరాలకు, 'లిడియా' ప్రాంత కార్చిచ్చులు దాదాపు 500 ఎకరాలకు, 'కెన్నెత్' ప్రాంత కార్చిచ్చులు 800 ఎకరాలకు, 'సన్‌సెట్' ప్రాంత కార్చిచ్చులు 60 ఎకరాలకు విస్తరించి అదుపు చేయలేని నిస్సహాయ స్థితికి అమెరికన్ యంత్రాంగం చేరింది. మానవ తప్పిదాలు కూడా కార్చిచ్చు పెచ్చరిల్లడాకి కారణమని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు



**వాషింగ్టన్ :** డోనాల్డ్ ట్రంప్ అమెరికా 47వ అధ్యక్షుడిగా పదవీ స్వీకారం చేయనుండగా, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. డెమోక్రాటిక్ అభ్యర్థిగా తొలుత బరిలోకి దిగాలనుకున్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ హఠాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో, అతని స్థానంలో భారత సంతతికి చెందిన కమలా హారిస్‌కు పోటీ చేసే అవకాశం లభించిన విషయం తెలిసిందే. కాగా, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షడు ట్రంప్ బరిలోకి దిగి, హారిస్‌పై గెలుపొందారు. గత ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి బైడెన్ చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు. రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించనున్న ట్రంప్ ఈనెల 20న ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా భారత్‌సహా పలు దేశాల అధినేతలకు అమెరికా ఆహ్వానాలు పంపింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యాక జై శంకర్ ఆ దేశ పరిపాలనా ప్రతినిధులతో చర్చలు జరపనున్నారు. అలాగే, ఇతర దేశాల ప్రముఖులతోనూ చర్చల్లో పాల్గొంటారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్, ఉపాధ్యక్షుడిగా జెడి వాన్స్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, అమెరికా దేశీయ, విదేశాంగ విధానంలో కొత్త దశ ప్రారంభమవుతుందని పరిశీలకుల భావన.



**హిజ్బొల్లాతో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం జరిగి ఆరు వారాలు పూర్తయినప్పటికీ, భారీగా నష్టపోయిన లెబనాన్ ప్రజలు గూడు కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో వేల సంఖ్యలో జనావాసాలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనితో లక్షలాది మంది సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఇళ్లు నష్టపోయిన వారికి యుద్ధ ప్రాతిపదిక మీద ఇళ్లు నిర్మించి ఇస్తామని సెబనాన్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఫలితంగా వేలాది మంది ఇప్పటికీ సహాయక శిబిరాల్లోనే ఉంటున్నారు. కనీస సదుపాయాలు కూడా లేక అల్లాడుతున్నారు.**

# దోహాకు మొస్సాద్ డైరెక్టర్!

## గాజాలో కాల్పుల విరమణపై చిగురిస్తున్న ఆశలు


బెంజిమిన్ నెతన్యాహు

**జెరుసలేం :** కతార్ రాజధాని దోహాకు ఇజ్రాయెల్ నిఘా విభాగం మొస్సాద్ డైరెక్టర్ వెళతారని, అక్కడ హమాస్‌తో పరోక్ష చర్చలు జరుపుతారని సమాచారం. ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజిమిన్ నెతన్యాహు ఈ సూచన చేసినట్టు తెలుస్తోంది. ఇదే నిజమైతే, గాజాలో కాల్పుల విరమణ సాధ్యమవుతుంది. మొస్సాద్ డైరెక్టర్ డేవిడ్ బర్నియా దోహాకు ఎప్పుడు వెళతారన్న విషయంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే ఈనెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో, ఆలోపే కాల్పుల విరమణపై ఒక అవగాహన కుదరవచ్చని అంటున్నారు. తాను గెలిస్తే పాలస్తీనా, ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలికేలా చర్యలు తీసుకుంటానని అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. డెమోక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌పై విజయం సాధించి, రెండోసారి ఆయన అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే గాజా స్ట్రిప్‌లో శాంతి స్థాపన ప్రాధాన్యత సంతరిచుకుంది. హమాస్ ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ 2023 అక్టోబర్ 7న గాజాపై దాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో ఇప్పటి వరకూ సుమారు 50000 మంది మృతి చెందగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ దాడులు ప్రారంభమైన తొలి వారాల్లో మొదటిసారి కాల్పుల విరమణను అమలు పరిచారు. అయితే, ఆ తర్వాత ఇజ్రాయెల్ తిరిగి దాడులు మొదలుపెట్టింది. అమెరికా, కతార్, ఇరాన్ సయోధ్య కోసం జరిపిన చర్చలు ఫలించలేదు. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక కావడంతో, ఇజ్రాయెల్ తన మొండి వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. మొస్సాద్ డైరెక్టర్ బర్నియా కతార్ వెళ్లి చర్చలు జరిపితే, కాల్పుల విరమణ సాధ్యమవుతుందని అంటున్నారు.

# ట్రూడో వారసుడెవరు?


జస్టిన్ ట్రూడో

**ఒట్టావా :** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేసిన తర్వాత, అతని స్థానాన్ని భర్తీ చేయడానికి లిబరల్ పార్టీ సన్నాహాలు చేస్తున్నది. ఈ క్రమంలో పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. కొత్త అభ్యర్థిని ఎంపిక చేసే వరకూ తాను పదవిలో కొనసాగుతానని ట్రూడో ఇదివరకే ప్రకటించగా, పార్టీ అధినాయకత్వం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. భారత సంతతికి చెందిన పార్లమెంటు సభ్యురాలు అనితా ఇందిరా ఆనంద్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అంతా అనుకున్నారు. అయితే, తాను కెనడా ప్రధాని రేసు నుంచి వైదొలగుతున్నట్టు ఆమె ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఓక్విల్లే పార్లమెంట్ ఎంపిగా తనకు ఉన్న బాధ్యతలను నిర్వర్తిస్తానని చెప్పారు. మరోసారి ఎంపిగా పోటీ చేయాలని అనుకోవడం లేదని ఆమె సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు. తనను ఎన్నుకున్నందుకు ఓక్విల్లే ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగంలో సేవలందించాలని అనుకుంటున్నట్లు అనిత పేర్కొన్నారు. 57 ఏళ్ల అనిత ఆనంద్ భారతీయ మూలాలు కలిగిన లాయరు. ఆమె తండ్రి తమిళనాడుకు చెందిన ఫిజీషియన్ కాగా, తల్లి పంజాబ్‌కు చెందిన వారు. అనిత ఆనంద్ 2019లో ఓక్విల్లే నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. ఆ వెంటనే ట్రూడో కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. పలు శాఖల్లో మంత్రిగా పనిచేశారు. ఆమె రేసు నుంచి వైదొలగడంతో, ఇప్పుడు ప్రధాని రేసులో క్రిస్టినా ఫ్రీలాండ్ ముందంజలో ఉన్నారు. ఆమె ఇటీవల ఉపప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో ట్రూడో పాలనావిధానాలపై విమర్శలు చేశారు. ఆ తరువాత స్థానాల్లో మార్క్ కార్నీ, డొమినిక్ లీ బ్లాంక్, మెలనీ జోలీ, ఫ్రాంకోయిస్ ఫిలిప్పీ, క్రిస్టీ క్లార్క్‌తో పాటు భారత సంతతికి చెందిన మరో ఎంపి జార్జ్ చాహల్ పేరు కూడా వినిపిస్తున్నది. వీరిలో ఎవరిని కెనడా ప్రధాన మంత్రి పదవి వరిస్తుందనేది ఉత్కంఠ రేపుతున్నది.

## సాగుయోగిత భూమికే

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలను వ్యవసాయశాఖ సంచాలకులు అప్పగించారు. కాగా ఈ పథకాన్ని గత వానాకాలం మొదటి పంట (ఖరీఫ్) నుంచే అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఇందుకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం, ఆ కమిటీ రైతుభరోసా విధానాలకు రూపకల్పనకు గాను కొంత సమయంతో తీసుకోవడంతో కొంత అలస్యమైంది. దీంతో రైతు భరోసా అమలుకు సంబంధించి రకరకాల ఊహాగానాలు వెలువడడంతో రాష్ట్ర రైతాంగం తీవ్ర ఆందోళనలకు గురైంది. ఇదే క్రమంలో ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసాను ఈనెల 26 నుంచి అమలు చేస్తామని సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా అందుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. అయినప్పటికీ రైతు భరోసా అమలుకు సంబంధించి పూర్తి స్పష్టత లేకపోవడంతో రైతుల్లో ఇప్పటికి కొంత గందరగోళం నెలకుంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను అధికారికంగా ప్రకటించడంతో అందరి ఉహాగానాలకు తెరపడింది.

## పతంగుల పండుగకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంప్రదాయ వంటలు, పంజాబ్, గుజరాత్, కేరళ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు ఇంట్లోనే తయారు చేసిన రకరకాల స్వీట్లను ఫుడ్ కోర్టుల్లో ప్రదర్శించి, విక్రయించనున్నారు. మూడు రోజులపాటు జరిగే వేడుకలకు దాదాపు 15లక్షల మందికి పైగా సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు :**

సంక్రాంతి పండుగ వేళ హైదరాబాద్ నగరవాసులకు కైట్ ఫెస్టివల్‌ను సజావుగా సాగేందుకు ట్రాఫిక్ పోలీసులు కొన్ని ఆంక్షలు విధించారు. పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ సందర్భంగా సికింద్రాబాద్ వద్ద నేటి నుంచి 15వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. రోటరీ ఎక్స్ రోడ్ నుంచి ఎస్‌బిహెచ్‌కు వెళ్లే దారి.. వైఎంసిఎ నుంచి క్లాక్ టవర్‌కు మళ్లింపు చేస్తారు. రసూల్పురా నుంచి ప్లాజాకు వెళ్లే దారి.. సిటిఓ ఎక్స్ రోడ్స్ నుంచి బలంరాయికి మళ్లించారు. పికెట్ నుంచి ఎస్‌బిహెచ్, టివోలికి వెళ్లే మార్గం.. స్వీకార్ ఉపకర్ వద్ద వైఎంసిఎకు మళ్లించారు. ఎన్‌సిసి నుంచి ప్లాజాకు వెళ్లే మార్గం.. టివోలి వద్ద నుంచి బ్రూక్బాండ్‌కు మళ్లించారు. ఈ ఆంక్షల్ని దృష్టిలో పెట్టుకొని.. ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు చేరాలన్న ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్ స్వీట్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు గేట్ నం.1 నుంచి పబ్లిక్ ఎంట్రీకి అనుమతించారు. ఐదు ప్రాంతాల్లో పార్కింగ్‌కు వెసులుబాటు కల్పించినట్లుగా తెలిపారు.

## 26న రైతుల 'నిరసనజ్వాల'

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న విషయం తెలిసిందే. ఇదిలాఉండగా సంయుక్త కిసాన్ మోర్చా ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో సోమవారం నాడు రైతుల డిమాండ్లపై ఎస్‌కెఎంకిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. 76వ గణతంత్ర దినోత్సవమైన జనవరి 26న దేశ వ్యాప్తంగా జిల్లా /రెవెన్యూ సబ్‌డివిజన్ స్థాయిలలో రైతులు ట్రాక్టర్లు/ వాహనాలు/ మోటార్ సైకిల్ ప్రదర్శనలు (పరేడ్స్) నిర్వహించాలని విడుదల చేసిన ఆ ప్రకటనలో తెలిపింది. 'పోరాటంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంటనే కిసాన్ సంస్థలతో చర్చలు జరిపి రైతు నాయకుడు జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని, రైతు వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేక ఎన్‌పిఎఫ్ఎఎంను తక్షణమే ఉపసంహరించుకోవాలని, సి2+50 శాతం వద్ద కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కోసం చట్టాన్ని రూపొందించాలని, చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిన ప్రొక్యూర్‌మెంట్‌తో + 50శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు కవాతు చేస్తారు' అని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన తెలియజేసింది. రైతులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణమాఫీ పథకం విద్యుత్ ప్రైవేటీకరణ చేయొద్దు అని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలని 2013 సంవత్సరం నాటి ఎల్ఎఆర్ఆర్ చట్టాన్ని అమలు చేయాలని, పలు ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రైతులు ఆందోళన చేపట్టారు. ఎన్‌పిఎఫ్ఎఎంకు వ్యతిరేకంగా దాని ప్రతులను దగ్ధం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) అఖిల భారత స్థాయిలో ఉన్నటువంటి తన అన్ని రాష్ట్ర సమన్వయ కమిటీలకు పిలుపునిచ్చింది. ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) సమన్వయ సమావేశం జనవరి 13న ఖనౌరీ సమీప పట్టణమైన పత్రాన్‌లో నిర్వహించబడుతుందని ప్రకటించింది. సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం శుక్రవారం ఖనౌరీలోని నిరసన స్థలాన్ని సందర్శించి కేంద్రంపై సురక్షితమైన రైతుల డిమాండ్లకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం నిర్వహించడానికి రైతుల సంఘాలను అన్నింటినీ ఏకం చేయడానికి ఎస్‌కెఎం (నాన్ పొలిటికల్), కెఎంఎంలను సమన్వయ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించింది. ఈ సమన్వయ సమావేశాన్ని తొలుత జనవరి 15న పాటియాలాలో జరపాలని నిర్ణయించింది.

## రూ.60కోట్ల అప్పుల ఊబిలో మదర్ డెయిరీ!

(మొదటి పేజీ తరువాయి)

అప్పుల సంఖ్య రూ.60 కోట్లకు చేరింది. ఆర్థిక సంక్షోభం కారణంగా పాలు పోసిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. నిజానికి ప్రతి పదిహేను రోజులకు ఒకసారి (ప్రతి నెల 15, 31వ తేదీ) బిల్లులు చెల్లించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం గత నవంబర్, డిసెంబర్‌తోపాటు జనవరి 12 వరకు బిల్లులు చెల్లించలేదు. ఇలా ఇప్పటి వరకు రైతులకు రూ.20కోట్లు బకాయి పడింది.

**అమ్మకానికి 30.5 ఎకరాల భూమి :** ప్రతి నెల ఈ చెల్లింపులు యూనియన్‌కు భారంగా మారడంతో ఆస్తులను అమ్మి అప్పులు తీర్చాలని భావిస్తుంది. పాలసేకరణ, అమ్మకాల ద్వారా వచ్చిన లాభాలతో 2003లో నల్లగొండ జిల్లా, చిట్యాల వద్ద 29 ఎకరాల భూమి సహా మిర్యాలగూడలో 1.5ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. సంస్థకు భారంగా మారిన ఈ అప్పులు తీర్చాలంటే ఆస్తుల అమ్మకం ఒక్కటే పరిష్కార మార్గమని భావించింది. భూమిని విక్రయించగా వచ్చిన సొమ్ముతో అప్పులు చెల్లించాలని భావిస్తుంది. ఆ మేరకు తీర్మానం ఆమోదం కోసం వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేయడం కొసమెరుపు.

## కెనాల్‌కు గండి... (మొదటి పేజీ తరువాయి)

పనుల్లో నాణ్యతా లోపమే ఇందుకు కారణమని చెబుతున్నారు. శాశ్వత మరమ్మతులు చేసి, నీళ్లు రాకుండా చేస్తాం. గత ప్రభుత్వ హాయాంలోనూ గండి పడిందని, శాశ్వత మరమ్మతులు చేసి నీళ్లు రాకుండా చేస్తామని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు. వరదతో నష్టపోయిన కుటుంబాలకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మాజీ ఎంపి మందజగన్నాథం కన్నుమూత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్ కర్నూల్ మాజీ ఎంపి డాక్టర్ మంద జగన్నాథం ఆదివారం మరణించారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. 1951, మే 22న నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఇటిక్యాలలో ఆయన జన్మించారు. జగన్నాథంకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూమార్తె ఉన్నారు. టిడిపి నుంచి మూడుసార్లు, కాంగ్రెస్ నుంచి ఒకసారి (1996, 1999, 2004, 2009) మొత్తం నాలుగుసార్లు ఎంపిగా గెలుపొందారు. కాగా మంద జగన్నాథం మృతి పట్ల పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆయన మరణం పట్ల మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, టిపిసిసి అధ్యక్షులు ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి వారు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపిగా జగన్నాథం చేసిన సేవలను వారు కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో మంద జగన్నాథం క్రియాశీలకంగా పనిచేశారని వారు గుర్తుచేశారు.

**సిఎం రేవంత్ రెడ్డి సంతాపం**

మాజీ ఎంపి మంద జగన్నాథం మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సిఎం సానుభూతిని తెలియజేశారు. నాగర్ కర్నూల్ లోకసభ సభ్యునిగా, సామాజిక, తెలంగాణ ఉద్యమకారునిగా మంద జగన్నాథం పాత్ర తెలంగాణ రాష్ట్రంలో మరువరానిదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారని సిఎం కొనియాడారు. జగన్నాథం మరణం తెలంగాణకు తీరని లోటు అని అన్నారు.

## బేషజాలకు పోము

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో హైదరాబాద్ మెట్రోకు అనుమతి ఇస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వాన్ని నిలదీయడంలో కమ్యూనిస్టులు, బిజెపిలది క్రియశీలక పాత్ర విషయాలను లేవనెత్తడంలో, ప్రభుత్వాన్ని నిలదీయడంలో కమ్యూనిస్టులు, బిజెపి నాయకులు ఎంతో క్రియాశీలక పాత్రను పోషించారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. గతంలో అసెంబ్లీ సమావేశాల్లో పాలక,ప్రతిపక్షానికి ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు, సమావేశాలు పదే పదే వాయిదాలు పడినప్పుడు, కమ్యూనిస్టులు, బిజెపి సభ్యులు అధికార, ప్రతిపక్షాల మధ్య సమన్వయం చేసి, ప్రతిష్టంభనను తొలగించి, సభను సజావుగా నడిపించిన సందర్భాలూ అనేకం ఉన్నాయని సిఎం అన్నారు. తాము అధికారంలోనికి వచ్చిన 13నెల కాలంలో ఏ ఒక్క రోజు కూడా ప్రతిపక్షానికి చెందిన సభ్యున్ని శాసనసభ సమావేశాల నుంచి బహిష్కరించాలని ప్రభుత్వం ప్రతిపాదించలేదని, స్పీకర్ బహిష్కరించలేదని అన్నారు.

**'హైడ్రా, స్కిల్‌యూనివర్సిటీ' అభినందనీయం : విద్యాసాగర్ రావు**

విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ హైడ్రా, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటులో సిఎం ఆలోచన అభినందనీయమన్నారు. గిరిజనుల భూ హక్కులను కాపాడాలని. మహారాష్ట్ర విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ భారతీయతను వదులుకోకూడదనే ఉద్దేశంతోనే బౌద్ధమతంలో చేరారన్నారు. ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ సాంస్కృతిక జాతీయ వాదం అందరిలో ఉన్నదన్నారు. పాలకపక్షాలు, ప్రతిపక్షాలు కలిసిపనిచేసే సంస్కృతి కొనసాగాలన్నారు.

**మనస్పర్థ రాజకీయాలు ఉండొద్దు : బండారు**

బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాజకీయ నాయకులకు విభేదాలు ఉండొచ్చని, వేర్వేరు ఆలోచన విధానాలు ఉండొచ్చని, కానీ మనస్పర్థలు ఉండొద్దని సూచించారు. హరిబాబు మాట్లాడుతూ విద్యాసాగర్ రావు ప్రసంగాలు ప్రజలను ఆకట్టుకునేలా ఉండేవన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ఉనిక పుస్తకం రాజకీయాల్లోకి రావాలనుకునే వారికి స్ఫూర్తినిచ్చే అంశాలు ఉంటాయన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో కీర్తిగాంచిన వ్యక్తులు ఎంతో మంది ఉన్నప్పటివకీ చాలా మంది పేర్లు కూడా తెలియదన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యాసాగర్ రావు పాత్ర ఉన్నదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాల్లో రావాలని అనుకునే వారు ఉనిక పుస్తకం చదవాలన్నారు. బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ విభిన్న ఆలోచనలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ గాంధీతో సమానంగా పోరాటం చేసిన కమ్యూనిస్టు నాయకురాలు అరుణ ఆసఫ్‌అలీని కమ్యూనిస్టు పార్టీ, జన సంఘ్ పార్టీ కలిసి ఢిల్లీ మేయర్‌గా చేశారని ఉనిక పుస్తకంలో పొందపర్చారన్నారు.

## ఆనాటి సంబరమేదీ?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు కాని నాటి తరానికి ముగ్గుల ప్రత్యేకత తెలియంది కాదు. మూడు రోజులపాటు ఏ ఇంటి ముందు చూసినా రంగు రంగుల ముగ్గులు ఒక కొత్త కళను తెచ్చిపెట్టేవి. ఇక రథం ముగ్గుల సంగతి చెప్పాల్సిన పనిలేదు. మూడు రోజుల పాటు జరుపుకునే ఈ పండుగ భోగితో ప్రారంభమవుతుంది. ఇక భోగి మంటలు గురించి ఎన్నెన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. పండుగ కనుమ రోజుల్లోనూ ఏ రోజుకారోజు ప్రత్యేక పూజలు సంబురాలు ఉంటాయి. జనమంత గ్రామాలవైపు పరుగులుపెడుతున్నా ఇదివరికిలా పండుగ రోజుల్లో రచ్చబండ చర్చలు మచ్చుకు కూడా కానరావడం లేదు. గ్రామాలకు చేరిన పట్టణ జనం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ముందేసుకుని కూర్చుంటున్నారు. అలా పలకరిస్తూ బజార్ల వెంట నడుస్తూ రచ్చబండల దగ్గర, గ్రామ కూడళ్ల వద్ద పొగుపడడంలేదు. అసలు మరీ విచిత్రం ఏమిటంటే గ్రామ కూడళ్లకు వచ్చిన వారు సైతం ఎవరి సెల్‌ఫోన్‌లో వారు చూసుకుంటూ వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లు తిరగేస్తూ గడిపేయడం శోచనీయం. ఇక ఇప్పటి తరానికి ఆ ముగ్గుల ప్రత్యేకత తెలియక సిమెంటుతో చేసిన లోగిళ్ల ముందు రంగులతో ముగ్గులు వేస్తూ వాటిపై గొబ్బెమ్మలు పెడుతున్నారు. ఒకప్పుడు సంక్రాంతి అంటే గంగిరెద్దుల ఆటలు ఉండేవి. ఇప్పుడు ఆ వృత్తే కనుమరుగవుతున్నట్లు కనిపిస్తుంది. హరిదాసు కీర్తనలు చెవులకు ఇంపుగా ఉండేవి. ఇప్పుడు హరిదాసుల జాడ అసలే లేదు. సంక్రాంతి వచ్చిందంటే తెల్లజాతి పశువుల మెడలో కొత్త గంటలు, మువ్వలు కట్టేవారు. అవి నడుస్తుంటే ఆ మువ్వల చప్పుడుకు రైతు ఆనందపరవశుడయ్యేవాడు. వ్యవసాయంలో వచ్చిన యాంత్రీకరణ పశువుల సంఖ్యను తగ్గించింది. పశు సంపద లేక పల్లె ఇప్పుడు బోసిపోతుంది. పిండి వంటల సంగతికి వస్తే సంక్రాంతికి అరిసెలు ఓ ప్రత్యేకమైన పిండి వంట. పల్లెల్లో నలుగురైదుగురు కూర్చుని వంటలు చేస్తూ పల్లె ముచ్చట్లు చెప్పుకుంటూ ఉండేవారు. ఇప్పుడు పల్లెల్లోనూ హోంఫుడ్స్ వెలిశాయి. కేజీల లెక్కన అరిసెలు కొనితెచ్చుకుంటున్నారు. పండుగ వాతావరణమే మారిపోతుంది.

ఇక కోడిపందేలపై ఆంక్షలు. ఒకప్పుడు ఒక ప్రత్యేక వారసత్వంగా పరిగణించే కోడి పందేలలో ఇప్పుడు కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇప్పుడు కోడి పందెమంటే అతిపెద్ద జూదం. నిర్వాహకులు సైతం దానిని వ్యాపారంగానే చూస్తూ జూదశాలలు నడిపినట్లు పందెం బరులు తయారు చేస్తున్నారు. అందుకే కోడి పందేలపై ఆక్షంలు మొదలయ్యాయి. ఒకప్పుడు సంక్రాంతి అంటే రైతులకు పంటలు ఇంటికి చేరి సంతోషకర వాతావరణం ఉండేది. పాలకుల వైఖరి, సహకరించని ప్రకృతి, గిట్టుబాటు కాని ధరలు వీటి నడుమ రైతు వేదనలోనే ఉన్నాడు తప్ప మరోక ఆలోచనలో లేదు. అందుకే సంక్రాంతి ఆచార వ్యవహారాల్లోనూ, ఆర్థిక వ్యవహారాల్లోనూ కళ తప్పుతుంది. ఆనాటి నవ్వులు, అప్యాయతలు, పలకరింపులు, సంబురాలు లేవన్నది వాస్తవం. అంతా కృత్రిమమే.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

గత వారం రోజులుగా అడవిని జల్లెడపడుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మావోయిస్టులు భద్రతా బలగాలకు తారసపడ్డారు. దీంతో ముందుగా మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో ఆత్మరక్షణలో భాగంగా పోలీసులకు సైతం ఎదురు కాల్పులు చేశారు. సుమారు రెండు గంటల పాటు ఇరు వర్గాల మధ్య హోరా హోరీ కాల్పులు చోటు చేసుకున్నాయి. మావోయిస్టుల పార్టీ వైపు నుండి కాల్పుల మోతలు ఆగిపోవడంతో వారు అడవుల్లోకి పారిపోయారని భావించి సంఘటనా స్థలంలో పరిశీలించగా రెండు మహిళా మావోయిస్టుల మృత దేహాలతో పాటు మరో మూడు పురుష మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మృత దేహాలతో పాటు సెల్ఫీ లోడింగ్ రైఫల్, రెండు సింగల్ తుపాకులు, షాట్ రైఫల్ గ్రినేట్ లాంఛర్, మూతి లోడింగ్ గన్, పేలుడు పదార్థాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఐజి సుందర్ రాజన్ తెలిపారు. నలుగు మావోయిస్టు మృతదేహాలు కనిపించాయి. వీటితో పాటు మందుగుండు సామాగ్రి, బాణాలు, చెక్క తుపాకులు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 6వ తేదీన మావోయిస్టులు అమర్చిన ఐఇడి బాంబుపేలి 9 మంది భద్రతా బలగాలు ప్రాణం కోల్పోయిన సంగతి విదితమే. కాగా ప్రతీకారేచ్ఛతో ఉన్న మావోయిస్టులు మరేమైనా దాడులకు పాల్పడతారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం కూడా ఐఇడి బాంబు పేలి ఓ జవాన్‌కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం రాయపూర్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు వైర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం 14మంది మావోయిస్టులు హతమయ్యారు. గత ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. ఇదిలా ఉండగా శనివారం ఆ రాష్ట్రంలో సుక్మా జిల్లాలో ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా 9 మంది మావోయిస్టులు పోలీస్‌ల ఎదుట లొంగిపోయారు. వారిలో ఐదుగిరిపై రివార్డు ఉండగా మొత్తంగా 43 లక్షల రివార్డును అందించిన పోలీసులు వారితో కలిసి భోజనం చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాసానికి కావాల్సిన సహాయసహకారాలు అందిస్తుందని, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి

# పాలమూరు జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటాం

### ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** రాష్ట్ర అభివృద్ధికి మనసు పెట్టి పని చేస్తామని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి పాలమూరు జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసే మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభంతో పాటు ఐదు విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపనలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మె ల్యే డాక్టర్ రాజేష్ రెడ్డితో కలిసి ఉపముఖ్యమంత్రి విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రూ.3.45కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి గ్రామం వద్ద బిజినేపల్లి మండలంలోని 18గిరిజన తండాలు, ఐదు గ్రామాల్లోని 7,310 ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు ఆయా గ్రామాలకు తాగునీరు అందించేందుకు 76కోట్ల26 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభోత్సం చేశారు. అనంతరం బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో రూ.2.32కోట్ల వ్యయంతో నిర్మించింది. 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఉప విద్యుత్ కేంద్రాన్ని శంకుస్థాపన పనులను ప్రారంభం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్‌హాలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం చెప్పిందే చేస్తాం, చేసేదే చెబుతాం, మనసు పెట్టి పని చేసి రానున్న ఐదు సంవత్సరాలలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు అన్నిసాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఇతర ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెనకబడిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసి అన్నపూర్ణ జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఎంపి మల్లు రవి మాట్లాడుతూ రైతులకు ఇరిగేషన్ ఎంత ముఖ్యమో విద్యుత్ అనేది అంతే ముఖ్యమన్నారు. మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్‌కు ఒకపెద్ద చరిత్ర ఉందని, గత ప్రభుత్వంలో గిరిజన రైతులను హింస చేసిన ఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. అలాంటి ప్రాజెక్టు ప్రజాప్రభుత్వంలో పూర్తి చేయడం అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేయడం 11నెలల్లోనే పూర్తి చేయడం చాలా సంతోషమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల నివారణకు నిధులు మంజూరు చేశారని, విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేసినందున ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెద్దుల్లా కొత్వాల్, రాష్ట్ర విద్యుత్‌శాఖ సిఎండి ముషారఫ్ ఆలీ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యేకసిరెడ్డినారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# భూ సర్వే కోసం అధునాతన సామాగ్రి

### భూ వివాదాలను పరిష్కరించండి : సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఖమ్మం :** భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని భవిష్యత్తులో భూ వివాదాలకు ఎటువంటి తావు ఉండరాదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొత్త భూ చట్టం అమలులోకి వస్తున్నందున దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఆదివారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ వివాదాలపై ప్రత్యేక దృష్టిసారించి రెవెన్యూ అధికారులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్‌మెంట్ పట్టాలకు సంబంధించి 40 ఏళ్లుగా సాగులో ఉన్న రైతులను గుర్తించి అటవీ శాఖాధికారుల సమన్వయంతో పరిష్కారం చూపాలన్నారు. భూముల సర్వే కోసం అవసరమైతే అధునాతన సామాగ్రిని సైతం అందుబాటులోకి తేస్తామని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ భూ వివాదాలు పరిష్కారం చేసి అదే రీతి రాష్ట్రం మొత్తం అమలయ్యేలా చూస్తామని పొంగులేటి తెలిపారు. అటవీ భూములు, రెవెన్యూ భూముల సరిహద్దులను పక్కాగా తేల్చాలన్నారు. ఖమ్మం జిల్లాలో 15 సర్వే నెంబర్లలో 1500 ఎకరాలు రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు సమస్య ఉందని దీనిని సర్వే చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విదేశాలలో ఉన్న వ్యక్తులకు సంబంధించి కూడా భూములు ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు ఎక్కడ జరుగుతున్నాయి, దీనిపై వస్తున్న ఆదాయం ఎంత అనే నివేదికను తయారు చేయాలనిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభు త్వ ఆదాయానికి గండికొట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లీజు ముగిసిన తర్వాత ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని అటువంటి భూములను గుర్తించి ఇండ్ల నిర్మాణానికి కేటాయించాలని లేదా ఆదాయం వచ్చే ప్రణాళికలను రూపొందించాలన్నారు. నూతన రెవెన్యూ చట్టానికి సంబంధించి నిబంధనలు తయారు చేస్తున్నామని, అధికారులు సలహాలు ఇవ్వాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో లక్షన్నర ఎకరాల అటవీ భూమి ఉందని వీటిలో కొన్ని సమస్యలు ఉన్నాయని మండలాల వారీగా ఉన్న సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఆర్డివోలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు :మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రైతు రుణమాఫీ, సకాలంలో ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు 500 రూపాయల బోనస్ తదితర కార్యక్రమాలతో పాటు ఈ ఏడాది నుంచి రైతులు, వ్యవసాయ కూలీలకు అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, పేద ప్రజలకు ఉద్దేశించిన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక తదితర కార్యక్రమాలతో వ్యవసాయ కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం వెల్లివిరుస్తున్నదని మంత్రి సురేఖ అన్నారు. తెలంగాణ రాష్ట్రం భోగభాగ్యాలతో, సిరిసంపదలతో సమృద్ధిగా వర్ధిల్లాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. పతంగులను ఎగరవేసే సమయంలో చైనా మాంజాను వాడి పశుపక్ష్యాదులకు హాని కలిగించవద్దని మంత్రి యువతను కోరారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో అంతా మంచి జరగాలని మంత్రి సురేఖ భగవంతున్ని ప్రార్థించారు.

## 'నేడు' హైడ్రా ప్రజావాణికి సెలవు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి సోమవారం హైడ్రా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సంక్రాంతి పండుగ సెలవులు కారణంగా ఈనెల 13న ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని హైడ్రా ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ సెలవులలో ప్రజావాణి ఉండదని గతంలో ప్రకటించిన విషయం తెల్సిందే. తిరిగి ఈనెల 20వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హైడ్రా ప్రకటించింది.

# మీలో ఉన్న శక్తిని గుర్తించండి...

### జాతీయ యువజన దినోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అపజయాలకు కుంగిపోవొద్దని.. మీలో ఉన్న శక్తిని గుర్తించి ఆత్మ విశ్వాసంతో అడుగు ముందుకేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు యువతకు సూచించారు. స్వామి వివేకానంద బోధనలను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఆదివారం దోమల్ గూడలోని రామకృష్ణ మఠ్ లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యువతకు దిశా నిర్దేశం చేశారు. 'నేటి తరం యువత చిన్న చిన్న సమస్యలకే కుంగిపోతుందని, ఒక అపజయం ఎదురైతే చాలూ.. మా వల్ల ఏదీ కాదే మోననే నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారని, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లే ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయని వాటన్నింటిని ఎదుర్కొని ముందుకు సాగితేనే విజయం దక్కుతుందని తెలుసుకోవాలన్నారు. యువత తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదు' అని అన్నారు. 'మీ ఆలోచన తీరే మిమ్మల్ని విజయం వైపు నడిపిస్తుందని. మీ తల్లిదండ్రులు, గురువులు.. ఇలా ఎవరో ఒకరు వచ్చి చేయి పట్టి నడిపిస్తారనే భావన నుంచి బయటకు రండి అని పేర్కొన్నారు. మీ జీవితాన్ని మీరే తీర్చిదిద్దుకోవాలంటే క్రమ శిక్షణ, నిరంతర శ్రమ, పాజిటివ్ థింకింగ్‌ను అలవర్చుకోవాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు కావాలి' అని సూచించారు. 'ఈ దేశానికి యువతే నిజమైన ఆస్తి. తాను బాగుంటే చాలూ అనే స్వార్థంతో కాకుండా దేశం కోసం.. సమాజం కోసం ఆలోచించాలన్నారు. మీ చుట్టూ ఉన్న వారికి సాయం చేయండని, అప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. ఆధ్యాత్మిక, మానవత విలువలను అలవర్చుకోండి. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించండి' అని సూచించారు. 'యువతను జాగృతం చేసి సన్మార్గం వైపు నడిపించేందుకు రామకృష్ణ మఠ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. యువతలో జాతీయ భావాన్ని పెంపొందిస్తూ.. వారిలో దాగి ఉన్న శక్తిని వెలికి తీస్తుంది. నేను చదువునే రోజుల్లో ఇక్కడికి అనేక సార్లు వచ్చానని, ఉమ్మడి ఎపిలో మంత్రిగా ఉన్నప్పుడు వచ్చాను. ఇప్పుడు వచ్చాను. ఇక్కడికొచ్చిన ప్రతిసారి నాలో ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుందన్నారు. ఆ ఎనర్జీ నన్ను నా లక్ష్యం వైపుకు నడిపిస్తుంది' అని వివరించారు. కార్యక్రమంలో తులక్ మ్యాగజైన్ ఎడిటర్ గురుమూర్తి, రామకృష్ణ మఠ్ అధ్యక్షుడు స్వామి బోధమయానందా జీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.6 కోట్ల బంగారు ఆభరణాలతో కారు డ్రైవర్ పరార్!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విజయవాడలో డెలివరీ చేయాల్సిన 6 కోట్ల రూపాయల విలువైన 7 కిలోల బంగారు నగలతో ఓ కారు డ్రైవర్ పరారయ్యాడు. సంచలనం సృష్టించిన ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన శ్యాంబాబా జువెల్లర్స్ యజమాని 7 కిలోల బంగారు ఆభరణాలను విజయవాడలోని ఓ దుకాణానికి డెలివరీ చేయాల్సి ఉంది. హైదరాబాద్‌లో ఉంటున్న మధ్యప్రదేశ్‌కు చెందిన జితేంద్ర కారులో తన ఇద్దరు సొంత మనుషులతో వాటిని డెలివరీ కోసం పంపించారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు సమీపంలో టీ తాగేందుకు కారు ఆపారు. ఈ క్రమంలో మిగతా ఇద్దరికీ తెలియకుండా డ్రైవర్ జితేంద్ర కారుతో పరారయ్యాడు. అనంతరం నందిగామ మండలం అడ్డరోడ్డులోని ఓ గోడౌన్ వద్ద కారు వదిలేసి అందులోని ఆభరణాలతో పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, విషయం తెలిసిన నగల వ్యాపారి హైదరాబాద్‌లోని నిందితుడి ఇంటికి వెళ్లగా అతడు ఇల్లు ఖాళీ చేసినట్టు తెలిసింది. దీంతో పక్కా ప్రణాళికతోనే ఈ చోరీకి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు స్వగ్రామం వెళ్లి వుంటాడనే ఉద్దేశ్యంతో సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్‌ల సిసిటివి ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలించారు. ఒక ప్రత్యేక పోలీసు బృందం మధ్యప్రదేశ్‌కు వెళ్లినట్లు తెలిసింది.

# 'జమిలి' బిల్లును అడ్డుకోవాలి

### దేశంలోని లౌకిక పార్టీలకు బివి రాఘవులు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఒకే దేశం ఒకే ఎన్నికల పేరుతో చేస్తున్న కుట్రను అడ్డుకునేందుకు దేశంలోని లౌకిక పార్టీలన్ని ఒక్కతాటిపైకి వచ్చి పార్లమెంట్‌లో ఈ బిల్లును అడ్డుకోవాలని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపునిచ్చారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగనున్న సిపిఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబిభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములుతో కలిసి రాఘవులు మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నికల బిల్లును అమోదింపజేసేందుకు 189వ రాజ్యాంగ సవరణకు ఒడిగట్టిందని రాఘవులు విమర్శించారు. ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందదనే ఉద్దేశంతో సెలెక్ట్ కమిటీకి పంపిందని గుర్తు చేశారు. ఇప్పటికే దేశంలోని చిన్నా చితక పార్టీలను నయానా, బయానో బిల్లు ఆమోదించుకునేందుకు కుట్రలు పన్నుతోందని, ఈ బిల్లుకు ఆమోదం పొందితే దేశంలోని ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదకరమని హెచ్చరించారు. బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్యమైన ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు తెలంగాణలోని బిఆర్‌ఎస్ పార్టీ తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఉంటుందంటూ ఇచ్చిన 7వ హామీ ఆ పార్టీ ఏడాది పాలనలో ఎక్కడా కానరాలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాల బాట పటిందని, తాము దీనిని అడ్డుకునేందుకు ఉద్యమాల బాటకు సంసిద్ధం అవుతున్నామని వెల్లడించారు. ఇందుకు ఈనెల 25 నుంచి సంగారెడ్డిలో జరగనున్న పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు మాట్లాడుతూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన ప్రజా ఉద్యమాలు, సాధించిన విజయాలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, బివి.రాఘవులు హాజరవుతారని వెల్లడించారు. మహాసభ మొదటి రోజైన 25న సంగా రెడ్డిలోని ఇన్స్‌పెక్షన్ బంగ్లా నుంచి చౌరస్తా వరకు ప్రజాప్రదర్శన, భారీ బహిరంగసభ ఉంటుందని తెలిపారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రణాళిక సమీక్ష సమావేశం

# రసాభాస..



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయుచున్న పలు సంక్షేమ పథకాలపై సలహాలు సూచనల కోసం ఏర్పాటు చేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా ఇంచార్జీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరో ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సమక్షంలో జిల్లాలోని 13 నియోజకవర్గాల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తదితరులు హజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయుచున్న పథకాల అమలులో సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఈ క్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతుండగా, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతను ఏ పార్టీ అని, ఎందుకు మైక్ ఇచ్చారని మంత్రులను ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే సంజయ్ కూడా ధీటుగా స్పందించారు. నీది ఏ పార్టీ అంటే నీది ఏ పార్టీ అంటూ ప్రశ్నించుకున్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని సంజయ్ సమాధానం ఇచ్చారు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి కలబడి చేతులతో తోసుకున్నారు. పరస్పరం దూషణలకు దిగారు. పోలీసులు కలగజేసుకుని పాడి కౌశిక్‌ను అడ్డుకున్నారు. దీంతో కొన్ని నిమిషాల పాటు సభా ప్రాంగణం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంతా పరుగున వెళ్లి వారిద్దరిని వారించే యత్నం చేశారు. పాడిని బలవంతంగా పోలీసులు బయటకు తరలించారు. కెసిఆర్ ఫోటో పెట్టుకుని గెలిచిన వారంతా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ప్రతి ఎమ్మెల్యేను ఇలాగే నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై సంజయ్ బదులిస్తూ ముందు పార్టీ ఫిరాయింపులను గతంలో ప్రోత్సహించింది కేసిఆర్, కేటిఆర్‌లు ముందు రాజీనామా చేయాలని, తాను జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తానని త్వరలో పార్టీలో చేరుతానని మీడియాకు తెలిపారు. పాడి మీద తానెలాంటి ఫిర్యాదు చేయదలచుకోలేదని సంజయ్ స్పష్టం చేశారు.

**రౌడీయిజాన్ని సహించం.**

ఈ సమావేశంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేయడాన్ని మంత్రులు ఉత్తం, శ్రీధర్, ప్రభాకర్‌లు ఖండించారు. సలహాలు సూచనలు అడిగిన వేదికపై రాజకీయాలు ఏంటని వాపోయారు. యువ రాజకీయ నాయకులు అందరికి ఆదర్శనీయంగా ఉండాలన్నారు. ఇలాంటి రౌడీయిజాన్ని గుండాయిజాన్ని తాము గతంలో చూడలేదని ఉత్తం పేర్కొన్నారు. తమ పార్టీ ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. పాడి చర్యపై కేసిఆర్, కేటిఆర్ సమాధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. మీడియా ముందు ఇలాంటి చిల్లర పనులతో హీరోలు కావొద్దని హితవు పలికారు.

# శాంతిభద్రతలు కాపాడాలి

### రాష్ట్రంలో హింసా రాజకీయాలపై కేంద్రం జోక్యం చేసుకోవాలి : మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ సర్కార్ రైతులను నట్టేట ముంచిందని.. గ్రామాలకు వస్తే రైతులు నిలదీస్తున్నారని... సిఎం రేవంత్‌రెడ్డి నుండి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకుండా అని మాజీ మంత్రి హరీష్‌రావు సూటిగా ప్రశ్నించారు. తాను బహిరంగచర్చకు సిద్ధమని సిద్దిపేట ఎంఎల్‌ఏ హరీష్‌రావు సవాల్ చేశారు. ఎకరానికి 9వేల రూపాయలను ఏటా రైతులను ప్రభుత్వం ముంచుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఊర్లోకి వస్తే ఎకరానికి 15 వేల రూపాయలు రైతుభరోసా ఇవ్వాలని నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక్క పంటకు సైతం సక్రమంగా ఇవ్వటం లేదన్నారు. కౌలు రైతులకు ఇవ్వటం లేదని, ఎన్నికల ముందు నోరు పెంచి హామీలిచ్చారన్నారు. ఎకరానికి 15వేలు ఇస్తానని చెప్పి 9 వేలు ఎగ్గొట్టి ఆరువేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. కోటి మంది ఉపాధి హామీ కూలీలుంటే 10 లక్షల మందికి ఇస్తామంటున్నారన్నారు. ఉపాధిలో 90లక్షల మందికి ఎగ్గొట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అడుగడుగునా దగా చేస్తూ రైతులను నట్టేట ముంచారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను సైతం విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రతి పంటకు బీమా అని చెప్పి ఒక్క పంటకే మాత్రమే ఇచ్చారన్నారు. కాంగ్రెస్ సర్కార్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా రైతులు తిడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు తమను ప్రశ్నించకుండా ఉండేందుకు డైవర్షన్ పాలిట్రిక్స్ చేస్తున్నారన్నారు. సంక్షేమంలో విఫలమైన సిఎం రేవంత్‌రెడ్డి హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. యాదాద్రిలో బిఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని పోలీసులే ప్రోత్సహించినట్లు కన్పిస్తుందన్నారు. హోంమంత్రే, ముఖ్యమంత్రిగా ఉండి హింసాత్మక సంఘటనలకు ప్రోత్సహిస్తే పెట్టుబడులు వస్తాయా? ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దాడుల సంస్కృతి మారకుంటే కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టైన శాంతిభద్రతలను కాపాడలన్నారు. రాష్ట్రంలో 23 శాతం క్రైం రేటు పెరిగిందని, మత కలహాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను అరికట్టేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని హరీష్‌రావు కోరారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నేతలు మాజీ ఎంఎల్‌సి ఫారుక్ హుస్సేన్, గుండు భూపేశ్, లక్ష్మి రాజం, కాముని శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు గ్యాదరి రవీందర్, వజీర్, నాగరాజురెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి యువత పాటుపడాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వామి వివేకానంద సందేశాలతో యువత స్ఫూర్తి పొంది దేశాభివృద్ధి కోసం పాటు పడాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో స్వామి వేవేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం స్వామి వివేకానంద కృషి చేశారని కొనియాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రతల కోసం యువత కృషి చేయాలన్నారు. టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ ఎల్లప్పుడు యువతను ప్రోత్సహిస్తుందన్నారు. రాజకీయాలలో యువత ముందుడాలన్నారు. నాంపల్లి నియోజకవర్గానికి చెందిన ఎం.ఏ. సిద్దికి తన సహచరులతో కలిసి అరవింద్ కుమార్ గౌడ్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి అరవింద్ కుమార్ గౌడ్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, నాయకులు పి.బాలకృష్ణ, విట్టల్, కట్ట రాములు, వినోద్, ఎస్.ఎం.లయీఖుద్దీన్, ఎస్.కె. రబ్బాని పాల్గొన్నారు.

# సాహితీ విహారి

# కశ్మీర్ గురించి.. ఉన్నది ఉన్నట్టు..


అతిశయోక్తులు... అభూతకల్పనలు లేకుండా, ఉన్నది ఉన్నట్టు చెప్పడానికి చాలా ధైర్యం కావాలి. ఇక కశ్మీర్ వంటి అత్యంత సున్నితమైన, సమస్యాత్మకమైన అంశాన్ని ఇతివృత్తంగా ఎంచుకుంటే కత్తిమీద సాము తప్పదు. విమర్శలకు సిద్ధపడాలి.. బెదిరింపులను తట్టుకోవాలి.. పక్షపాత వైఖరి లేకుండా నిజాలను రచనలో ప్రతిబింబించగలగాలి. బ్రిటిష్ ఇండియా అస్తమించి, భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరించిన తర్వాత, కశ్మీర్ అంశాన్ని చాలా మంది ప్రస్తావించారు. ఎన్నో పుస్తకాలు రాశారు. ఒకొక్కరూ ఒక్కో కోణంలో సమస్యను విశ్లేషించారు. అయితే, 2019 ఆగస్టు 5వ తేదీన జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను భారత ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిన తర్వాత, ఈ అంశంపై చెప్పుకోదగిన పుస్తకాలు రాలేదు. రచనలపైనా రాజ్యం నిబంధనలు విధిస్తుందని చెప్పడానికి ఇదో నిదర్శనం అనుకోవచ్చు. భారత్, పాకిస్తాన్ దేశాలు కశ్మీర్‌పై తమతమ వాదనను బలంగా వినిపిస్తున్నాయి. తదనుగుణంగానే అంతర్జాతీయ వేదికలపై స్పందిస్తున్నాయి. అయితే, కశ్మీరీలు ఏం కోరుకుంటున్నారు? అక్కడి సామాన్య ప్రజల అభిప్రాయం ఏమిటి? 370 ఆర్టికల్ రద్దు తర్వాత వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయి? వంటి వివిధ కోణాలను ఎవరూ స్పృశించలేదు. అయితే, ఆ లోటును శుభ్ మాథర్, మీర్జా సాయిబ్ బేగ్ సంపాదకత్వంలో వచ్చిన పుస్తకం 'లైఫ్ పాలిటిక్స్ అండ్ రెసిస్టెన్స్ ఇన్ కశ్మీర్ ఆఫ్టర్ 2019' తీరుస్తున్నది. అమెరికాకు చెందిన లెక్సింగ్టన్ పబ్లిషర్స్ ఈ పుస్తకాన్ని 'ఎ మల్టీ డిసిప్లినరీ అండర్‌స్టాండింగ్ ఆఫ్ కాన్‌ఫ్లిక్ట్' (ఘర్షణలను పలు కోణాల్లో పరిశీలించడం) అనే ట్యాగ్‌లైన్‌తో ప్రచురించింది. ఇందులో కశ్మీరీల స్వరాలే వినిపిస్తాయి. వారి అనుభవాలే కనిపిస్తాయి. 370 ఆర్టికల్ రద్దు తర్వాత నెలకొన్న పరిస్థితులు, అప్పటి నుంచి ఇప్పటి వరకూ మారిన జీవన విధానాల వాస్తవికతను ఆ పుస్తకం హైలైట్ చేస్తున్నది. సమస్యకు కేంద్రమైన కశ్మీరీల ఆకాంక్షలను వివరిస్తూ, భారత్, పాకిస్తాన్ చేస్తున్న వాదనలను... వినిపిస్తున్న కథనాలను రచయితలు సవాలు చేశారు. ఇలాంటి అభిప్రాయాలు తరచు ప్రజల రాజకీయ డిమాండ్లను బయటకు రానివ్వకుండా అడ్డుకుంటాయి. అంతర్ దృష్టితోనూ.. క్రమశిక్షణతోనూ అందించిన సమాచారం కాబట్టే, కొందరికి ఈ పుస్తకం రుచించకపోవచ్చు. కానీ, కశ్మీర్ గుండె చప్పుడు తెలుసుకోవాలనుకునే ఎవరినీ ఈ పుస్తకం నిరాశపరచదు. 2019 తర్వాత కశ్మీర్‌లో ప్రజా జీవితం, రాజకీయ ముఖచిత్రం, ప్రతిఘటనల పర్వం, సంఘర్షణల వైనం ఇందులో ప్రముఖంగానూ, ప్రస్ఫుటంగానూ ఉంటాయి. శుభ్ మాథుర్, మీర్జా సాయిబ్ బేగ్‌తోపాటు అమాన్, సబ్జార్ అహ్మద్ భట్, మిహిర్ దేశాయ్, క్లిఫ్టన్ డి రోజారియో, అఫ్రీన్ ఫరీదీ, షిన్జానీ జైన్, కుష్‌దీప్ కౌర్ మల్హోత్రా, అర్మాన్ కజ్మీ, ఫోజియా నజీర్ లోన్, మదీహా మాజిద్, ఫ్రెనీ మానెక్‌షా, అన్నపూర్ణ మీనన్, సాకిబ్ అమీన్ పారే, అమిత్ సేన్, స్వాతి శేషాద్రి, జంగ్ విజయ్ సింగ్, సుస్మిత, ఈమన్ తల్వా, సారంగ ఉగాల్‌ముగ్లే తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. కశ్మీర్ అంతటా జరుగుతున్న పోరాటాలపై విశిష్టమైన, సూక్ష్మమైన దృక్పథాన్ని అందించారు. కశ్మీరీల దైనందిన జీవితాలు, రాజకీయ ప్రతిఘటనలు ఎన్నడూ అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావనకు రావు. కశ్మీర్ సమస్యకు రాజకీయ రంగు అద్ది, మతం ముసుగు తొడిగి, ఎవరికి తోచిన రీతిలో వారు ఇంత వరకూ ఇచ్చిన, ఇస్తున్న విశ్లేషణలకు, అధ్యయనాలకు భిన్నంగా ఈ పుసతకం ఉంది. అంతర్జాతీయ మీడియాలో సవాలు చేయని ఎన్నో ప్రశ్నలకు ఇక్కడ సమాధానాలు లభిస్తాయి. 370 ఆర్టికల్‌ను భారత్ ఏకపక్షంగా రద్దు చేసిందన్న విమర్శలు నిత్యం వినిపిస్తునే ఉన్నాయి. ప్రభుత్వం తరపున అణచివేతలు కొనసాగుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు నిత్యం విమర్శించడాన్ని చూస్తునే ఉన్నాం. దేశ భద్రత పేరుతో ప్రజల గొంతుకలపై ఉక్కుపాదం మోపుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో, నిజానిజాలపై సహజంగానే అనుమానాలు తలెత్తుతాయి. వాస్తవాలు ఏమిటో తెలుసుకోవాలన్న జిజ్ఞాస పెరుగుతుంది. మానవ హక్కుల హననంపై వస్తున్న ఆరోపణల్లో నిజానిజాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని మానవతావాదులంతా కోరుకుంటున్నారు. ఇలాంటి ప్రత్యేకమైన పరిస్థితుల్లో వచ్చిన 'లైఫ్ పాలిటిక్స్ అండ్ రెసిస్టెన్స్ ఇన్ కశ్మీర్ ఆఫ్టర్ 2019' ఇజాల జోలి లేకుండా నిజాలను వెల్లడించడం ప్రశంసనీయం. కశ్మీర్ చరిత్రలో 370 ఆర్టికల్ రద్దు ఒక కీలక ఘట్టం. చరిత్ర, రాజకీయ శాస్త్రం, మానవ శాస్త్రం, చట్టం, సాహిత్యం, విద్య, మానసిక ఆరోగ్యం, పర్యావరణ అధ్యయనాల నుంచి 25 సవరించి న అధ్యాయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఆర్టికల్ 370 రద్దుపై ప్రముఖ జర్నలిస్ట అనురాధ భాసిన్ పుస్తకం 'డిస్‌మాంట్లింగ్ స్టేట్' తర్వాత, అదే అంశంపై వచ్చిన రెండో పుస్తకం ఇది. మొదటి పుస్తకంలో రచయిత్రి అభిప్రాయా లు లేదా విశ్లేషణలు ఉన్నాయి. కానీ, తాజా పుస్తకంలో ఎంతో మంది జరిపిన అధ్యయనాలు, పరిశీలనల వివరా లు కొలువుతీరాయి. కశ్మీర్ సంఘర్షణను చారిత్రక లేదా రాజకీయ విశ్లేషణకు మాత్రమే పరిమితమైన సమస్యగా పరిగణించకుండా, ఇది వరకే చెప్పినట్టు చట్టం, మానవ శాస్త్రం, చరిత్ర, రాజకీయ శాస్త్రం, లింగం, మానసిక ఆరోగ్యం, పర్యావరణం, మతం తదితర కోణాలను ఈ పుస్తకం ఏకీకృతం చేస్తుంది. సాధారణ పాఠకులు కశ్మీర్ వివాద బహుముఖ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. 2019 తర్వాత కాశ్మీరీ జీవితంలోని చి క్కులను చూడడానికి వీలు కల్పిస్తుంది. ప్రత్యేకించి ఆర్టిక ల్ 370 చదివిన తర్వాత, దానిని తొలగించడం వల్ల ఎదురవుతున్న పరిణామాలు, పర్యవసానాలపై విస్పష్టమైన అవగాహనను కల్పిస్తుంది. కశ్మీర్ రాజకీయాలపై ఇందు లో లోతైన అధ్యయనాలు ఉన్నాయి. అలాంటి ప్రయత్నా లు ఇది వరకూ జరిగాయి. అయితే, ఈ రాజకీయ అధ్యయనం ఒకే వాదనకు కట్టుబడి లేకపోవడంతో, సమగ్రతకు ఆస్కారం ఏర్పడింది. అంతేగాక, మానవతా కోణం లో అక్కడి ప్రజల జీవితాలను అధ్యయనం చేయడం ఈ పుస్తకానికి ప్రత్యేకతను సంపాదించిపెట్టింది. అందుకే, ఈ పుస్తకంలో ప్రతి ఘటనల వ్యక్తిగత కథలు అధ్యాయాల అంతటా స్పష్టంగా కనిపిస్తాయి. రాజకీయ తిరుగుబాటు ను అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి. రాజ్య అణచివేతను ఎదుర్కొంటూ, తమ గుర్తింపును నిలబెట్టుకోవడానికి, స్వరాన్ని వినిపించడానికి ప్రజలు చేస్తున్న ప్రయత్నాలు, కొనసాగిస్తున్న పో రాటాలు విస్తృత శ్రేణిలో పాఠకులను పలకరిస్తాయి. ఉదాహరణకు 1947 ఇన్‌స్టుమెంట్ ఆఫ్ యాక్సెషన్‌పై ఫోజియా నజీర్ లోన్ విశ్లేషణ కశ్మీర్ సమస్యపై అవగాహనకు కొత్త గవాక్షా న్ని తెరుస్తుంది. కశ్మీర్‌పై భారత దేశం చేస్తున్న దావాలో ఉన్న అస్పష్టతలను, లుకలుకలను బహిర్గతం చేస్తుంది. ప్రపంచ మానవ హక్కు ల సూత్రాలతో ప్రతిధ్వనిస్తూ, ప్రజాభిప్రాయ సేకరణపై నెరవేరని వాగ్దానాన్ని ప్రశ్నిస్తుంది. అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనను కూడా ఫోజియా అధ్యయన వ్యాసం ప్రస్తావిస్తుం ది. మిహిర్ దేశాయ్, సారంగ ఉగాల్‌ముగ్లే తమతమ వ్యాసాల్లో, 2019 ఆగస్టులో భారత ప్రభుత్వం 370 అధికరణను రద్దు చేసిన తర్వాత, అప్పటి వరకూ ఉన్న స్వ యంప్రతిపత్తి క్షీణతను, తద్వారా ప్రజలకు ఎదురవుతు న్న సమస్యలను విశ్లేషణాత్మకంగా వివరించారు. కాగా, ఈ పుస్తకం కోర్టులు విస్తరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్తుంది. 2019 ఆగస్టు 5 నుంచి 2020 ఆగస్టు 6వ తేదీ వరకూ దాకలైన సుమారు 600 పిటిషన్లలో ఇప్పటి వర కూ కేవలం ఒక శాతం మాత్రమే పరిష్కారమయ్యా యి. సాక్ష్యాధారాల కంటే అనుమానాల ఆధారంగా నిర్బంధాలను సమర్థిస్తున్నారని, వాటి చట్టబద్ధతను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని హైకోర్టు విమర్శించిన వైనా న్ని ఈ పుస్తకం గుర్తు చేస్తుంది. పాలనాపరమైన అంశాలను సవాలు చేయడానికి మార్గాలు దాదాపు లేకపోవ డం, ఒకవేళ పిటిషన్లు వేసినా, ఏదో ఒక కారణంగా అవి అపరిష్కృతంగా ఉండిపోవడం వల్ల న్యాయం లభించని వైనాన్ని కొందరు ప్రస్తావించారు. సైనికులను మోహరిం ప చేసి, పరిస్థితులు చక్కబడ్డాయని, కశ్మీర్ అభివృద్ధి పథం లో పరుగులు తీస్తున్నదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల్లో డొల్లతనాన్ని మీర్జా సాయిబ్ బేగ్ ఎం దగట్టారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రచురించిన డేటా ప్రకారం, 2020–2022 మధ్య, జమ్మూ కాశ్మీర్‌లో 947 చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కేసులు నమోదయ్యాయి. వీటిలో 2020 లో 287, 2021లో 289, 2022లో 371 కేసులు ఉ న్నా యి. అదే సమయంలో భారతదేశం అంతటా మొత్తం 2,615 ఉపా కేసులు నమోదయ్యాయి, అంటే దేశం మొ త్తం మీద నమోదైన ఉపా కేసుల్లో దాదాపు 40 శాతం ఇక్కడే ఉన్నాయి. ఈ వివరాలను 'లైఫ్ పాలిటిక్స్ అండ్ రెసిస్టెన్స్ ఇన్ కశ్మీర్ ఆఫ్టర్ 2019' అందించింది. తద్వా రా కశ్మీర్ జీవితాలపై లోతైన వీక్షణాన్ని కల్పిస్తున్నది. అదనంగా, పర్యావరణ క్షీణత, వనరుల వెలికితీత, సైనికీకరణ మధ్య సంబంధాన్ని అన్వేషించే ఇతర అధ్యాయాలు కూడా ఇందులో ఉన్నాయి. వ్యాసాలు పర్యావరణ దుర్బలత్వం, దోపిడీ అభివృద్ధి మధ్య అనిశ్చిత సమతుల్యతను వ్యక్తపరుస్తాయి, సంఘర్షణ ప్రాంతాలలో ప్రపంచ పోరాటాలను ప్రతిధ్వనిస్తాయి.అఫ్రీన్ ఫరీది, అర్మాన్ కజ్మీ తమతమ వ్యాసాల్లో సంచార తెగలు, మతపరమైన మైనారిటీల దుస్థితిని హైలైట్ చేస్తారు. అయితే అన్నపూర్ణ మీన న్ విద్య, మీడియా ద్వారా భారత రాజ్య విచక్షణాత్మక నియంత్రణను విమర్శిస్తున్నారు. పుస్తకం బాగా అందించిన మరో అంశం కశ్మీర్‌లోని వివిధ సమూహాల ప్రతిబింబాలు. కశ్మీర్ రీడింగ్ రూమ్ నిర్వహించిన దివంగత సంపత్ ప్రకాష్ ఇంటర్వ్యూ రూపంలో ఈ పుస్తకంలో కశ్మీరీ హిందువుల దృక్పథం నిక్షిప్తమై ఉంది. ఖుషీ కౌర్, జంగ్ విజయ్ సింగ్ కశ్మీర్ సిక్కుల జీవన దృశ్యాలను ఆవిష్కరించారు. అలా చేయడం ద్వారా, ఈ పుస్తకం కశ్మీర్‌లో ముస్లిమేతర సమూహాల గురించిన వివరాలు, వాస్తవాలు వెలుగు చూశాయి. కశ్మీర్‌పై ఆధిపత్య వాదనల్లో తరచుగా ఈ సమూహాలను విస్మరిస్తారు. కశ్మీర్‌లో నిశ్శబ్దంగా పెరుగుతున్న ప్రతిఘటన విధానాలపై ఈ పుస్తకం పదునైన విమర్శను కూడా అందిస్తుంది. ఈ ప్రతిఘటనను కేవలం రాజకీయ కోణంలో మాత్రమే చూడడానికి వీల్లేదు. సాంస్కృతిక, వ్యక్తిగత అంశాలతోనూ ముడిపడి ఉంటుంది. పురుషులు, మహిళలు, యువకులు, అట్టడుగు వర్గాల వారి జీవితాలపై ఆధిపత్యం చెలాయించే ఆధిపత్య శక్తులను సవాలు చేయడానికి చేసే ప్రయత్నాలను ఈ పుస్తకం మనకు పరిచయం చేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, కశ్మీర్‌ను ఈ పుసతకం యథాతథంగా మన ముందు ఉంచుతుంది. నిష్పాక్షిక విశ్లేషణను అందిస్తుంది. ఆర్టికల్ 370 రద్దుకు ముందు, ఆ తర్వాత పరిస్థితులను సమతూకం చేసి, విమర్శనాత్మక వాస్తవాలను ప్రతిబింబిస్తుంది. రాజ్య హింస నుంచి అణచివేతల వరకూ... మత మౌఢ్యం నుంచి మానవత్వ విలువల హననం వరకూ ఎన్నో అంశాలను ప్రస్తావించిన 'లైఫ్ పాలిటిక్స్ అండ్ రెసిస్టెన్స్ ఇన్ కశ్మీర్ ఆఫ్టర్ 2019' సాధారణ పుస్తకం కాదు. అందుకే, ప్రతి ఒక్కరూ దీనిని చదివి, ఆలోచించి, వాస్తవాలు గ్రహించాల్సిన అవసరం ఉంది.





– సత్యశ్రీ

# 'మరణం' నా చివరి చరణం కాదు... 'మౌనం' నా చితాభస్మం కాదు

కుంచెని, కెమెరా లెన్సుని, కలాన్ని ఏకం చేసి తెలుగు కవితకు పుష్టి చేకూర్చి , అనేకమైన కవిత పంక్తులతో సంక్షిప్తతనీ ,వస్తువులో జీవిత విస్తృతినీ,సమాజ లోతుల్నీ, నర్మగర్భంగా పదునైన పంక్తులను నరనరాల్లో రుధిరాన్ని కాల్చే కొలిమిలా, విస్ఫోటనం గావించిన సామాన్య అక్షర మాంత్రికుడు. గజ్జెకట్టి కరాళ నృత్యం చేస్తున్న క్షుద్ర రాజకీయలపై ఉక్కుపాదాన్ని తూటాల్లా పేల్చిన సమర శంఖం.ఆకాశమంతా అనంత భావాల్ని ,నవ యుగానికి ధిక్కార కవిత్వముతో స్ఫూర్తి రగిలించిన సాహిత్య ప్రభాకరుడు.సామాజిక రుగ్మతలపై ,విప్లవ కిరణాల ప్రసరింప చేసి కష్టజీవి కన్నీటి చెమట చుక్కలను చరిత్ర రక్తాక్షరాలతో చురకలను అంటించి , జనుల నాడులను తద్దైక దూర దృష్టితో దర్శించి బాధితుల పక్షాన నిలబడి గుండెల్లో గుచ్చుకునేలా చెంప చెళ్ళు మనేలా సూటిగా వాడుక పదాలతో వ్యక్తపరచి ప్రభజంనం సృష్టించిన నిత్య కార్మిక పదునైన అక్షర భాస్కరుడు అలిశెట్టి ప్రభాకరుడు. 1954 జనవరి 12న జగిత్యాలలో అలిశెట్టి చినరాజం,లక్ష్మి దంపతులకు జన్మించాడు. భార్య భాగ్య, కుమారులు సంగ్రామ్, సంకేతులతో నివాసం. యుక్త వయస్సులోనే మొదట పత్రికలకు , సినీ నటుల బొమ్మలను గీస్తూ ఆర్టిస్ట్‌గా ఎదిగాడు. తర్వాత సాహితీ మిత్ర దీప్తి పరిచయంతో కవిత్వ రంగంలోకి ప్రవేశించాడు. జీవనం కోసం జగిత్యాలలో స్టూడియో పూర్ణిమ , కరీంనగర్ జిల్లాలో స్టూడియో శిల్పి, హైదరాబాద్‌లో స్టూడియో చిత్రలేఖ ఏర్పాటు చేసి ఫోటోగ్రాఫర్‌గా జీవిత ప్రస్థానం సాగించాడు. కుంచె బొమ్మల్నీ, కెమెరా బంధించిన ఫోటోల్నీ తన కవిత్వానికి ఆసరా చేసుకున్నాడు. తాను చెప్పే భావాల్నీ వెలిగించే దివిటీలుగా మార్చుకున్నాడు.తన కవిత్వ అక్షరాలతో ,సృజనాత్మకతతో సునాయాసంగా ప్రజలకు అర్థమయ్యేలా, నిర్మోహ మాటంగా కలంతో అక్షర సిరాలను అందించ డం చేశాడు. విభిన్నమైన కవిత్వాలు వెలువడుతున్న సమయంలో పేదరికంలోని మరింత పేదరికానికి, బాధల నుండి మరింత బాధలకి కన్నీళ్ళను కవితా వస్తువుగా చేసుకొని కవితలు రాశాడు. .ఎర్ర పావురాలు,.మంటల జెండాలు, చురకలు, రక్తరేఖ, ఎన్నికల ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్ మొదలలైనవి రాశాడు. అలిశెట్టి ప్రభాకర్ కవితల పుస్తకం లోని మచ్చుతునక రవ్వలు కొ న్ని ...గొంతు కోస్తే/పాట ఆగిపోదు/ అది.. ముక్తకంఠం/గొలుసు లేస్తే/పోరు నిలిచిపోదు/ అది..ప్రజాయుద్ధం ... అని ఒక కళాకారుడి మీద హత్యాయత్నం జరిగినప్పుడు చలించి అతని సిరాలోంచి జనించిన కవిత్వ పంక్తులివి. 'భయం' అనే కవితలో బాంబుని చూడగానే / బెంబేలు పడితే / అదెప్పుడూ /నీ గుండెల్లోనే పేలుతుంది.. అని దేనిని చూసి భయాందోళన చెందకూడదని ధైర్యాన్ని భయపడితే అది నీ గుండెల్లోనే రోజు పేలుతుందని ఉద్ఘాటించారు. తన శవమై / ఒకరికి వశమై /తనువు పుండై /ఒకడికి పండై /ఎప్పుడూ ఎడారై / ఎందరికో ఒయాసి స్సు ... అని ఒక వేశ్య గురించి ఇంత గొప్పగా ఏ కవి చెప్పలేదని చిన్న పంక్తులతో అనంతభావాల్ని కవితలను పేర్చ డం ఒక్క అలిశెట్టి ప్రభాకరుడికే సాధ్యమని నిరూపించిన తెలంగాణ అక్షర ఆయుధం. ఏ కవిత రాసిన దానిలో పరమార్థంతో నిజ నిజాలను నర్మగర్భంగా గోచరిస్తుంది. నిజనిజాలను రాయడంలో అందెవేసిన చెయ్యి. కవిత్వమునే శ్వాసగా ఆశగా అనుభూతి, భక్తి ,ముక్తి , సరసం వినోదానికి పరిమితమైన పాఠకుల మనసులను ప్రగతిశీల ఆలోచనా ధృక్పథంలోకి మళ్ళించ గల నేర్పరి అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అనేకమైన మినీకవితాలు రాస్తూనే 1993 జనవరి 12న కన్ను మూసిన పదునైన కవిత్వ అక్షర సూరీడు అమరుడైన అలిశెట్టి ప్రభాకరుకు జోహార్లతో సాహిత్యాభి వందనములు అందించడం , స్మరించుకోవడము సాహిత్య అభిమానులుగా మనందరి కర్తవ్యం.


నేడు అలిశెట్టి జయంతి , వర్ధంతి


డాక్టర్ పగిడిపల్లి సురేందర్,
80748 46063




## కవి ప్రశ్నకు చిత్రకారుడి సమాధానం

ఎన్నో మాటలు చెప్పలేని భావాన్ని ఒక చిత్రం చెబుతుందని అంటారు. ఈ పెయింటింగ్ అలాంటిదే. టర్కీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు అబిదిన్ డినో సృష్టించిన ఈ చిత్రం వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. టర్కీ సాహితీవేత్తల్లో అగ్రశ్రేణిలో నిలిచే నజీమ్ హిక్మత్‌కు ఒకసారి 'ఆనందం' అంటే ఏమిటనే ప్రశ్న తలెత్తింది. ఎంతమంది, ఎన్నిరకాల సమాధానాలిచ్చినా అతనికి సంతృప్తి లేకపోయింది. చివరికి తన స్నేహితుడు, చిత్రకారుడు డినో వద్దకు వెళ్లి సమస్యను వివరిస్తాడు. కవులు మాటల్లో చెప్తే, తాను చిత్రకారుడ్ని కాబట్టి చిత్రం ద్వారానే సమాధానమిస్తానన్న డినో ఈ బొమ్మ వేశాడు. ఇరుకు గది.. అందులో విరిగిన మంచం... ఒకవైపు కోడు స్థానంలో రాళ్లు.. అలాంటి మంచంపైనే ఆరుగురు పిల్లలు.. ఇద్దరు పెద్దలు.. ఓ కుక్క.. ఓ పిల్లి.. సుఖంగా నిద్రపోతున్న అందరి మొహాల్లోనూ అంతులేని ఆనందం.. సంతృప్తి. తన వంతు కోసం ఎదురూస్తున్న కోడి.. జంట పక్షుల కిలకిలారావాలు కూడా ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.
ఈ పెయింటింగ్ చూసిన తర్వాత, తన ప్రశ్నకు సమాధానం దొరికిందని చెప్తాడు హిక్మత్. 'ఆనందం అంటే బాధలు లేకపోవడం కాదు...అవి ఉన్నాయని తెలిసినా, సర్దుకుపోయి జీవితాన్ని సుఖమయం చేసుకోవడమే నిజమైన సంతోషానికి అర్థం' అంటాడు హిక్మత్.

## దార్శనికుడు వెండెల్ బెర్రీ



అమెరికా రచయిత, పర్యావరణ ప్రేమికుడు వెండెల్ బెర్రీ అసాధారణ ప్రతిభావంతుడు. ప్రకృతి ఆరాధకుడు. వ్యవసాయ రంగ ప్రధాన్యాన్ని వివరిస్తూ, పారిశ్రామికీకరణ తెచ్చిపెట్టే విష సంస్కృతిని కొన్ని దశాబ్దాల క్రితమే హెచ్చరించిన దార్శనికుడు. 1934 ఆగస్టు 5న కెంటకీలోని హెన్రీ కౌంటీలో జన్మించిన బెర్రీకి గ్రామీణ జీవితం అంటే చాలా ఇష్టం. గ్రామాల్లో కనిపించే సహజ సౌందర్యాన్ని కాపాడుకోవాలని, పర్యావరణానికి అనుకూలంగా జీవించాల్సిన అవసరాన్ని అతని రచనలు నొక్కి చెప్తున్నాయి. కవిగా, నవలా రచయితగా, పర్యావరణ కార్యకర్తగా గుర్తింపు సంపాదించిన బెర్రీ తరచు భూమికి, మనిషికి మధ్య ఉన్న సంబంధం గురించి, దానిని కాపాడుకోవాల్సిన అవసరం గురించి వివరిస్తాడు. 'ది అన్‌సెట్లింగ్ ఆఫ్ అమెరికా: కల్చర్ అండ్ అగ్రికల్చర్ (1977) వంటి అతని రచనలు, సాంప్రదాయ వ్యవసాయ సమాజాలపై పారిశ్రామికీకరణ ప్రభావాన్ని విమర్శిస్తాయి. స్థిరమైన, నైతిక పద్ధతులకు తిరిగి రావాలని పిలుపునిస్తాయి. బెర్రీ విలక్షణమైన 'నిశ్శబ్ద జ్ఞానం' ప్రకృతిపట్ల లోతైన అవగాహనను, ప్రేమను, గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. 'నిశ్శబ్ద మనిషి' ఆదర్శవంతమైన, వినయపూర్తిమైన జీవితాన్ని సూచిస్తుంది. ప్రపంచంలో తరచుగా పట్టించుకోని సూక్ష్మ మైన అద్భుతాలకు అనుగుణంగా ఆ మనిషి జీవితం ఉంటుంది. భూమి, జీవావరణ వ్యవస్థలు ఆరోగ్యవంతమైన పరిస్థితులను సృష్టించాలని కోరుకునే బెర్రీ, పారిశ్రామికీకరణ పెరుగుదల పట్ల 1970 దశకాల్లోనే ఆందోళన వ్యక్తం చేశాడు. మనిషి సుఖమయ జీవితాన్ని కోరి తయారు చేసుకుంటున్న యంత్రాలు క్రమంగా అదే మనిషి జీవితాన్ని ఛిద్రం చేస్తాయని హెచ్చరించాడు. గ్రామీణ వ్యవస్థ దెబ్బతింటుందని, సాంప్రదాయ వ్యవసాయ విధానాలు కనుమరుగవుతుందని తేల్చిచెప్పాడు. వృత్తి పనులు చేసుకునేవారికి నిలువలేకుండా చేసే మితిమీరిన పారిశ్రామికీకరణను, కార్పొరేట్ వ్యవస్థను, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని బెర్రీ నిరసించాడు. 90 ఏళ్లు నిండినప్పటికీ, నేటికీ అతను తన సిద్ధాంతాలకు అనుగుణంగానే నడుచుకుంటున్నారు. అతను రాసిన అనేకానేక పుస్తకాలు, వ్యాసాలు ప్రకృతి ప్రాధాన్యతను గుర్తుచేస్తునే ఉంటాయి. మనిషి శ్రేయస్సు ప్రకృతిపైనే ఆధారపడి ఉందని అతని సిద్ధాంతం. అడవి పుష్పాలు ఏ విధంగా ప్రకృతి అందాన్ని పెంచుతాయో, మనిషి చేసే పనులు, అనుసరించే విధానాలు కూడా అదే విధంగా ప్రకృతి శ్రేయస్సుకు ఊతమివ్వాలని పిలుపునిస్తున్నాడు. అతని సిద్ధాంతాలు, వాదనలు, ప్రతిపాదనలు, సూచనలు నేటి ప్రపంచానికి మార్గదర్శకాలు. పర్యావరణ సమస్యలు... వాతావరణ కాలుష్యం కారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలే ఇందుకు సాక్ష్యం. బెర్రీ మాదిరిగానే ప్రకృతి, వ్యవసాయ ప్రేమికులైన కవులు, రచయితలు విరివిగా రావాలి. పర్యావరణ సమస్య ప్రధాన కవితా వస్తువు కావాలి. అప్పుడే భవిష్యత్తు కొంతైనా మెరుగుపడుతుంది.

## సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వచ్చింది
సంబరం నింపింది
క్రాంతి వెదజల్లి ఉంది
అంబరం తాకింది

వాకిళ్ళలో ముత్యాలముగ్గులు
గొబ్బెమ్మల అలంకరణలు
అంగనల ఆనంద పొంగులు
పుడమిలో పులకరింతలు

డూడూ బసవన్నల నాట్యాలు
హరిదాసు చిరుతల కీర్తనలు
పుర జనుల సంతోషం తరంగాలు
చెలి నెగళ్ళతో బోగి మంటలు

ఇంటి ముందు పాడి పశువులు
ధాన్యరాసులతో గృహ సీమలు
అల్లుళ్ళతో పండగ సందులు
ఆడపడుచుల పరవశాలు

ఆలయాలలో గంటల మ్రోతలు
విప్రులచే జంటలకు అర్చనలు
పట్టు వస్త్రాలంకరణతో క్యూ వరుసలు
ఉదయమే పొంగలి ఆరగింపులు

వీధులన్నీ అరవిరిసిన నగవులు
కమ్మని పిండి వంటల ఘుమఘుమలు
అందమైన తోరణాలు కనువిందులు
యాచకులకు ప్రసాద వితరణలు

పెద్దల కోలాటాల ఆట పాటలు
పిన్నల గాలిపటాల కేరింత విన్యాసాలు
బెట్టింగ్ లతో కోళ్ళ పందాలు పరుగులు
పలు వరుసలతో ఆత్మీయ పరిహారాలు

వెతలను మరిపించే ఈ పండుగ రోజులు
కలతలు లేని కమనీయ హృదయ శాలలు
భావి పురోగతికి సోపానాలు
సబ్బండ వర్ణాలకు సంక్రాంతి సంబరాలు

– నాగేశ్వర్ రావు, 8688553470

## ఈ వారం కవితలు

### నేను కలకంటాను

నేల సారవంతమైతే
పచ్చిక బయళ్ళు కంటది
ఆకాశం సారవంతమైతే
అనంతమైన నీటిని కంటది

వృక్షము సారవంతం అయితే
పండ్లను కాస్తది
మనిషి సారవంతం అయితే
ప్రేమను పూస్తాడు
మాట సారవంతమైతే
నలుగురి హృదయాలను
తడుపుతది
ఆహారం సారవంతవైతే
ఆరోగ్యాన్ని

చూపు సారవంతం
అయితే నవ్వులను
ఇల్లు సారవంతమైతే
ఆదరణను పూస్తాయి
లోకం సారవంతమైతే
శాంతిని పూస్తది
ఏ యుద్ధాలను కనకుండా
యుద్ధాలు ఎప్పటికైనా

నిస్సారవంతమైన నేలను
మనుషులను కంటది
సారవంతమైన లోకాన్ని
నేను కలకంటాను.

గుండెల్లి ఇస్తారి, 9849983874

### పండుటాకుల పరిణయం

పిల్లల్ని ప్రయోజకుల్ని చేసి..
విదేశాల్లో జెండా పాతించి..
చేతి నిండా ఆస్తిపాస్తుల్ని పెట్టి..
జీవితాలను దారపోసిన పేరెంట్స్
తుది అంకంలో తోడును కోల్పోయి..
అన్నీ ఉండి అనాథలైన వృద్ధులు
ఎవరి పట్టింపులేని పండుటాకులు !

సంపద ఎంతున్నా ఏదో తెలియని..
ఒంటరితనపు నిరాశల భారాలు
ఆదరణ కరువైనా వయోధికులు
సాంత్వన లేని అలసిన బతుకులు
తోడు కోసమే ఒంటరి పెద్దల..
స్వయంవరాల సంతోష వేడుకలు !

అమ్మనాన్నలకే పెళ్లి చూపులు
ఒంటరి పండుటాకుల జంటలు
ఏకమవుతున్న నవ్య కాలాలు
మలి సంధ్య మనసు విప్పి మాట కలిపి..
పెనవేసుకునే మూడు ముళ్ల బంధాలు
మలి సంధ్యలో ఒక్కటవుతున్న..
ఆరు పదుల అపురూప జంటలు !

కన్న బిడ్డలు చేసే వివాహ వేడుకలు
ఆన్‌లైన్‌లో అమ్మకు అక్షింతలతో..
నాన్నను ఆశీర్వదిస్తున్న కన్న పేగులు
పండుటాకుల పెళ్లిళ్ల హడావుడులు
సంగీతంతో కలిపి వేసే ముసలి స్టెప్పులు
అనుభవజ్ఞుల రెండో పెళ్లి సంబరాలు
డిజిటల్ యుగపు వింత వేడుకలు !

మధుపాళీ
9949700037

## అక్షరాలు నన్నోదారుస్తాయి

ఆ వేదనతో నలిగిపోతున్నప్పుడు
ఆశలన్నీ ఆవిరైపోతునప్పుడు
ఆత్మీయతకు దూరమైనప్పుడు
ఆకలి దప్పులతో దుఖిస్తున్నప్పుడు
అక్షరాలు నన్నోదారుస్తాయి

నిస్సహాయ స్థితిలో నేనున్నప్పుడు
నిక్షిప్తమైన ఆలోచనలతో ఊపిరందనప్పుడు
నిలకడ కోల్పోయినప్పుడు
నిర్లక్ష్యంతో నా ప్రేమ నను వీడినప్పుడు
అక్షరాలు నన్నోదారుస్తాయి

అచంచలంగా పడివున్నప్పుడు
అకారణంగా దుషించబడ్డప్పుడు
అలసటతో నా హృదయం ఒరిగినప్పుడు
అణగారిన బ్రతుకులను చూసినప్పుడు
అక్షరాలు నన్నోదారుస్తాయి

సమస్యలు నాతో చెడుగుడాడుతునప్పుడు
సందేహాలతో సతమతమవుతున్నప్పుడు
సైన్యమై నను చుట్టుముట్టి
సింహంలా చీల్చిచెండాడే గుండె ధైర్యాన్నిస్తాయి
అక్షరాలు నన్నోదారుస్తాయి

వాసి జ్యోత్స్న , 9866843005

# భారత హైకమిషనర్‌కు బంగ్లాదేశ్ సమన్లు

## సరిహద్దు ఉద్రిక్తతలు కారణం

**ఢాకా :** సరిహద్దు ఉద్రిక్తతలపై భారత్ హైకమిషనర్ ప్రణయ్ వర్మను బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వశాఖ ఆదివారం సమన్ చేసింది. ద్వైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా భారత బంగ్లాదేశ్ సరిహద్దు పొడుగునా ఐదు చోట్ల కంచె నిర్మాణానికి భారత్ ప్రయత్నిస్తోందని ఢాకా ఆరోపించిన కొన్ని గంటల తరువాత ఈ పరిణామం చోటు చేసుకున్నది. వర్మ మధ్యాహ్నం సుమారు 3 గంటలకు మంత్రిత్వశాఖ కార్యాలయంలోకి వెళుతూ కనిపించారు. విదేశాంగ శాఖ కార్యదర్శి జషిమ్ ఉద్దీన్‌తో ఆయన సమావేశం సుమారు 45 నిమిషాల సేపు జరిగింది. వారి మధ్య చర్చల గురించి మధ్యంతర ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటనా విడుదల చేయలేదు. కానీ హైకమిషనర్‌ను సమన్ చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. అ యితే, సమావేశం అనంతరం మీడియాతో వర్మ మాట్లాడుతూ, ఢాకా, న్యూఢిల్లీ మధ్య 'భద్రత కోసం సరిహద్దులో కంచె వేసే విషయమై అవగాహనలు ఉన్నాయి' అని తెలియజేశారు. 'మా రెండు సరిహద్దు కాపలా సంస్థలు బిఎస్ఎఫ్, బిజిబి ఈ విషయమై ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటున్నాయి. ఈ అవగాహనను అమలు జరుపుతారని, సరిహద్దు పొడుగునా నేరాల కట్టడికి సహకారాత్మక దృక్పథం అనుసరిస్తారని ఆశిస్తున్నాం' అని వర్మ తెలిపారు.

# నిరుద్యోగ యువతకు రూ. 8,500

## ఎన్నికల వేళ 'యువ ఉడాన్ యోజన' పథకాన్ని ప్రకటించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ మరో పథకాన్ని ప్రక టించింది. అధికారంలోకి వస్తే ఢిల్లీలోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు రూ.8,500 ఇస్తామని హామీనిచ్చింది. 'యువ ఉడాన్ యోజన' పథకం కింద ఈ ఆర్థిక సహాయం అందిస్తామని, ఉచి తం కాదని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ విలేకరుల సమా వేశంలో పేర్కొన్నారు. 'ఒక కంపెనీ, ఫ్యాక్టరీ లేదా సంస్థలో తమ నైపుణ్యాలను ప్రదర్శించగల యువతకు మేము ఆర్థిక సహాయం అంది స్తాము. వారు ఈ కంపెనీల ద్వారా డబ్బు పొందుతారు. ఇది ఇంట్లో కూర్చొని డబ్బు పొందే పథకం కాదు' అని పైలట్ అన్నారు. శిక్షణ పొం దిన రంగాలలో ప్రజలు నిమగ్నమయ్యేలా తాము ప్రయ త్నిస్తామని, తద్వారా వారు... వారి నైపుణ్యాలను మెరుగుపరు చుకో గలరన్నారు. కాగా, ఈనెల 6న, కాంగ్రెస్ 'ప్యారీ దీదీ యోజన'ను ప్రక టించింది. తాము అధికారంలోకి వస్తే మహిళలకు నెలవారీగా రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. 8న 'జీవన్ రక్షా యోజన'ను కూడా కాంగ్రెస్ ప్రకటించింది. ఈ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను అందిస్తామని వాగ్దానం చేసింది.

# కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో ఘటన 28మంది కూలీలు సురక్షితం



**కన్నౌజ్ :** ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో బిల్డింగ్ సెంట్రింగ్ కూలడంతో శిథిలాల కింద పలువురు కూలీలు చిక్కుకున్నారు. దీంతో వారిని కాపాడేందుకు16 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఆదివారం 28 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రక్షించిన వారందరినీ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని చెప్పారు. కాగా, కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో కొత్తగా రెండంతస్తుల బిల్డింగ్ నిర్మిస్తున్నారు. అయితే స్లాబ్ కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ శనివారం కూలిపోయింది. శిథిలాల కింద పలువురు కూలీలు చిక్కుకున్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బందితోపాటు జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, రైల్వే సిబ్బంది, రెస్క్యూ బృందాలు రాత్రంతా శిథిలాలు తొలగించే పనిలో నిమగ్నమ య్యారు. చిక్కుకున్న వారందరినీ సుర క్షితం గా బయటకు తెచ్చారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అంది స్తున్నారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరుగకపో వడంతో అధికారులు ఊపిరిపీల్చు కున్నారు. మరోవైపు బిల్డింగ్ స్లాబ్ సెంట్రింగ్ కూలిన వీడి యో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## దేశ యువ జనాభా సత్తాకు

# ప్రధాని మోడీ ప్రశంస

### వారి సామర్థ్యంతో 2047 నాటికి అభివృద్ధి భారతం అవుతుంది

### వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ సదస్సులో ప్రధాని



**న్యూఢిల్లీ :** భారతదేశ యువ జనాభా సామర్థ్యాలు ఎటువంటివి అంటే అభివృద్ధి చెందిన దేశం కావడానికి అవి దోహదం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం ఉద్ఘాటించారు. ఢిల్లీలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' సదస్సులో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, అభివృద్ధి చెందిన దేశం కావాలన్న భారత్ లక్ష్యాన్ని కష్టమైనదిగా కొంత మంది భావించవచ్చు కానీ అది అసాధ్యం కాదని అన్నారు. 'వికసిత్ భారత్' స్ఫూర్తి దేశ ప్రతి అడుగును, విధానాన్ని, నిర్ణయాన్ని మార్గనిర్దేశకం చేస్తుంటే భారత్ అభివృద్ధి చెందిన దేశం కాకుండా ఏ శక్తీ అడ్డుకోజాలదని ఆయన అన్నారు. దేశ యువ జనాభా బలం, సంఖ్యలను ఆయన ఈ సందర్భంగా ప్రధానంగా ప్రస్తావించారు. 'ముందుకు సాగడానికి ఏ దేశానికైనా భారీ లక్ష్యాలు నిర్దేశించవలసి ఉంటుంది. ఇప్పుడు భారత్ ఇదే చేస్తోంది' అని మోడీ చెప్పారు. దేశం వివిధ రంగాల్లో గడువు కన్నా ముందే ఎన్నో లక్ష్యాలు సాధిస్తోందని ఆయన తెలిపారు. 2030 నాటికల్లా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిళితం చేయాలని భారత్ లక్ష్యం నిర్దేశించుకున్నదని, ఆ టోగానే దేశం లక్ష్యం చేరుకుంటుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఒక్కటే దేశాన్ని ముందుకు తీసుకుపోజాలదని ప్రధాని అన్నారు. 'వికసిత్ భారత్' మోడీ ఒక్కరిదే కాదని, మీ అందరిదీ అని ఈ సదస్సు కోసం దేశం అంతటి నుంచి వచ్చిన యువజనులతో ఆయన చెప్పారు. వారి అభిప్రాయాలు దేశ విధానాల్లో భాగం అవుతాయని, దేశానికి దిశ సూచిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆశావహ లక్ష్యాల సాధనకు దేశంలోని ప్రతి పౌరుని క్రియాశీలక భాగస్వామ్యం, సంఘటిత కృషి అవసరమని ఆయన సూచించారు. భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి దిశగా చిత్తశుద్ధితో కృషి చేయవలసిన ఆవశ్యకత గురించి చెప్పడానికి ప్రధాని మోడీ 1930 దశకంలో ఆర్థిక సంక్షోభం దరిమిలా యుఎస్ ఉత్థానాన్ని, మౌలిక సౌకర్యాలు లేని వెనుకబడిన ప్రాంతం నుంచి ప్రధాన ఆర్థిక శక్తిగా సింగపూర్ వృద్ధి చెందడాన్ని ఉటంకించారు. భారత్ ఏ విధంగా బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా మారిందీ, కొవిడ్ వైరస్‌కు వ్యతిరేకంగా వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసి, తన జనాభాకు టీకాలు వేసిందీ ప్రధాని మోడీ వివరించారు. 2047 వరకు 25 సంవత్సరాలు భారత్‌కు అమృత్ కాలం అని మోడీ స్పష్టం చేస్తూ, యువ జనాభా వికసిత్ భారత్ కలను సాఫల్యం చేస్తుందని తనకు పూర్తి నమ్మకం ఉందని తెలియజేశారు. ఆకస్మిక పరివర్తనకు ఇదే తగిన సమయం అని ఆయన అన్నారు. వచ్చే దశాబ్దంలో ఒలింపిక్స్‌ను నిర్వహించాలని కూడా దేశం ఆశిస్తోందని, పూర్తి అంకిత భావంతో ఆ దిశగా కృషి చేస్తోందని ఆయన చెప్పారు. స్వామి వివేకానందకు యువ తరంపై అపార విశ్వాసం ఉందని, అన్ని సమస్యలకు యువజనులు పరిష్కారాలు కనుగొనగలరని అన్నారని ఆయన తెలియజేశారు. తనకు ఆయన మాటలపై సంపూర్ణ విశ్వాసం, 'గుడ్డి నమ్మకం' ఉన్నాయని మోడీ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన జయంతిని జాతీయ యువజనోత్సవంగా పాటిస్తున్నారు. భారత అభివృద్ధిలో అధిక వృద్ధి పాత్ర గురించి మోడీ నొక్కిచెబుతూ, వివిధ రంగాల్లో దేశ సామర్థ్యం, బడ్జెట్ ఆర్థికవ్యవస్థ వృద్ధితో ఎలా వృద్ధిచెందాయో తెలియజేశారు. మౌలిక వసతుల కోసం బడ్జెట్ పది సంవత్సరాల్లో ఆరింతలు అయిందని ఆయన తెలిపారు. భారత ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కావడానికి ముందుకు సాగుతోందని ప్రధాని స్పష్టం చేస్తూ, వచ్చే దశాబ్దం నాటికి అది 10 ట్రిలియన్ డాలర్లను అధిగమిస్తుందని సూచించారు.

# అందరి 'జవాబుదారీతనమే' కీలకం

### 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై చర్చ నేపథ్యంలో నొక్కిచెప్పిన ఎన్నికల సంఘం

### మోడల్ కోడ్ తరచూ విధించడం వల్ల అభివృద్ధి పనులు, ప్రజా జీవితానికి ఆటంకమేర్పడటం కీలక కారణమని ప్రభుత్వం వెల్లడి




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా 'ఒకే దేశంఒకే ఎన్నిక' చర్చ తీవ్రస్థాయిలో జరుగుతోన్న నేపథ్యంలో మోడల్ కోడ్‌ను తరచూ విధించడం వల్ల అభివృద్ధి పనులకూ, ప్రజాజీవితానికి అంతరాయం కలుగుతుందని ప్రభుత్వం ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి గల ప్రధాన కారణాలలో కీలక కారణంగా చెబుతున్నప్పటి. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల సమతుల్యతకు ఇది ఉపయోగపడుతుందని ఎన్నికల సంఘం (ఇసి) వెల్లడించింది. 'ఒకే దేశంఒకే ఎన్నిక' అమలుకు ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుల ప్రకారం..ఎన్నికలు ఖరీదైనవని, సమయం తీసుకుంటాయని వివిధ కారణాలపై ఏకకాలంలో ఎన్నికలు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అమలు చేయడానికి రాజ్యాంగ సవరణ బిల్లు దేశంలోని ఎన్నికలు జరిగే ప్రాంతాలలో మోడల్ ప్రవర్తనా నియమావళిని విధించడం వల్ల మొత్తం అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయి సాధారణ ప్రజాజీవితానికి అంతరాయం కలుగుతున్నదని పేర్కొంది. అంతే కాకుండా తరచూ పోల్ కోడ్ విధింపు సేవల పనితీరుపై కూడా ప్రభావం చూపుతుందని, మానవశక్తిని వారి ప్రధాన కార్యకలాపాల నుండి ఎన్నికల విధులకు ఎక్కువ కాలం మళ్లించిందని వెల్లడించింది. కానీ 'పోల్ అథారిటీ ప్రచారంలో పాల్గొన్న అందరు వాటాదారులకు లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్‌ను అందించడానికి ఉద్దేశించిన ఒక ముఖ్యమైన సాధనం కాబట్టి ఎంసిసి దరఖాస్తును ఒక అంతరాయపరంగా చూడటం తప్పు కాదు' అని అభిప్రాయపడింది. ఏకకాల ఎన్నికలపై లా కమిషన్ 2023మార్చిలో ఇచ్చిన ప్రశ్నావళికి స్పందిస్తూ మోడల్ కోడ్ వర్తింపు ఎన్నికల చక్రం, ఫ్రీక్వెన్సీపై ఆధారపడి ఉంటుందని, అదే హేతుబద్ధీకరణ అని, ఎంసిసి సమయాన్ని తగ్గించగలదని ఎన్నికల సంఘం పేర్కొంది. 'స్టేక్ హోల్డర్లు అనుసరించాల్సిన స్వచ్ఛంద ప్రవర్తనా నియమావళిగా రాజకీయపార్టీలతో సంప్రదింపులు జరిపి ఎన్నికల సంఘం దీనిని రూపొందించింది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ, విశ్వసనీయ ఫలితాల కోసం ఇది అంతర్భాగంగా ఉంది' అని అది పేర్కొంది. యూనిట్‌లోని లా కమిషన్, న్యాయ వ్యవహారాల శాఖతో ఏకకాల ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై ఎన్నికల సంఘం వైఖరి ఏకకాల ఎన్నికల బిల్లులను పరిశీలించే పార్లమెంట్ సంయుక్త కమిటీ సభ్యులకు న్యాయమంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 'ఒకే దేశంఒకే ఎన్నిక'అనే అంశంపై ఉన్నత స్థాయి కమిటీలకు కూడా ఇసి వైఖరి స్పష్టంచేసింది. ప్రకటన తేదీ నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకూ ఎంసిసి వ్యవధిని కనీసం కనీసావసరంగా ఉంచడానికి తాను స్థిరంగా ఒక వ్యూహాన్ని రూపొందించుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. కాలనుగుణ ఎన్నికలు ఎంసిసి విధింపు కారణంగా 'పాలసీ పక్షవాతానికి' దారితీస్తాయా? అనే వాదనపై లాకమిషన్, ఎన్నికల సంఘం తన అభిప్రాయాన్ని అడిగింది.

# మహా కుంభమేళాకు సర్వం సిద్ధం




**ప్రయోగ్‌రాజ్ :** భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారస త్వం కలగలిపి 12 ఏళ్లకోసారి వచ్చే కుంభమేళా కోసం ఏ ర్పాట్లు పూర్తయ్యాయి. 45 కోట్ల మంది యాత్రికులు తరలివచ్చే ఈ మహత్తర సందర్భాన్ని పురస్కరించుకుని భారత ప ర్యాటకశాఖ దేశీ, విదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్య ంతో కార్యక్రమాలను రూపొందించింది. ప్రపంచ అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఈసారి ప్రపంచ పర్యాటక వేదిక గా మారుస్తామని కేంద్ర పర్యటక శాఖ స్పష్టం చేసింది. దేశీ, విదేశీ పర్యటకానికి ఊతమివ్వడమే లక్ష్యంగా అనుసంధానతను సులభతరం చేసినట్లు పర్యటక శాఖ తెలిపింది. దేశంలో అన్ని ప్రముఖ నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు విమాన కనెక్టివిటీని మెరుగుపరచేలా అలయన్స్ ఎయిర్‌తో పార్ట్‌నర్‌షిప్ డీల్ కుదుర్చుకున్నట్లు వివరించింది. యాత్రికుల ప్రయాణాన్ని సురక్షితం, సులభతరం, ఆహ్లాదకరంగా మార్చేలా అన్ని ర కాల వసతుల వివరాలను అందించేలా యుపి టూరిజం డిపార్ట్‌మెంట్, ఐఆర్‌సిటిసి, ఐటిడిసి వంటి సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపా రు. క్యూరేటెడ్ టూర్ ప్యాకేజీలు, లగ్జరీ వసతి ఎంపికలను అవి అందిస్తున్నాయని టెంట్ సిటీ సహా విలాసవంతమైన శిబిరాలు, ఇత ర లగ్జరీ ఎంపికలను అవి డిజిటల్ బ్రోచర్‌ల రూపంలో అందుబాటులో ఉంచుతాయని పేర్కొన్నారు.

**10 భాషల్లో టోల్‌ఫ్రీ నంబర్స్**

ప్రవాసులు, విదేశీ పండితులు, పరిశోధకులు, పర్యటకులు, ఫోటోగ్రాఫర్‌లు, జర్నలిస్టుల సౌకర్యం కోసం ప్రయాగ్‌రాజ్‌లో 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇన్‌క్రెడిబుల్ ఇండియా పెవిలియన్‌ను పర్యాటక శాఖ సిద్ధం చేసింది. ఇక్కడ దేశ సాంస్కృతిక వారసత్వం, కుంభమేళా విశిష్టతను వివరించేలా ప్రదర్శనలను నిర్వహించనున్నారు. విదేశీ అతిథుల కోసం 1.3.6.3 నంబర్‌తో టోల్ ఫ్రీ ఇన్ఫో లైన్‌ను పర్యటక శాఖ ఏర్పాటు చేసింది. ఇంగ్లిష్, హిందీ, ఇతర భారతీయ భాషలతో పాటు 10 ప్రముఖ విదేశీ భాషలలో ఇది సేవలందించనుంది. కుంభమేళా వైభవం, ఆధ్యాత్మిక సారాంశాలని ప్రతిబింబించేందుకు, అలాగే పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం సామాజిక మాధ్యమాల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఇందులో యాత్రికులను భాగస్వామ్యం చేస్తామన్న పర్యటక శాఖ #మహాకుంభ్2025, #స్పిరిచ్యువల్ ప్రయాగ్‌రాజ్ వంటి ట్యాగ్‌లతో తమ అనుభవాలను పోస్టు చేయాలని సూచించింది. పెద్ద ఎత్తున ఫోటోషూట్, వీడియోగ్రఫీ ప్రాజెక్టును చేపట్టి జాతీయ, అంతర్జాతీయ మీడియా వేదికల్లో సాంస్కృతిక గమ్యస్థానంగా ప్రయాగ్‌రాజ్ పర్యాటక సామర్థ్యాన్ని హైలైట్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# మూడు మీటర్ల సమీపానికి స్పేడెక్స్ ఉపగ్రహాలు : ఇస్రో



**బెంగళూరు :** ఆకాంశంలో డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహిం చేందుకు ప్రయోగించి న స్పేడెక్స్ ఉపగ్రహాలు అత్యంత సమీపానికి చేరుకున్నాయని ఇస్రో ప్రకటించింది. ఈ మేరకు ఎ క్స్‌లో పోస్టు పెట్టింది. తాజాగా వీటిని 15 మీటర్ల సమీపానికి తీసుకొచ్చి.. ఆపై 3 మీటర్లకు ఈ దూరాన్ని తగ్గించింది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి రెండు ఉపగ్రహాలను సురక్షితమైన దూరానికి జరిపినట్లు పేర్కొంది. ఈ డేటాను విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియ చేపడతామని ఇస్రో ప్రకటించింది. అంతకు ముందు స్పేడెక్స్ ఉపగ్రహాల చిత్రాలను కూడా ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆదివారం తెల్లవారు జామున 3.10 సమయంలో తొలుత ఈ ఉపగ్రహాలను 105 మీటర్ల దగ్గరికి చేర్చారు. అనంతరం అవి చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నాయని ఇస్రో పేర్కొంది. నింగిలో డాకింగ్ కోసం జంట స్పేడెక్స్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. అవి హోల్డ్ దశలో ఉన్నాయి. ఎస్‌డిఎక్స్ 01 (ఛేజర్), ఎస్‌డిఎక్స్ 02 (టార్గెట్) అనే ఈ రెండు ఉపగ్రహాలను గత నెల 30న పిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 7, 9 తేదీల్లో వీటిని అనుసంధానం (డాకింగ్) చేసేందుకు నిర్ణయించినప్పటికీ.. వివిధ కారణాల వల్ల అది వాయిదాపడింది. ఆ ప్రక్రియ ఇప్పుడు జోరుగా జరుగుతోంది.

## ఊపిరాడని సమస్యలతో ..

# ఘాజీ'పూర్' ఉక్కిరిబిక్కిరి!

### ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న ఓటర్లు తమను గట్టెక్కించే ప్రభుత్వం కోసం ఎదురుచూపులు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్), బిజెపి, కాంగ్రెస్‌పార్టీలు హోరాహోరీగా తలపడుతున్న నేపథ్యంలో సమస్యలకు నిలయంగా మారిన ఘాజీపూర్ ఓటర్ల దయనీయ పరిస్థితి ఎప్పటికి పరిష్కారానికి నోచుకుంటుందోనని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గు, జ్వరం, శ్వాసకోశ వ్యాధులు ఏడాది పొడవు ఉండే సమస్యలతో నరకయాతన అనుభవిస్తున్నామని ఎత్తైన చెత్తాచెదారం గుట్టల నడుమ ఘాజీపూర్ పల్లపు ప్రదేశంలో అక్కడే పుట్టి పెరిగి నివాసం ఉంటున్న 28ఏళ్ల అంజన్‌కుమార్ ఆవేదన ఇది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఘాజీపూర్ పల్లపు ప్రదేశం నీడలో నివసిస్తున్న నివాసితులు కాలుష్యం, ఆరోగ్యసమస్యల, సరిపోని మౌలికవసతులతో పోరాడుతున్నందున తమ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అభ్యర్థులను, రాజకీయపార్టీలను ప్రాధేయపడుతున్నారు. విషపూరిత ఉద్గారాలు, చెత్తాచెదారాల ఎత్తైన గుట్టలకు ప్రసిద్ధి చెందిన ఘాజీపూర్ పల్లపు ప్రదేశం ఆ ప్రాంత నివాసులకు పర్యావరణ, ఆరోగ్య ప్రమాదాల నిరంతర చిరునామాగా ఉంది.మూసుకుపోయిన కాలువలు, వర్షాకాలంలో పొంగిపొర్లుతున్న మురుగునీరు, కలుషితమైన నీరు, శ్వాసకోశ వ్యాధుల వంటి సమస్యలు సమాజాన్ని పీడిస్తున్నాయని, చాలామంది ప్రజలు తాము ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులచేత వదిలివేయబడినట్లు భావిస్తున్నారు. 30సంవత్సరాల వయసున్న ఘాజీపూర్ నివాసి శివ మాట్లాడుతూ ఆరోగ్యంపై పల్లపు ప్రదేశ ప్రభావం కాదనలేనిదని చెప్పారు. 28ఏళ్ల అంజనాకుమారి మాట్లాడుతూ వేసవిలో తాము ఎదుర్కొనే కష్టాల గురించి మాట్లాడుతూ పల్లపు ప్రదేశంలో తరచుగా మంటల కారణంగా విషపదార్థాలు వ్యాపిస్తున్నాయని చెప్పారు. వర్షాకాల సమయంలో మురుగుకాలువలలోని మురికినీరు ఘాజీపూర్ ఏరియాను ముంచెత్తుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 63సంవత్సరాల సుఖ్‌వీర్ సింగ్ మాట్లాడుతూ ఘాజీపూర్ పల్లపుప్రదేశంలో తాను 40సంవత్సరాలుగా నివసిస్తున్నానని, తాను శ్వాసకోశ వ్యాధులతో, కాలుష్యం, అధ్వాన్నకరస్థితిలో ఉన్న పారిశుధ్యంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఘాజీపూర్‌లో ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో గెలిచిన తదుపరి ప్రభుత్వం ఈ ఘాజీపూర్ సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

# బిజెపి అధికారంలోకి వస్తే మురికివాడలను కూల్చివేస్తుంది

### ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే ఢిల్లీలోని అన్ని మురికివాడలను కూల్చివేస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. షకూర్ బస్తీ ప్రాంతంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మురికివాడల సంక్షేమం కంటే భూసేకరణకే బిజెపి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. ముందు బిజెపికి మీ ఓటు కావాలని, ఆ తరువాత భూమిని లాక్కుంటారని పేర్కొన్నారు. 'జుగ్గీ'లలో నివసిస్తున్న ప్రజలపై ఉన్న అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని, 24 గంటల్లోపు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, అందుకు అంగీకరిస్తూ బిజెపి ప్రతినబూనాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల్లో పోటీ చేయని ఒప్పుకోవాలని కేంద్రం హోంమంత్రి అమిత్‌షాకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ సవాల్ విసిరారు. మురికివాడల నివాసితులు లేదా నిర్వాసిత ప్రజలపై ఉన్న అన్ని కేసులను అమిత్ షా ఉపసంహరించుకుంటే తాను ఎన్నికల్లో పోటీ చేయనని, ఒకవేళ బిజెపి విఫలమైతే తాను పోటీ చేస్తానని, మురికివాడల నివాసితులకు రక్షణగా నిలుస్తానని స్పష్టం చేశారు. వారిని ఎవరు నాశనం చేస్తారో చూద్దాం అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. బిజెపి ప్రకటించిన 'జహాన్ ఝుగ్గీ వహాన్ మకాన్' పథకంపై కేజ్రీవాల్ విమర్శలు చేశారు. అది కంటితుడుపు చర్యగా ఆయన అభివర్ణించారు. గత 10 సంవత్సరాలలో మురికివాడల నివాసితుల కోసం బిజెపి కేవలం 4,700 ఫ్లాట్‌లను మాత్రమే నిర్మించిందని, ఢిల్లీలో 4 లక్షల 'ఝుగ్గీలు' ఉన్నాయన్నారు. ఈ లెక్కన నగరంలోని అన్ని మురికివాడల నివాసితులకు ఇళ్లు అందించడానికి వారికి 1,000 సంవత్సరాలు పడుతుందని మండిపడ్డారు. బిజెపి ప్రస్తుతం మురికివాడల నివాసితులు ఆక్రమించిన భూమిని వారి గృహ అవసరాలను తీర్చకుండా స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తుందన్నారు. మురికివాడలను కూల్చివేసి, అక్కడ నివసించే ప్రజల ఎక్కడ నివాసముంటారనే ఆందోళన లేకుండా భూమిని స్వాధీనం చేసుకుంటారని చెప్పారు. 'అమిత్ షా చెప్పిన ప్రతి అబద్ధాన్ని, కుట్రను అరవింద్ కేజ్రీవాల్ 'ఝుగ్గీలు'లో నివసించే ప్రజలకు బహిర్గతం చేశారు' అని ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. 'గత 10 సంవత్సరాలలో 'జుగ్గీ'లలో నివసిస్తున్న 3 లక్షల మందిని బిజెపి నిరాశ్రయులను చేసింది. ఇప్పుడు, ఢిల్లీలోని ప్రతి 'జుగ్గీ'ని కూల్చివేయడానికి కుట్ర పన్నుతోంది. ఢిల్లీలోని 'జుగ్గీ'లలో నివసించే ప్రజలారా, గుర్తుంచుకోండి, ఇది బుల్డోజర్ పార్టీ. మీరు బిజెపికి ఓటు వేస్తే, ఈ 'జుగ్గీ'ను సంవత్సరంలోపు కూల్చివేస్తారు' అని అన్నారు.

# ఢిల్లీ ఎన్నికల బరిలోకి అజిత్‌పవార్ ఎన్‌సిపి



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమయం సమీపిస్తున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. త్వరలో జర గబోయే ఈ ఎన్నికల బరిలోకి.. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్‌కు చెందిన నేష నలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) దిగనున్నట్లు ప్రకటించింది. 25 నుంచి 30 స్థానాల్లో అభ్య ర్థులను నిలపనుంది. ఇప్పటివరకు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, బిజెపి మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఇకపై ఎన్‌సి పి కూ డా నిలవనుంది. ఎలాంటి పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైంది. ప్ర ధానంగా వివిధ కమ్యూనిటీలకు చెందిన ఓటర్లు ఉన్న ప్రాంతాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులను ఖరారు చేసింది. రాజధానిలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు గట్టిగా ప్రయత్ని స్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా యి. ఎన్‌సిపి ఢిల్లీ ఎన్నికల్లో దిగడం ఇదే తొలిసారి కాదు. 2020లోనూ ఆ పార్టీ ఐదు స్థానాల్లో పోటీ చేసింది. కానీ, ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది.

# బీహార్‌లో పప్పు యాదవ్ నిరసన..

### రోడ్లను దిగ్బంధించి, షాపులు మూయించిన మద్దతుదారులు



**పాట్నా:** బీహార్‌లోని పూర్ణియాకు చెందిన స్వతంత్ర ఎంపి రాజేష్ రంజన్ అలియాస్ ప ప్పు యాదవ్ ఆదివారం ఆ రాష్ట్ర బంద్‌కు పి లుపునిచ్చారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బిపిఎస్‌సి) పరీక్షను రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పాట్నాలో ఆ యన నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పప్పు యాదవ్ మద్దతుదారులు రెచ్చిపోయారు. పలు షాపులను బలవంతంగా మూయించారు. రోడ్లను దిగ్బంధించారు. టైర్లు తగులబెట్టారు. దీంతో ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# వరివైపు మెట్ట రైతులు మొగ్గు...

### వరి బోనస్, కూలీల కొరతే కారణమా...



**ప్రజాపక్షం / నందిపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఉద్యాన పంటలు, కూరగాయలు విరివిగా పండించాలని అధికారులతో విస్తృత ప్రచారం చేసినా చాలా మంది రైతులు వరి పంట వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలా మారడానికి రైతులు పలు కారణాలు చెబుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం వరి సన్నరకాలు పండిస్తే క్వింటాలు వడ్లకు మద్దతుతో పాటు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఇందుకే నందిపేట్, డొంకేశ్వర్ మండలాల రైతులు మెట్ట పంటల కంటె వరి పంటే ముద్దు అన్నట్టుగా మారిపోవడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. ఖరీఫ్ వచ్చిందంటే పసుపులోమొక్కజొన్న అంతరపంటగా వేసేవారు. విత్తనాలు వేయాలంటే కూలీలు కావలసిందే. కానీ గ్రామాలలో కూలీ పని చేయడానికి మహిళలు వెనుకంజ వేస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్య కారణాలు, కొత్త వచ్చే కోడళ్లు చదువులు, ఉద్యోగాలతో పట్టణాలకే పరిమితం అవుతున్నారు. చాలా మంది స్వంత పొలాల్లో పనులు చేయాలని ఉన్న మోకాళ్ల నొప్పులు వేధించడం కూర్చుని కలుపు తీయలేకపోవడం ఇబ్బందిగా మారడంతో కూలికి వెళ్లాలంటే మహిళలు జంకుతున్నారు. అందుకే కూలీల కొరత వల్ల వరి పంట వైపు చాలా మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే దున్నడం, దమ్ము చేయడం కొరకు ట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారు. నాటు వేయడానికి బీహార్, కలకత్తా, నల్గొండ నుండి వలస కూలీలు రావడంతో ఇబ్బంది లేకుండా పోయింది. ఎరువులు, పురుగు మందులు చల్లాలంటే కూలీలు దొరుకుతున్నారు. అందుకే వరి పండించడం సులువుగా మారింది. పాలేరులు దొరక్కపోవడం, ప్రతి సంవత్సరం పంట చేలల్లో వేలాది రూపాయలు ఖర్చుచేసి నల్లమట్టి పోయించినీ చీడ పీడలు, ఆశించి దిగుబడి తగ్గడం మరో కారణం. పండినపంటకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో జిల్లా కేంద్రానికి సరుకు తరలించి ఎక్కువ రేటు వచ్చేవరక వేచి ఉండాలంటే ఇబ్బందిగా రైతులు భావిస్తున్నారు. అదే వరి పంటకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండడం, పంటకు డబ్బులు వారంలోగా బ్యాంకు ఖాతాలో పడడం, మద్దతు దర కాకుండా బోనస్ రావడం రైతులు కారణాలు చూపుతూ, వరి వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పంటకు మొగి పురుగు, చిన్న చిన్న తెగుళ్ళు వచ్చినా పురుగు మందులు కొడితే అరికట్టవచ్చు. అందుకే రైతులు మెట్ట పంటలనుంచి వరి వైపు ఆసక్తి చూపుతున్నారు.



## పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధి

ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సామేల్

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రజాపక్షం 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని పత్రికలు ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, నాయకులు సంకర జనార్ధన్ రెడ్డి, కందుకూరి అంబేద్కర్, లక్ష్మ య్య, యాదగిరి, సుధాకర్, సేలాలాల్ కమిటీ అధ్యక్షులు బాణోతు రాములు నాయక్, సురేష్, హిరూ నాయక్, కిష్టు నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేసేందుకు కేంద్రం కుట్ర



**ప్రజాపక్షం/సూర్యాపేట:** వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని సూర్యాపేట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. రైతు సమస్యలను పరిష్కరించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ హర్యాన సరిహద్దులో గత 47రోజులుగా రైతు నేత జగత్ సింగ్ దలైవాలా నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. జగత్ సింగ్‌కు ఏమైన కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన చట్టాన్ని తీసుకరావాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో 200రోజులు పని దినాలు కల్పించి ప్రతి రోజు రూ. 700వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు రెమిడాల రాజు, బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు దంతాల రాంబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తగ్గుతున్న రిజర్వాయర్ నీటిమట్టం




**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఇన్ ఫ్లో పూర్తిగా ఆగిపోవడంతో అందునా ప్రతిరోజు కుడి ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తూ, జల విద్యుత్ ఉత్పత్తి చేపతూ ఉండటంతో రిజర్వాయర్ లో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుంది.590 అడుగులుగా ఉండాల్సిన ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 564.70 అడుగులుగా ఉన్నది.

**రిజర్వాయర్ పూర్తి సమాచారం :** నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు ప్రస్తుతం 564.70 అడుగులుగా ఉండి, నీటి ని ల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 243.4352 టీఎంసీలు గా ఉన్నది. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510 క్యూసెక్కులు ఎస్ఎల్ బి సి ఏఎమ్ఆర్పి 2400 ,క్యూసెక్కులు లోలెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేపడుతూ 8853 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ప్రాజెక్టు నుంచి మొత్తం అవుట్ ఫ్లో గా 26863 ఉంది.

## కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత పరిశ్రమకు సరికొత్త ఊపు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం చేనేత పరిశ్రమకు కార్మికులకు ఉపాధి మార్గానికి సరికొత్త ఊపునిస్తుందని పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండురంగం ఆదివారం ఒక ప్రకటనలో తెలుపుతూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. హ్యాండ్లూమ్ ఇండస్ట్రీ ని బ్రతికించి ఉపాధి మార్గాలను పెంపొందించేందుకు వ్యాపార రంగాన్ని విస్తృతంగా వ్యాపించేందుకు చేనేత ఇక్కత్ వస్త్రాల బ్రాండ్ ఇమేజ్ ని ప్రపంచం అవనికలో ప్రత్యేకంగా నిలిపేందుకు సంక్షేమం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రూ.336 కోట్ల నిధులను మంజూరు చేసి సాహసోపేత చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకొని చేనేత కార్మికుల బ్రతుకుల్లో కొత్త వెలుగులు నింపే ప్రయత్నం అభినందనీయం అని కొనియాడారు. అభయహస్తం పథకానికి రూ 168 కోట్లు,నేతన్న పొదుపు కోసం రూ. 115 కోట్లు, నేతన్న భద్రత కోసం రూ 9 కోట్లు నేతన్న భరోసా పథకానికి రూ.44 కోట్లు కేటాయించిన సందర్భంగా పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం, టై అండ్ డై సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,చేనేత జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలకు రుణపడి ఉన్నామని చేనేత కార్మికుల పోరాటం ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో చేనేత కార్మిక సంఘం తరపున హక్కుల సాధనకై కార్మికుల అభ్యున్నతికై శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తమ వెంట నిలిచిన ప్రతి ఒక్కరికి చేనేత కార్మిక సంఘం డైరెక్టర్ల తరపున ధన్యవాదాలు తెలిపారు.

## రక్తదానం చేద్దాం - ప్రాణదాతలుగా నిలుద్దాం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** యువత కోసం మెరుగైన సమాజం కొసం రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దాం అని మర్రిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్,ఇన్ సబ్ స్పెక్టర్ కృష్ణా రెడ్డిలు అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతి జాతీయ యువజన దినోత్సవం యూత్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దాం అనే సంకల్పంతో గత 3 సంవత్సరాలుగా రక్తదాన శిబిరం నిర్వహించడం అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ఉచితంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.2017 నుండి యూత్ ఫర్ బెటర్ సొసైటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే తల్లితండ్రులు లేని విద్యార్థుల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ కిట్స్ అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు ఉన్నారు.

## సేద్యానికి యోగ్యమైన

# ప్రతి ఎకరానికీ రైతు భరోసా

జనవరి 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరావు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** ప్రజా ప్రభుత్వంలో ఒక్క సంవత్సరం కాలంలోనే 40 వేల కోట్ల రూపాయాలతో రైతు సంక్షేమం చేపట్టడం జరిగిందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రణాళిక బద్దంగా ప్రజలకు మాట ఇచ్చినందుకు మహాలక్ష్మి పథకం, రైతు రుణమాఫీ, ఆరోగ్య శ్రీ,500 రూపాయలకె గ్యాస్ లాంటి పథకాలు అమలు చేశామని 75 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు లాంటి పథకాలు ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లోని ఉదయ్ ఆదిత్య భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు పై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, శాసన సభ్యులతో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లతో కలిసి నల్లగొండ జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ జనవరి 16 నుండి 20 వ తారీఖు వరకు రెవిన్యూ గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించి జనవరి 21 నుండి 24 వ తారీఖు వరకు ప్రతి గ్రామ పంచాయతీ వారీగా గ్రామ సభలు నిర్వహించి భూమి లేని వారిని, భూ సేకరణ చేసిన భూములని, గుట్టలను, లే అవుట్ లని,నాలా కన్ వర్షన్ చేసిన భూములను గుర్తించి వారి పేర్లను రైతు భరోసా పథకం నుండి తొలగించాలని ఆర్వో ఎఫ్ ఆర్ పట్టాలున్న రైతులకి రైతు భరోసా ఇవ్వాలని అధికారులకి సూచించారు.ఏ ఒక్క అనర్హులకి రైతు భరోసా ఇవ్వకుండా అధికారులు శ్రద్ధతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు లో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉంటే అత్యవసరం ఉన్న వారిని గుర్తించి వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తదుపరి మిగిలిన వారికి వచ్చే సంవత్సరం మరి కొంత మందికి మంజూరు చేయాలని ఇలా నాలుగు సంవత్సరాలలో అందరికి ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా కి ఎక్కువ ఇండ్లు వచ్చేలా గౌరవ ముఖ్యమంత్రి ద్వారా ప్రయత్నిస్తామన్నారు. సంక్షేమ పథకాలు పెదాలకి అందేలా అధికారులు నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని సూచించారు.సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి రైతు భరోసా కింద 12000 రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. భూమి లేకుండా చాలా మందికి పాస్‌బుక్‌లు మంజూరు చేసారని వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి రైతు భరోసా నుండి తొలగించాలని అధికారులకి సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భూమిలేని కూలీలకి సంవత్సరానికి 12000 రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని లబ్ధిదారులని జాగ్రత్తగా గుర్తించాలని, తలసరి ఆదాయంలో సిక్కిం తర్వాత తెలంగాణనే ముందంజలో ఉంది కానీ రేషన్ కార్డు దరఖాస్తులు చాలా వచ్చాయని వాటిని క్షేత్ర స్థాయి లో పరిశీలిస్తూ అర్హులకి మాత్రమే నూతన కార్డులు జారీ చేయాలని అధికారులకి సూచించారు. రాష్ట్ర రోడ్లు ,భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం లో పేదల సంక్షేమం, అభివృద్ధి చేయటమే మొదటి ధ్యేయం అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చామని అధికారులు విధులని భాద్యత తో నిర్వహించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు కలెక్టర్లు బాగా పనిచేస్తారని వారికి అధికారులు సహకరించి పేదల సంక్షేమం కోసం ఏ ఒక్క అర్హుని వదలకుండా అన్ని పథకాలు అందేలా చూడాలని అలాగే నల్లగొండ జిల్లాని ప్రథమ స్థానం లో ఉండేలా చూడాలని సూచించారు. తదుపరి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అడిగిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై సందేహాలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసన సభ్యులు బాలు నాయక్, నల్లమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి, వేముల వీరేశం, మందుల సామెల్,జై వీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంతరావు, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు,ఆర్డీవోలు,తహసీల్దార్ లు,వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నేరేడుచర్ల అభివృద్ధి

రూ. 18.58కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి రూ. 18.58కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనంతరం వ్యవసాయానికి యోగ్యత కలిగిన ప్రతి ఎకరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 12వేల అందజేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లుతో పాటు ప్రతి వ్యక్తికి 6కెజిల సన్నబియ్యంను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బిసి, ఎస్సి వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలకు రూ. 500లకే గ్యాస్, ఉచిత బస్ సౌకర్యం కల్పించామన్నారు. ఒక్క సంవత్సరంలోనే ఇంత అభివృద్ధి చేస్తే రానున్న నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామన్నారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రాంత ప్రజలు మాపై చూపుతున్న అభిమాన్ని అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటామన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. హుజూర్‌నగర్ ఇన్‌చార్జీ ఆర్‌డిఓ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూర ప్రకాష్, వైస్ చైర్ పర్సన్ సరిత, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, తహసీల్దార్ సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లకొండ విజయలక్ష్మీ పాల్గొన్నారు.



## వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** స్వామి వివేకానంద స్ఫూర్తితో నేటి తరం యువత ముందుకు సాగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి రాంబాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో స్వామి వివేకానంద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద అడుగుజాడల్లో నేటి తరం నడవాలని, ఆయన మాటలే స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, సంఘ సేవలో యువత ముందు వరుసలో ఉండాలన్నారు. సెలవు రోజుల్లో విద్యార్థులను సమీకరించి గంట పాటు వివేకానంద గురించి మాట్లాడించాలని దీంతో వ్యక్తిత్వ వికాసంతో సామాజిక పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ శాసన సభ్యులు దోసపాటి గోపాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, యువజన క్రీడ యోజన అధికారి రాంచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ అంగిరేకుల నాగార్జున, ప్రభాకర్, కర్ణాకర్ రెడ్డి, పర్వతం శ్రీధర్, చల్లమల్ల నర్సింహ్మా, వెంకట్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులకు ఇబ్బందులు రావొద్దు

మల్టీజోన్ 2 ఐజి సత్యనారాయణ



**ప్రజాపక్షం/ కోదాడ రూరల్:** సంక్రాంతి పండుగను పురస్కరించుకోని హైద్రాబాదు నుండి ఆంధ్ర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు చూడాలని మల్టీజోన్ 2 ఐజి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కొమరబండ జంక్షన్, రామాపురం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల రాకపోకలను ఐయన తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప ఉరస్కరించుకోని తమ స్వంత గ్రామాలకు ప్రజలు తరలిపోవడంతో రోడ్లు రద్దిగా మారాయన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజాల వద్ద రద్దీ కొనసాగుతునే ఉందన్నారు. టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జాం కాకుండా టోల్ ప్లాజా సిబ్బంది, పోలీసులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పంతంగి టోల్ ప్లాజాలో రద్దీని దృశ్య 10 లోల్ బూత్‌ల ద్వారా విజయవాడవైపు తెరచి ఉంచినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 4సెకన్లకు ఒక వాహనం చొప్పున నిమిషానికి 330 వాహనాలు విజయవాడవైపు వెళ్తున్నట్లు తెలిపారు. వాహనదారులు అతివేగంగా వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట కోదాడ రూరల్ సిఐ రజితరెడ్డి, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు అనిల్, ప్రవీణ్ కుమార్, అంతిరెడ్డి సిబ్బంది ఉన్నారు.

### జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/చిట్యాల:** సంక్రాంతి పండుగకు తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపు రాకపోకలు కొనసాగించే వారు ప్రమాదాలకు గురికాకుండా పోలీస్ యంత్రాంగం కావల్సిన చర్యలు తీసుకుందని పోలీస్ శాఖ ఐజి సత్యనారాయణ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఆదివారం జాతీయ రహదారిపై ట్రాఫిక్ పరిస్థితులను పర్యవేక్షించారు. పండుగ ముందు, పండుగ తరువాత తెలంగాణలోని వివిధ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణీకులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేవిధంగా జాతీయ రహదారిపై కావల్సిన యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా ఉండటం కోసం రహదారిపై 500 మంది కానిస్టేబుల్స్, 20 మంది ఎస్ఐ, ఇద్దురు డిఎస్‌పిలను బందోబస్తు కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సత్యనారాయణ వివరించారు. ఆయన వెంట డిఎస్‌పి శివరాంరెడ్డి, సిఐ నాగరాజు, ఎస్ఐ ధర్మలున్నారు.

## హెచ్‌పిసిఎల్ కార్మికుల సమ్మె విజయవంతం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** హెచ్‌పిసిఎల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం దిగిరావడంతో సమ్మె విజయవంతమైనట్లు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఇమాంపేట హెచ్‌పిసిఎల్ వద్ద ఎఐటియుసి అనుబంధ సంఘం హెచ్‌పిసిఎల్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెలోని కార్మికులకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యంతో పలు దఫాలుగా నిర్వహించిన చర్చలతో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇరు వర్గాలు తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్మికుల ప్రతినెల వేతనంపై రూ. 3వేలు అదనంగా ఇచ్చే విధంగా నిర్ణయించినట్లు తెలిపారు. యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి సహృదయంతో చర్చలు జరపడం శుభసూచికమన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు మతేన రమేష్, బ్రహ్మాండ్లపల్లి శివ సోమశేఖర్, హనుమంతరావు, విజయ్, కార్మిక ప్రతినిధులు ఎఐటియుసి నాయకులు ఎస్‌కె బాబా, నిమ్మల ప్రభాకర్, నాగరాజు, సాయిబాబా, హలీమ్, లింగయ్య, గణేష్, వెంకన్న, సైదులు, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు





## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** క్రీడలతో యువతలో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం అలవరుడుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న ఎన్‌వీఆర్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఎన్‌వీఆర్ క్రికెట్ క్లబ్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల యువకుల్లో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, నిర్వాహకులు అశోక్‌నాయక్, కౌన్సిలర్లు నర్సిరెడ్డి, రవి నాయక్, వెంకన్న, బెజ్జం సాయి, శ్రీధర్‌గౌడ్, నాగునాయక్, అశోక్‌చారి, కృష్ణ, భీమేష్, అనిల్‌కుమార్, శ్రీధర్, లక్ష్మ ణ్, నాని పాల్గొన్నారు.

## ఓటమి విజయానికి నాంది కావాలి

విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి కోమటిరెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** క్రీడలలో ఓటమి విజయానికి నాంది కావాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.నల్లగొండ పట్టణంలోని ఎన్‌జి కళాశాలలో జరుగుతున్న కెవిఆర్ కప్ సీజన్ 1 క్రికెట్ పోటీలలో ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలకు రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్ రెడ్డిలతో కలిసి క్రికెట్ విజేత జట్లకు షీల్డ్, నగదు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు.క్రీడాకారులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం దేశంలో ప్రతిష్ఠాత్మకంగా గచ్చిబౌలిలో స్పోర్ట్ యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కె.వి.ఆర్ కప్ సీజన్1 క్రికెట్ ఆర్గనైజర్స్ నంద్యాల వీర బ్రహ్మానందరెడ్డి టీంను మంత్రి అభినందించారు.కెవిఆర్ కప్ సీజన్1 విజేతగాజట్టుకు షీల్డ్,నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోల్ల వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, టిపిసిసి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుబ్బ రూప అశోక్ సుందర్, పానగల్ పిఎసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, ఇంతియాజ్ హుస్సేన్, కెవిఆర్ కప్ సీజన్1 క్రికెట్ ఆర్గనైజర్స్ నంద్యాల వీర బ్రహ్మానంద రెడ్డి, పుట్టా రాకేష్,దొంగరి నరేందర్ యాదవ్, సాయి, ఉమర్ షరీఫ్‌లు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా అందరికీ పథకాలు

## మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమీక్ష సమావేశం కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికి ప్రభుత్వ పరంగా పథకాలు అందాలన్న ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చరిత్రలో నిలిచిపోనున్నాయని తెలిపారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలు మునుపెన్నడు చూడలేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా, వేయకపోయినా సంవత్సరానికి 12వేల రూ.లు రైతు భరోసా ఇవ్వనున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ. 7500 కోట్ల రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాలో వేస్తామని తెలిపారు. రైతు భరోసా పథకం అమలుపై క్యాబినేట్ సబ్ కమిటీ వేసి అన్ని జిల్లాలు పర్యటించి రైతు భరోసా విధి విధానాలు రూపొందించామని తెలిపారు. రోడ్లు రియల్ ఎస్టేట్ స్థలాలు సాగుకు యోగ్యంలేని భూములకు రైతు భరోసాఇవ్వబోమనిస్పష్టం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని తెలిపారు. వ్యవసాయ కూలీలు గత సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పథకం పని చేసి ఉండాలని తెలిపారు. వ్యవసాయ కూలీలకు ఈ స్థాయిలో ఆర్థిక సాయం స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ ఎక్కడా అందలేదన్నారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం రేషన్ కార్డు ఇవ్వడానికి ముందుకు వెళ్లలేదన్నారు. తెలంగాణలో గత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 90లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండేవని, అధికారంలోకి వచ్చాక కేవలం 49 వేల కొత్త కార్డులు మాత్రమే ఇచ్చారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామన్నారు. ఎంతమంది అర్హులు అయితే అంతమందికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. కొత్తగా కుటుంబ సభ్యులను కూడా రేషన్ కార్డులో చేరుస్తామని అన్నారు. ఈ నెల 26 నుండి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలవుతుందని అన్నారు.ఏడాది కాలంలో 55వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. 22వేల 500 కోట్ల రూ.లు రుణమాఫీ చేశామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రొండ్ల వాగు పత్తిపాక పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజక్టులు పూర్తి చేస్తామని అన్నారు. నీటి లభ్యత ఉన్న ఏసాగు నీటి పథకాన్ని అయినా ప్రభుత్వం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తామని వివరించారు. పథకాల అమలుకు అధికారులంతా సమన్వంతో పని చేయాలని కోరారు.

## అక్షర సూరీడు అలిశెట్టి ప్రభాకర్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** కష్టజీవి కన్నీళ్లే ఆయన కలానికి సిరా చుక్కలు ..తను రాసిన కవితలు మర ఫిరంగులు ..అక్షర తూటాలతో అగ్గి పుట్టించినా ..అతి తక్కువ పదాలతో ఆకాశమంత భావ వ్యక్తీకరణ చేసినా ..అది తనకే చెల్లింది .సామాజిక రుగ్మతలపై ఆయన ప్రతి కవిత విప్లవ బాణాలు సంధించింది .ఆ సాహిత్య శేకరుడే అలిశెట్టి ప్రభాకర్ .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో యువతకు మార్గదర్శి స్వామి వివేకానంద జయంతి,తెలంగాణ అక్షర సూర్యుడిగా గుర్తింపు పొందిన పొట్టి కవితల కవి అలిశెట్టి ప్రభాకర్ జయంతి ,వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.వారి చిత్రపటాలకు సంఘ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్యక్షులు చౌటపల్లి తిరుపతి మాట్లాడుతూ.యువత స్వామి వివేకానందను స్ఫూరిగా తీసుకు ని ముందుకు సాగాలని ఆయన అన్నారు. ప్రధాన,ఆర్థిక కార్యదర్శి అందే లక్ష్మణ్,అంకం లింబాద్రి, సహాయ కార్యదర్శి అంకం లక్ష్మీనారాయణ, సలహాదారులు గూడూరు రాజన్న,సామల వీరస్వామి,చౌటపల్లి తిరుపతి,గుండేటి సత్యనారాయణ, అంకం గోవర్ధన్ పాల్గొన్నారు.

## ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం




**ప్రజాపక్షం/గంభీరావుపేట :** ఐక్యత లోనే ముదిరాజులకు రాజ్యాధికారం సాధ్యంమవుతుందని పర్శ హన్మాడ్లు అన్నారు. మండలంలోని గజసింగరం లో ఆదివారం న నిర్వహించిన ముదిరాజ్ చైతన్య సభకు హజరై రాష్ట్ర నాయకులు పర్శ హన్యాడ్లు మాట్లాడుతూ. ముదిరాజ్ సంఘం జిల్లా ఎన్నికలలో ఎకతటిపై గెలిపించటం హర్షనీయం అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలల్లో ముదిరాజులు ఐక్యతగా ఉండి వార్డు మెంబర్ నుండి జడ్పిటిసి వరకు సత్త చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటాకు కట్టుబడిగా ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏ లో కలపలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శత్రబోయిన లక్ష్మన్ గ్రామ అధ్యక్షులు రాయలింగు వేంకటయ్య బోయిని నర్సయ్య జజ్జరి శంకర్ అనందం తోకల దేవదస్ అరిగె రమేష్ నారాయణ రమేష్ శంకర్ మహేష్ కోమరయ్య దేవయ్య తదితరులు పాల్గోన్నారు.

## గుల్భం శ్రీధర్‌కు గౌరవ డాక్టరేట్




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (అమెరికా ) ఈనెల 10న మద్రాసు రాజా అన్నమలై మండ్రం, చెన్నై.లో జరిగిన డాక్టర్ రేటు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో విద్యా వ్యవస్థలో చేస్తున్న సేవలకు గాను రామగుండం మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ గులభం శ్రీధర్ కి గౌరవ డాక్టరేట్ ని ప్రధానం చేయడం జరిగింది. గత 25 ఏళ్లుగా ఉపాధ్యాయునిగా, లెక్చరర్ గా మరియు ప్రిన్సిపాల్ గా విద్యావ్యవస్థలో తనదైన ముద్ర వేసిన శ్రీధర్ అనేకమంది విద్యార్థులని తీర్చిదిద్దారని ఆయన విద్యార్థులు అనేకమంది ఉన్నత స్థాయిలో పోలీసు, ఇంజనీరింగ్,వైద్య,ఉపాధ్యాయ రాజకీయ పలు రంగాలలో ఉద్యోగాలు ఉపాధిని సాధించినట్లు గుర్తించారు. విద్యా పట్ల అంకిత భావం కలిగిన శ్రీధర్ డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందము హర్షం వ్యక్తం చేశారు.

## నిరుపేద కుటుంబాలకు బియ్యం




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో స్వామివివేకానంద 162వ జయంతి ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శ్రీ స్వామి వివేకనంద యూత్ ఆధ్వర్యంలో 16 నిరుపేద కుటుంబాలకు ఒక్కరికి 25కిలోల బియ్యంను పంపిణీ చేశారు.బియ్యం పంపిణీకి సహకరించిన దాత బాల్ రాజ్ కృష్ణమూర్తికి స్వామి వివేకానంద యూత్ సభ్యులు ధన్యవాదములు తెలిపారు. పెద్దలు,యువకులు,యూత్ సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## చైన్ స్నాచ్ నిందితురాలికి రిమాండ్

**ప్రజాపక్షం / ధర్మపురి :** కత్తితో బెదిరించి మహిళ మెడలో నుండి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన నిందితురాలిని 24గంటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల జిల్లా డిఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో గోదావరి నది వెళ్లే దారిలో నివాసముంటున్న కుకుస్తం చూడమ్మ వద్దకు ఈ నెల 11 శనివారం గుర్తు తెలియని మహిళ వచ్చి మాట కలిసింది. చూడమ్మ ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన మాయలేడి కత్తి చూపి బెదిరించి మెడలోనున్న 2తులాల బంగారు గొలుసును లాక్కొన్న బైకుపై పరారయింది. ధర్మపురి పోలీసులు నిందితురాలు గంట్యాలను మానసను పట్టుకుని చోరీ చేసిన గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఇంచార్జ్ సిఐ నీలం రవి రిమాండ్‌కు తరలించారు. కేసును 24గంటల లోపే చేధించిన ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లనుజిల్లాఎస్పీ అశోక్‌కుమార్ అభినందించినట్లు డిఎస్పీ తెలిపారు.

## వివేకానందుడి ఆశయాలు స్మరణీయం

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** స్వామి వివేకానంద చూపిన మార్గంలో దేశ యువత ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా యువజన క్రీడ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక వివేకా నంద స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ లతతో కలిసి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్ర పటానికి నివాళులు అర్పించారు.విజేతలకు ప్రభుత్వ విప్ ప్రశంస పాత్రలను అందజేశారు.ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద సమాజం పైన అత్యంత ప్రభావం కలిగిన ఒక ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడని పేర్కొన్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్‌ఆడువాలా జ్యోతి, కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యువత మత్తుకు బానిస కావొద్దు



**ప్రజాపక్షం/ రామగిరి :** విశ్వవిజ్ఞాన్ వెల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రగ్ ఫ్రీ కంట్రీ ప్రాజెక్ట్ లో భాగంగా మత్తుకి బానిస కావద్దని కరపత్రాలను లయన్స్ క్లబ్ అధ్యక్షులు సొన రామకృష్ణ రెడ్డి, మచ్చగిరి రాము కలిసి ఆదివారం ఆవిష్కరించారు. నేటి సమాజంలో యువత పెడ ద్రోవ పడుతూ యువత భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు అంటూ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమా ర్ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకి బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది. విశ్వ విజ్ఞాన్ వెల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ కంట్రీ ప్రోగ్రాం లో భాగంగా 1000 గ్రామాలు, ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా అరుణ్ కుమార్ తెలియజేశారు.నేటి సమాజంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే, చిన్న పిల్లలు కూడా మత్తు పదార్థాలకు బానిస అవుతూ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. సిగరెట్ త్రాగడం వలన పిల్లల్లో కలిగే మార్పులు పట్ల వారిని గుర్తించి వారిని చిన్న పిల్లలుగా ఉన్నపుడే కౌన్సెలింగ్ ద్వారా మాన్పించే ప్రయత్నం చేయవచ్చు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి తాగే వారి సంఖ్య పెరుగుతుందని, దాని వలన పిల్లల్లో చిరాకు, ఏకాగ్రత లేకపోవడం, చిన్న విషయాలకి ఇతరుల మీద ఆధారపడటం, ప్రతి దానికీ డల్ గా అవడం, నిద్రలేమి, ఆందోళన, ఒక్కదగ్గర సరిగా ఉండకపోవడం, వీటిని భరించలేక మత్తుకు బానిస అవడం లాంటివి జరుగుతుంటాయని, పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే మత్తు పదార్థాల వంటి వాటికి అలవాటు కాకుండా చూడవచ్చు అంటూ సొసైటీ వ్యవస్థాపకులు మల్లారపు అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవేల్లి శంకర్ . మట్ట శంకర్, రంగు సత్యనారాయణ, జంగపల్లి అజయ్, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, కొయ్యడ సతీష్, జంగపల్లి రాజేష్, చిప్పకుర్తి సత్యనారాయణ, భూంపల్లి మొండయ్య, బర్ల సదానందం, రణవేని లక్ష్మినారాయణ, వడ్లకొండ తిరుపతి,జంగపల్లి సారయ్య, కుక్క సతీష్, జంగపల్లి శ్రీనివాస్,తణుకు సుధాకర్, గుర్రాల చంద్రమౌళి,ఇంతియాజ్,మనోహర్, కాంపల్లి స్వరాజ్, జంగపల్లి శేఖర్, సాన సురేష్, మల్యాల తిరుపతి,మోర ప్రశాంత్, ఆరెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం భవననిర్మాణానికి ఎంపి నిధుల నుండి మంజూరైనా నాలుగు లక్షల ప్రొసిడింగ్స్‌ను సంఘం సభ్యులకు అందజేశారు. ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధుల గురించి ప్రతి గడపగడపకు వివరించి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. నిధుల మంజూరికి కృషి చేసిన ఎంపి ధర్మపురి అర్వింద్‌కు పద్మశాలీ కుల సంఘాల సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల ఇంచార్జ్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు ముష్కరి రాజ్ కుమార్, శక్తి కేంద్రం ఇంచార్జ్ రాకేష్, జలపతి, బూత్ అధ్యక్షుడు మనోజ్, రాజు, సంఘ సభ్యులు రవీందర్, భరత్, సురేష్, లక్ష్మణ్, రాజు తదితరులు ఉన్నారు.


## ఇట్యాల వెంకటయ్య సంస్మరణ సభలో పుస్తకావిష్కరణ




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో ఆదివారం కోరుట్ల తహసీల్దార్ ఇట్యాల వెంకట కిషన్ తండ్రి ఇట్యాల వెంకటయ్య సంస్మరణ సభ జరిగింది. సభలో ఇట్యాల వెంకట కిచెన్ తండ్రి స్మారకార్థం రాసిన పుస్తకాలు గ్రామ చరిత్ర, ధరణి, నీ కొనసాగింపుగా ఆవిష్కరణలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు తాళ్ళపెల్లి మల్లయ్య, లక్ష్మణ్, మధుసూదన్‌రావు, దయా నర్సింగ్ తో పాటు కళాకారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కే.స్వామి మాట్లాడుతూ ఇట్యాల వెంకటయ్య కనగర్తిలో కమ్యూనిస్ట్ పార్టీలో ఉంటూ పార్టీ నిర్మాణం కోసం కృషి చేశారని, గ్రామ ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన నాయకుడు అని అన్నారు. వెంకటయ్య కుమారుడు వెంకట కిషన్ కోరుట్ల తహసిల్దర్‌గా ఉద్యోగం చేస్తూ, తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ ఆయన స్మారకార్థం రెండు పుస్తకాలు రాసి ఈరోజు తన స్వగ్రామం కనగర్తి లో జరిగిన వారి తండ్రి సంస్మరణ సభలో ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

## ఉద్యోగ సాధనలో యువత ముందుండాలి

### ఎంఎల్‌సి అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** యువత ఉద్యోగం సాధించడంలో ముందుండాలని అందుకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసేందుకు తాము ముందుంటామని ఉమ్మిడి మెదక్,నిజామాబాద్,ఆదిలాబాద్,కరీంనగర్ పట్టభధ్రల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక సత్యార్జున ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పట్టభధ్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా మండలంలోని యువకులు ఘన స్వాగతం పలికారు.ముందుగా స్వామి వివేకనంద జయంతి వేడుకల సంధర్భంగా స్థానిక వివేకనంద స్వామి విగ్రహనికి పూల మాలలు వేసి నివాలులర్పించారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బైక్ ర్యాలీలో పాల్గొంటూ సావిత్రి భాయి పూలే,చాకలి ఐలమ్మ,డా.బాబాసాహేబ్ అంబేద్కర్,చత్రపతి శివాజీల విగ్రహలకు పూల మాలలు వేసి నివాలులర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలలో వారు మాట్లాడుతూ డిగ్రీ,పీజీలు చదివిన విద్యార్థులు కలయాపన చేయకుండా ప్రభుత్వం నిర్వహంచే పోటీ పరీక్షలకు సిద్దంకావాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉద్యోగ జాబితాలను అమలు చేయడంలో తానవంతు కృషి చేస్తానని తెలిపారు.ఉమ్మిడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్,కరీంనగర్ పట్టభధ్రుల నియోజకవర్గ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్నందున తనని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి హరిబాబు, కొంపెల్లి రవిందర్, రాధారపు బాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్,ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శ బోనగిరి మహేందర్,ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సంగెం మధు,గన్నేరువరం, బెజ్జంకి మండలాల ఉపాధ్యాయులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధిగా లయన్స్‌క్లబ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లాలోని లయన్స్ క్లబ్ పేదల పెన్నిధిగా ఉంటూ పేద ప్రజలకు అండగా ఉంటూ సేవలం దించడంఅభినందనీయమనీ పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం రోజున లయన్స్ క్లబ్ వారు నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ రీజన్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఏ అవసరం వచ్చినా ముందుండి సహాయం చేస్తున్నారని, పేద ప్రజల పట్ల వారు చూపిస్తున్న ఆధారాభిమానాలు ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు.లయన్స్ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును సన్మానించారు.లయన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామంలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ లో ఎంతో మంది ప్రజలకు సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ వారు నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ రిజియన్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. విజయరమణ రావు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు.లయన్స్ క్లబ్ ఉన్నత సభ్యులు, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలి

**ప్రజాపక్షం / ధర్మపురి :** యువతకు స్ఫూర్తి ప్రధాత, అపార మేధస్సుతో దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకుసాగాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 1981 ఎస్సెస్సీ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలల్లో అడ్లూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎస్సెస్సీ మిత్ర బృందం కన్వీనర్ జక్కు రవీందర్, కాంగ్రెస్ నాయకులు ఎస్. దినేష్, వేముల రాజేష్, చీపిరిశెట్టి రాజేష్ 1981 బృందం సభ్యులు మాడిశెట్టి శ్రీనివాస్, వొద్నాల రాజన్న, రాజమల్లయ్య, రాములు, కిష్టయ్య, లక్ష్మి నర్సయ్య, శంకర్, కాశీనాథం పాల్గొన్నారు.



## యువతకు వివేకానంద మార్గదర్శకులు



**ప్రజాపక్షం/ కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో ఘనంగా స్వామి వివేకానంద 162వ జయంతిని లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైవ్ రాష్ట్ర ఇంచార్జ్ బానోతు నరేష్ నాయక్ మాట్లాడుతూ ఈతరం యువతరానికి స్వామి వివేకానంద మార్గదర్శకులని, స్వామి వివేకానంద 1863 జనవరి 12న కలకత్తాలో జన్మించారు. ఆయన అసలు పేరు నరేంద్ర నాథ్ దత్త. స్వామి వివేకానంద యువతపై ఎంతో నమ్మకం ఉంచారని, మీరు బలంగా ఉండండి, బలమైన శరీరంతో బలమైన మనస్సుతో మీరు ఏదైనా సాధించగలరని అని చెప్పినట్లు గుర్తు చేశారు. స్వామివివేకానంద ఆలోచనలు, మార్గదర్శకత మనందరికి మార్గం చూపాలని కోరుకుంటున్నానని, ఆయన జీవితంలో ఉన్న నిరాడంబరత, సేవా భావం, ఆత్మవిశ్వాసం, మనం కూడా అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మోహన్ నాయక్, మీడియా ఇంచార్జ్ రాజు నాయక్, నాయకులు శ్రీకాంత్ నాయక్, గంగాధర్ నాయక్, ప్రకాష్ నాయక్, షఫీ, సాయికుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే స్నేహపూర్వక సంబంధాలు బలోపేతం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:** క్రమశిక్షణకు మారుపేరు క్రీడలు.. సమాజంతో స్నేహపూర్వక సంబంధాలను పంచుకోవడానికి చక్కని వేదిక ఈ క్రీడా టౌర్నమెంట్‌లు అని జనగామ జిల్లా డిసీసీ అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మద్దూరు మండల మాజీ జడ్పిటీసి గిరికొండల్‌రెడ్డి,ధూల్మిట్ట గ్రామ తాజామాజీ సర్పంచ్ దుబ్బుడు దీపికా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ధూల్మిట్ట స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటుగా డే అండ్ నైట్ నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్, మెదక్, కరీంనగర్ జిల్లాల జిల్లా స్థాయి వాలీబాల్, కబ్బడి పోటీలను స్థానిక సీనియర్ క్రీడాకారులతో పాటు నాయకులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, ఆటల పోటీలతో ప్రతి ఒక్కరిలో పోటితత్వం, క్రీడా స్ఫూర్తి ఏర్పడుతుందని ప్రస్తుత కాలంలో విధ్యకు ఇచ్చిన ప్రాధాన్యత క్రీడలకు ఇవ్వడం లేదని, దీనితో యువత క్రమశిక్షణకు విరుద్ధంగా మారుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మద్దూరు మండల మాజీ జడ్పిటీసి గిరి కొండల్‌రెడ్డి, మాజీ జడ్పిటీసి నాచగోని పద్మా వెంకట్ గౌడ్, ధూల్మిట్ట గ్రామ తాజామాజీ సర్పంచ్ దుబ్బుడు దీపికా వేణుగోపాల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్, జనగామ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బనక శివరాజ్ యాదవ్, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి, ధూల్మిట్ట మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎం.డి.రఫి, ధూల్మిట్ట గ్రామ శాఖ అధ్యక్షులు చెప్యాల అనిల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జాల్లా నాయకులు నారోజు శ్రీనివాస్ ధూళిమిట్ట గ్రామ తాజా మాజీ ఉప సర్పంచ్ పోతరాజు మదు, సీనియర్ క్రీడాకారులు, ధూల్మిట్ట స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు, గ్రామ సీనియర్ క్రీడాకారులు, గ్రామ విధ్యావేత్తలు, వివిధ గ్రామాల క్రీడా కారులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన ఊరు, సంప్రదాయాలు కాపాడుకుందాం



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** మన పుట్టిన ఊరును..మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవటం చాల ముఖ్యమని..ఇలాంటి ముగ్గుల పోటీలు పెట్టి మీలో కొత్త ఉత్సాహాన్ని నింపటం అభినందనీయమని సిద్దిపేట ఎంఎల్ఏ హరీష్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ప్రశాంత్‌నగర్ 9, 4వార్డు సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలునిర్వహించారు. ఎంఎల్ఏ హరీష్‌రావు మాట్లాడుతూ అందరు పోటీతత్వంలోచక్కగా ముగ్గులు వేశారన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన పుట్టిన ఊరును మరిచిపోవద్దన్నారు. అదేవిధంగా బోనాలు,సంక్రాంతి అంటేనే గొబ్బెమ్మలు, రంగు రంగుల ముగ్గులు మన సంస్కృతి అన్నారు. తెలంగాణ అన్నిరంగాల్లో ముందుకు పోవాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ మహిళలకు రూ2500 ఇస్తానని చెప్పి మాట తప్పారని, బతుకమ్మచీరలు, తులంబంగారంఎగ్గొట్టినాడన్నారు. పాతవి పోయి నావని, కొత్తవి రాలేదని ఎద్దేవా చేశారు. మాయమాటలు చెప్పి మోసం అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విషయాల్లో మోసం చేస్తుందని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి సహకారంలో సిద్దిపేటలో అండర్ డ్రైనేజీ నిర్మించుకున్నామని సిద్దిపేటను రాబోవు రోజుల్లో దేశంలోనే అగ్రగ్రామిగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు.

**ఘనంగా గోదారంనాధుల కల్యాణం–** సిద్దిపేట గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ ఆలయంలో గోదాదేవి,రంగనాధస్వామి కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగ నిర్వహించారు. మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు.

## జీవితం గొప్పవరం



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : జీవితం అనేది గొప్పవరం దేవుడిచ్చిన పెద్ద అదృష్టమని మళ్లీరాని అవకాశమని ప్రాణాలకు చాలా విలువ ఉందని, రోడ్డు ప్రయాణంలో హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ గేటు పక్కన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బిజెపి నేత గుర్రాల రాంభూపాల్‌రెడ్డి పోలీసులకు పాత్రికేయులకు , వాహనదారులకు ఉచితహెల్మెట్లు పంపిణీచేశారు. ముఖ్యఅతిథులుగా మాజీ జాతీయ బిసికమీషన్‌మెంబర్ తల్లోజుఆచారి, పోలీసులు, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## వివేకానందుడి జీవితం యువతకు స్ఫూర్తి



ప్రజాపక్షం/ఊర్కొండ : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలకేంద్రంలో స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని ఊర్కొండ మండలకేంద్రాల్లో రాష్ట్రబిజెపి నాయకులు నాగర్‌కర్నూల్ కబడ్డి ఆసోసియేషన్ అధ్యక్షులు కరాటే ఆసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి పాల్గొని స్వామివివేకానంద విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటియువత వివేకానందుని ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని ఆయన పిలుపునిచ్చారు. యువశక్తితోనే దేశం సమగ్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మండల గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## సమాజనిర్మాణంలో రెడ్డిలపాత్ర వెలకట్టలేనిది



ప్రజాపక్షం/వెల్దండ : సమాజ నిర్మాణంలో రెడ్డిలపాత్ర వెలకట్టలేనిదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలపరిధిలోని తోడేటి లక్ష్మారెడ్డిగార్డెన్‌లో తాలుకారెడ్డి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యేకసిరెడ్డినారాయణరెడ్డితోపాటు ఏఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లావంశీచంద్‌రెడ్డి హాజరై నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థికంగా రాజకీయంగా ఎదిగిముందుకు వెళ్లాలని రెడ్డిలకు సూచించారు. ఈక్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తాలుకారెడ్డి సం ఘం అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, మాజీజెడ్పిటిసి సభ్యురాలు విజితారెడ్డి, మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, గోలి సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కల్వకుర్తి తాలుకారెడ్డి సంఘం మంద అరవింద్‌రెడ్డి, గోలికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



ప్రజాపక్షం/ జడ్చర్ల : హిందూ సంస్కృతి సంప్రదాయాలు ప్రజలందరికీ తెలియాలని జడ్చర్ల పట్టణ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అఖిల్ రెడ్డి అన్నారు. ఆదివారం బాధేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో హిందువులకు ఎక్కడ ఏ ఆపద వచ్చిన విశ్వహిందూ పరిషత్ ముందు ఉంటుందని అన్నారు. యువతరం దేశం కోసం ధర్మం కోసం ముందుకు రావాలని వారికి మన సంప్రదాయాలు తెలియాలని అందుకే మహిళలకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే యువకుల కోసం సాయంత్రం స్థానిక డిగ్రీ కళాశాల గ్రౌండ్ లో పతంగుల పండగను నిర్వహించడం జరిగిందన్నారు. ముగ్గుల పోటీల్లో దాదాపు 15 మంది మహిళలు పాల్గొనగా వారికి మొదటి బహుమతి రూపాయలు 5000 స్థానిక కౌన్సిలర్ నందకిశోర్ గౌడ్ అందజేయగా, రెండవ బహుమతి 3000 రూపాయలు, మూడవ బహుమతి 2000 రూపాయలను బిఆర్ఎస్ యువ నాయకుడు కోనేటి మురళి పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన కిరణ్మయి,రాధిక, పద్మలీల లాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందు పరిషత్ సంఘం నాయకులు జగపాల్ రెడ్డి, శ్రీధర్, రఘు, లావణ్య, నిఖిల్,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం




ప్రజాపక్షం/మద్దూర్ : దేశవ్యాప్తంగా యువకులను భారత ప్రజాతంత్ర యువజన సమైక్య నిరుద్యోగుల కొరకు నిరంతరం పోరాటం చేస్తుందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహ్మద్ అలీ అన్నారు. డివైఎఫ్ఐ నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం అయ్యవారిపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ సంక్రాంతి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యవారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహ్మద్ అలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభి వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డివైఎఫ్ఐ యువజన సంఘం యువకుల కోసం నిరుద్యోగుల కొరకు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అరుణ్ కుమార్ , డిబిఎస్‌యూ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, గ్రామ పెద్దలు శ్రీనివాస్ , బసవంతు, విజయ్ , తేజ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాల పట్ల అప్రమత్తం



ప్రజాపక్షం/నారాయణ-పేట : నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బస్టాండ్‌లో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులను, అనుమానిత వ్యక్తులను ఫింగర్ ఫ్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బస్సు ఎక్కేటప్పుడు , దిగేటప్పుడు, బ్యాగులు, విలువైన బంగారు వస్తువులు,సెల్ ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని ప్రయాణించేటప్పుడు కొత్త వ్యక్తులు ఏమైనా తినిబండారాలు ఇస్తే తీసుకోరాదని ఎస్ఐ తెలిపారు. ప్రజల అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

# పథకాల అమలుకు అధికారులు సన్నద్ధం

### రాష్ట్ర ప్రభుత్వం 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు
### అధికారులకు మహబూబ్ నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాలు





ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు అధికారులు సన్నద్ధం కావాలని షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ఆదివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పథకాల ముఖ్య ఉద్దేశాలు, విధి విధానాలు క్షేత్ర స్థాయి పరిశీలన గ్రామ సభలు నిర్వహణ లబ్దిదారులు ఎంపిక తదితర విషయాలపై జిల్లా అధికారులు మండల నోడల్ అధికారులు మున్సిపల్ కమిషనర్‌లు ఎంపిడిఒలు, తహశీల్దార్‌లు, డిటిలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపిఒలు, ఎపిఒలు, ఇసిలు, ఎంపిఒలు , గృహ నిర్మాణ డిఇలు, ఎఇలతో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి ఈ నెల 10 న హైదరాబాద్‌లోని సచివాలయంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశంలో నిర్దేశించిన ఆదేశాలను జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. ఈ నెల 26 (గణతంత్ర దినోత్సవం)న ప్రభుత్వం పేదల కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించబోతోందని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నాలుగు పథకాల అమలుపై జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన గ్రామ సభల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని మండల నోడల్ అధికారులను, ఎంపి డిఒలు, తహశీల్దార్ మండల వ్యవసాయ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. ఈనెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో ప్రభుత్వ నిబంధనలననుసరించి ఎంపిక చేసిన అర్హులైన ముసాయిదా జాబితా ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించనున్న గ్రామ,వార్డ్ సభలలో చదివి వినిపించి అర్హుల జాబితా తయారు చేయాలని, గ్రామ సభలలో అభ్యంతరాలు ఉంటే స్వీకరించి 10 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 21 నుండి 25 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామసభలలో ఇందిరమ్మ కమిటీలను భాగస్వామం చేయాలని చెప్పారు. రైతు భరోసా సహాయం ఎకరాకు రూ.12 వేలు పెంచబడిం దని, రెండు విడతలుగా 6000 రూ.లు చొప్పున డిబిటి పద్ధతిలో సాయం అందించటం జరుగుతుందని తెలిపారు. భూభారతి (ధరణి) పోర్టల్లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా సహాయం అందుతుందన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుండి తొలగించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా (ఒక్కో విడత రూపాయల 6000 చొప్పున )సంవత్సరానికి 12 వేలు ఇవ్వడం జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలై ఉండి, ఉపాధి హామీ పథకం కింత 2023– 2024 సంవత్సరానికి కనీసం 20 రోజులైన పనిచేసిన వారు ఈ పథకాని అర్హులని ఆమె తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా క్షేత్రస్థాయి పరిశీలనకు మండల స్థాయిలో ఎంపిడిఒలు పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు ప్రక్రియకు బాధ్యులని, ఆ తర్వాత జిల్లా స్థాయిలో కలెక్టర్ (రెవెన్యూ అదనపు కలెక్టర్) , జిల్లా సివిల్ సప్లై అధికారి పర్యవేక్షకులుగా ఉంటారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఇంటి నిర్మాణ స్థలం కలిగి ఉన్నవారు, అద్దె సిసి, ఇటుక గోడలు లేకుండా రేకుల షెడ్డు, గుడిసెలు ఉన్నావారికి, యువ వితంతువులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు,పారిశుద్ధ్య కార్మకులు, వికలాంగులకు ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 15న మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమావేశం జరిపి క్షేత్రస్థాయి పరిశీలరకు షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన గ్రామ సభలు గురించి గ్రామాల్లో టాం,టాం నిర్వహించాలని, విస్తృత ప్రచారం గావించాలని కలెక్టర్ సూచించారు. ఈ నాలుగు పథకాల అమలుకు సంబంధించి ఈనెల 16న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి, ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన ఎంపిలు ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్‌డిఒ నవీన్, జెడ్‌పి సిఇఒ వెంకట రెడ్డి, డి ఆర్‌డిఒ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన భూనిర్వాసితులు



ప్రజాపక్షం/వెల్దండ : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న ఎర్రవల్లి గోకారం జలాశయంలో ఎర్రవల్లి, ఎర్రవల్లితండాలు ఎట్టి పరిస్థితుల్లో ముంపుకుగురికావొద్దని పలుమార్లు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశాం. గత అసెంబ్లీ సమావేశాల్లో ఈ జలాశయం గురించి ప్రస్తావించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాటలకు గ్రామస్తులంతా సంతోషం వ్యక్తంచేశారు ఇదిలా ఉండగా శుక్రవారం భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న డబ్బులు రైతుల అకౌంట్‌లో జమఅవ్వడంచూడి నిర్వాసితులు ఆందోళనకుగురై ఆదివారం గుండాల అంబలింగేశ్వరస్వామి ఆలయంలో కలిశారు. ఈవిషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి , ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎర్రవల్లి గ్రామస్తులు ప్రకాష్, బలరాం, సంజీవ, దేవేందర్, రాజు,శ్రీను, భాస్కర్, మల్లేష్ ఉన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన ఆసుపత్రి అభివృద్ధి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఆదివారం చేపట్టే శ్రమదానం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం జరిగిన శ్రమదానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆసుపత్రి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం చూసి అసహనం వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ముడా, మున్సిపాలిటీలో నుంచి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కాస్త శ్రద్ధ చూపించి ఉంటే ఇంత సమస్యలు జఠిలం అయ్యి ఉండేది కాదని ఆయన మండిపడ్డారు. ఖచ్చితంగా శానిటేషన్, డ్రైనేజ్, నిరుపయోగంగా ఉన్న పాత సామాగ్రిలను తొలగించడం వంటి కార్యక్రమాలు వెంటేనే ప్రారంభించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ ఆసుపత్రి అభివృద్ధికి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రతి నెల 1వ తేదీ, 15వ తేదీన ఆసుపత్రిలో క్లీన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి మున్సిపల్ చైర్మన్, ముడా చైర్మన్ ఇద్దరు. పర్యవేక్షణ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ షబ్బీర్ అహ్మద్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సిహెచ్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బికె రెడ్డి కాలనీ 22వ వార్డు లో 20 లక్షల తో నిర్మించిన నూతన సిసి రోడ్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తుందని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్‌తదితరులు పాల్గొన్నారు.

## ఎఐసిసినేతను కలిసిన శేఖర్



ప్రజాపక్షం/వెల్దండ : ఎఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను ఆదివారం యువజన కాంగ్రెస్‌రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కళ్లపల్లిశేఖర్, సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సీతపెద్దయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు తక్కళ్లపల్లి జగన్, పెరుమాళ్లశ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## వైద్య ఖర్చులకు రూ.5లక్షల ఎల్‌ఒసి అందజేత:వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం / నర్వ: మండల పరిధిలోని కుమార్ లింగంపల్లి గ్రామానికి చెందిన దాసరి కొండన్న కుమారుడు దాసరి వినోద్ కు అరోగ్యం బాలేనందున స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో వైద్య ఖర్చుల నిమిత్తం మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు డా.వాకిటి శ్రీహరి రూ.5లక్షల రూపాయల ఎల్ ఒసినీ అందజేశారు. కార్యక్రమంలో నర్వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ జగదాభి రెడ్డి మక్తల్ పట్టణ అధ్యక్షులు రవి కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ రెడ్డి, వివేక వర్ధన్ రెడ్డి, బీసం రవి, అశోక్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం



ప్రజాపక్షం /నారాయణపేట : యువకులు క్రీడలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని , శారీరకపరంగా దృఢంగా ఉన్నప్పుడు పోలీసు, ఆర్మీ లాంటి ఉద్యోగాలు సాధించవచ్చని డిఎస్‌పి ఎన్.లింగయ్య తెలిపారు. స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా అభంగాపూర్ గ్రామంలో గ్రామ యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను డిఎస్‌పి ఎన్. లింగయ్య, సిఐ శివకుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నర్సిములు, మాజీ సర్పంచ్ విక్రమ్ , వర్ష, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, భాగవంత్ , లక్ష్మి కాంత్ , రాములు , తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయం



ప్రజాపక్షం / వీపనగండ్ల : మండలంలోని సంగినేనిపల్లి గ్రామ సమీపంలోని గుట్టల్లో వెలిసిన శ్రీ లక్ష్మి నర్సింహస్వామి ఉత్సవాలకు ముస్తాబైన దేవాలయం సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయంలో మంగళవారం నిర్వహించే ఉత్సవాలకు అన్ని రకాల వసతులను భక్తుల కోసం ఏర్పాటుచేశా రు. సంగినేనిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాలుగు కోట్ల రూపాయలను మంజూరు చేయించి అవసరమైన బీటీ రో డ్డు, సీసీ రోడ్డుతో పాటు భక్తులకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు , వనపర్తి జిల్లా ఎంపిటిసిల ఫోరం, మాజీ అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ , మాజీ సర్పంచ్ పందెం విజయభాస్కర్ రెడ్డి, ధనుంజయ, చిన్నారెడ్డి, మీసాల మోహన్ , లక్ష్మయ్య, రామన్ గౌడ్ , టైలర్ రాముడు తెలిపారు. దేవాలయాన్ని రంగరంగ వైభవంగా తయారు చేయించిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పలకల భజన లాంటి ఎన్నో అధ్యాత్మిక కార్యకర్తలను ఏర్పాటు చేయించారు. గ్రామంలోని మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాల్లో సంగినేనిపల్లి తూముకుంట , వీపనగండ్ల, కల్వరాల, వల్లభాపురం, బొల్లారం గ్రామాలతో పాటు పాన్‌గల్ , చిన్నంబావి, పెంట్లవెల్లి, శ్రీరంగాపురం, మండలాల నుండి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో అన్నివర్గాల అభివృద్ధి



ప్రజాపక్షం/వెల్దండ : కాంగ్రెస్‌ప్రభుత్వ ప్రజాపాలనలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శ్రీ అంబారామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం సిసిరోడ్డు నిర్మాణపనులకు, జాతీయ ఉపాధిహామీపథకంకింద సచావరత్ మిషన్‌లోభాగంగా రూ.3లక్షల వ్యయంతో నిర్మించే మరుగుదొడ్లకు ఆయన ఏఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లవంశీచందర్‌రెడ్డి, రాష్ట్రపొల్యూషన్‌బోర్డు సభ్యులు ఠాగూర్‌బాలాజిసింగ్, శ్రీఅంబారామలింగేశ్వరస్వామి దేవాలయ పాలకమండలితో కలిసి శంకుస్థాపన చేశారు.

### అతిథిగృహం మంజూరుచేయాలని వినతి

శ్రీఅంబ రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపననిమిత్తం గుండాల గ్రామానికి విచ్చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డికి దేవాలయ పాలకమండలి అధ్యక్షుడు సందీప్‌రెడ్డి భక్తుల సౌకర్యార్థం అతిథి గృహ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు శ్రీఅంబా రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవాలయచైర్మన్ మల్లేపల్లి సందీప్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్య గౌడ్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కమిటి చైర్మన్ మనీలాసంజీవ్‌కుమార్‌యాదవ్, మాజీసర్పంచులు భూపతిరెడ్డి, గుమ్మకొండ రాములు, గోలిసురేందర్ రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనుముదిరాజ్, కృష్ణముదిరాజ్, ముదిగొండరమేష్, రాజుయాదవ్, ఆలీసాబ్, శివరాజ్‌గౌడ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## సేవా రత్న పురస్కార్ అవార్డుకు ఎంపికైన బాధగౌని మానస

ప్రజాపక్షం / పాన్‌గల్ : పాన్‌గల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన మాజీ సింగిల్‌విండో చైర్మన్ బాధగౌని కుమార్ గౌడ్ శారదమ్మ దంపతుల కుమార్తె బాధగౌని మానస సేవా రత్న పురస్కార్ అవార్డుకు ఎంపిక కావడంతో ఆదివారం హైదరాబాద్ మహనగరంలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో వివేకానంద 163వ జయంతి సందర్భన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సేవా రత్న పురస్కార్ అవార్డుకు ఎంపికైన వారికి సన్మానం చేశారు. పాన్‌గల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన మానస షైన్ ఏ లైఫ్ ట్రస్ట్ ఫౌండర్ గా ఉన్నారు. భారత్ వికాస్ పరిషత్ ప్రముఖుల చేతుల మీదుగా పురస్కార్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రముఖులు సుబ్బారావు, హన్మంత్ రావు, పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు చిన్నప్పటి నుంచే క్రీడలపై అవగాహన

### రాష్ట్రస్థాయి చెస్ పోటీలు, ఫుట్ బాల్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : యువజన క్రీడోత్సవాల సందర్భంగా, చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వనపర్తి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో, ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన చెస్ రాష్ట్ర స్థాయి పోటీలను, ఫుట్‌బాల్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే చదువుతో పాటు క్రీడల్లోనూ తర్ఫీదు ఇవ్వాలని క్రీడల వలన దేహదారుఢ్యం సమకూరడంతో పాటు మానసికోలాసం లభిస్తోందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించిందని ప్రతి నియోజకవర్గ మండల స్థాయిలోనూ క్రీడా మైదానాలను అందుకు కావాల్సిన సామాగ్రిని పూర్తి స్థాయిలో అందించి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ ,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ , మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, స్థానిక కౌన్సిలర్ బ్రహ్మంచారి తదితరులు పాల్గొన్నారు.

### యువత వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేయాలి

వివేకానందుడి ఆశయ సాధనలో యువత క్రీడల పాత్ర పోషించాలని స్వామి వివేకనందుడు ఆశించిన ఆశయాలను యువత సాధించేందుకు పాటు పడాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. స్వామి వివేకానందుడి 162వ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి మేఘారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పిసిసి డెలిగేట్, టెలికం సభ్యులు శంకర్ ప్రసాద్ , వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీమార్గంలో నడిస్తే అహింసకు తావు ఉండదు

ప్రజాపక్షం/అచ్చంపేట:అహింసమార్గంలో మనమందరం స్వాతంత్ర్యం తెచ్చుకున్నామని ఆయన మార్గంలో నడిస్తే శాంతియుతంగా ఉంటామని జాతిపిత మహాత్మాగాంధీ మనవడు తుషార్‌గాంధీ అన్నారు. ఆయన అక్టోబ ర్ 2నుండి గద్వాల జోగులాంబనుండి వెయ్యి కిలో మీట ర్లు వందరోజులు పాదయాత్ర నిర్వహించారు. వందరోజు కావడంతో 1800 లకిలోమీటర్లు నడిచినట్లు ఆయన తెలిపారు. ఆదివారం అచ్చంపేటలోని ఉమామహేశ్వరక్షేత్రంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతితోనే భారతదేశానికి స్వాతంత్ర్యంరావడంతో పాటు ప్రపంచంమొత్తం శాంతి దూతగా గాంధీ వెలిశాడని ఆయన నినాదంతో అందరం శాంతియుతంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ప్రముఖ గాంధేయవాది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ శిశు మందిర్ ఆధ్వర్యంలో ఖేల్ కూద్ పోటీలు



ప్రజాపక్షం/ మక్తల్ : శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ఆధ్వర్యంలో ప్రతి విద్యా సంవత్సరం ఖేల్ కూద్ నిర్వహించడం జరుగుతుంది. ఆ యోజనలో 2024 / 25 విభాగ్ స్థాయి ఖేల్ కూద్ ఆటల పోటీలు మక్తల్ శిశు మందిర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించడం జరిగింది. ఈ ఖేల్ కూద్ పోటీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సరస్వతీ శిశు మందిరాల నుండి 400 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది. క్రీడల నిర్వహణ రెండవ సమారోప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి , బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య, ముఖ్యవక్తగా పాలమూరు విభాగ్ ఉపాధ్యక్షుడు మద్ది అనంతరెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తు విద్యార్థి సంపూర్ణ వికాసమే విద్యా లక్ష్యంగా పని చేస్తూ 50 సంవత్సరాల నుండి తనదైన శైలిలో ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించినందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావని మల్లికార్జున్ ,వైస్ చైర్ పర్సన్ , ఎంఈఓ అనిల్ గౌడ్ , మక్తల్ సిఐ చంద్రశేఖర్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహగౌడ్ , శైక్షణిక్ ప్రముఖ్ కృష్ణ మోహన్ , అధ్యక్షులు రఘుప్రసన్న భట్ , మనసాని వెంకటేష్ ,ప్రతాప్ రెడ్డి, చంద్రశేకర్ , తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

ఆరోగ్యం

# కొత్త వైరస్ ప్రభావమెంత?




ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ చూసినా 'హ్యూమన్ మెటా నిమోవైరస్'గురించిన చర్చ విస్తృతంగా కొనసాగుతున్నది. కోవిడ్ అనుభవాల దృష్ట్యా ఈ వైరస్ కూడా ప్రణాంతకంగా మారే అవకాశముందనే భయం కలగడం సహజం. కాని వాస్తవాలను తెలుసుకోకుండా బోగస్ ప్రచారాలను నమ్మడం,వాటిని వ్యాప్తి చేయడం సబబు కాదు.ప్రపంచ దేశాలన్నీ చైనా లోని వూహాన్ లో 2019లో పుట్టిన కరోనా వైరస్ కు అతలాకుతలమై పోయాయి. 1960 వ సంవత్సరంలో వెలుగు చూసిన కరోనా వైరస్ పక్షులపైన,కొన్ని జీవజాతులపైన తన ప్రభావాన్ని ప్రదర్శించింది. అయితే 2019 లో ఉద్భవించిన కొత్త కరోనా వైరస్ మానవ జాతిపై మహోగ్ర రూపం చూపించింది. లక్షలాది మంది మృత్యువాత పడ్డారు.కోవిడ్ వలన ప్రపంచం సుమారు రెండు సంవత్సరాల పాటు పూర్తిగా స్తంభించి పోయింది. విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. విద్యావ్యవస్థ పూర్తిగా చతికిలబడింది. కోవిడ్ తర్వాత కోవిడ్ ఉత్పరివర్తనాలు కొన్ని దేశాల్లో తన ప్రభావం చూపించినా, భారత్ లో వాటి ప్రభావం అంతగా చూపలేదు. యూరప్ దేశాల్లో అనేక మంది మృత్యువాత పడ్డారు.కరోనా మహమ్మారి చైనా ల్యాబ్ లో తయారైనదని, ఈ వైరస్ వ్యాప్తికి చైనా కారణమని పలు ప్రపంచ దేశాలు దూషించాయి. నిజమేదో,అబద్ధమేదో తెలియదు కాని, ఈ వైరస్ వలన చైనాలో ప్రపంచానికి తెలియని మరణాలు సంభవించాయని పలు వార్తాకథనాలు వెలువడ్డాయి. ప్రపంచం కోవిడ్ నుంచి కోలుకున్న తర్వాత కూడా చైనాలో విధించిన నిర్బంధం వలన ప్రజలు బయటకు రాలేక పోయారు. ప్రజలు తిరగబడి,బయటకు రావడం జరగడంతో కమ్యూనిటీ స్ప్రెడ వలన వైరస్ కొంతకాలం ప్రజలను పీడించి, సర్దుమణిగింది. ఏ వ్యాధి అయినా పూర్తిగా వ్యాపించిన తర్వాతే బలహీనపడుతుంది. వ్యాధినిరోధక శక్తి పెరిగిన తర్వాత కరోనా వైరస్ తన ప్రభావాన్ని కోల్పోయి,పరిస్థితులు సాధారణ స్థితికొచ్చాయి.కోవిడ్ మహమ్మారి అంతర్ధానంతో ఊపిరి పీల్చుకున్న ప్రపంచానికి నూతన సంవత్సరంలో మరో వైరస్ ఉత్పన్నమై ఖండాంతరాలకు వ్యాపించడం మొదలైనది.భారత దేశంలో కూడా హెచ్ఎంపివి పలు నగరాల్లోకి ప్రవేశించింది. కర్నాటక,రాజస్థాన్,గుజరాత్ తదితర రాష్ట్రాల్లో కొద్ది మంది పిల్లలు ఈ వ్యాధికి గురైనట్లు, హైదరాబాద్ నగరంలో కూడా స్వల్ప స్థాయిలో కేసులు నమోదైనట్లు వార్తలు వెలువడ్డాయి.ప్రజానీకాన్ని ఆందోళనకు గురి చేస్తున్న ఈ వైరస్ 5 సంవత్సరాల లోపు చిన్న పిల్లలకే సోకుతుందని, లుబు,దగ్గు,జ్వరం,శ్వాస కోశ సంబంధమైన సమస్యలతో హెచ్ ఎంపివీ లక్షణాలు కరోనా వైరస్ మాదిరిగానే ఉంటాయని తెలుస్తున్నది. ఈ వైరస్ వలన బ్రాంకైటీస్,న్యుమోనియా వంటి వ్యాధులు రావచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయిఅయితే ప్రస్తుతం వెలువడుతున్న వార్తలో వాస్తవం లేదని, సాంఘిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న సమాచారాన్ని నమ్మవద్దని కొంతమంది వైద్యులు చెబుతున్నారు. చైనాలో హెచ్ఎంపివీ వలన ఆసుపత్రులు నిండిపోతున్నాయని, లాక్ డౌన్ ప్రకటించారని చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు సంగతి వదిలేసి,అనవసరమైన భయాందోళనలకు గురికావడం మంచిది కాదు.ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దిష్టమైన ప్రకటన చేసేవరకు ప్రజలు ఎలాంటి ఊహాగానాలను నమ్మకూడదు. ' 'హ్యూమన్ మెటా నిమోవైరస్' సోకడం ఇదే ప్రథమం కాదని,ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఈ వైరస్ నూటికి నూరుశాతం మందికి సోకి ఉంటుందని, ఒకసారి ఈ వైరస్ సోకిన తర్వాత రోగ నిరోధక శక్తి పెరగడం వలన రెండోసారి సోకే అవకాశం లేదని తెలుస్తున్నది. నెలల పిల్లల నుండి 5 సంవత్సరాల లోపు గల పిల్లలకు హెచ్ఎంపివి సంక్రమించవచ్చని, ఇది అత్యంత సాధారణమైన జలుబు మాత్రమేనని,భయాందోళన అనవసరమని చెబుతున్నారు. 65 సంవత్సరాల దాటిన వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి వారికి ఈ వైరస్ సోకవచ్చని,అయినప్పటికీ కోవిడ్ మాదిరిగా ప్రమాదం లేదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఒక సాధారణమైన జలుబు,దగ్గు,జ్వరం వంటి లక్షణాలు వచ్చి పోవడం, దానికి మెటా నిమోవైరస్ కారణం కావడం వలన కొంత ఆందోళన చెందడం సహజమే. కాని కోవిడ్ తో పోల్చుకుని, భయభ్రాంతులకు గురికావడం, కొంతమంది అనవసరమైన ప్రచారాలతో, అవగాహన లేమితో, లేని పోని వార్తలు సృష్టించి, ప్రజలను భయాందోళనలకు గురిచేయడం సబబు కాదు. విశ్వసనీయమైన సమాచారాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పే సలహాలను పాటించాలి. అభివృద్ధి చెందిన దేశాలు, కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ ఉత్పత్తిలో కీలక భూమిక పోషించిన భారత్ వంటి దేశాలతో కలసి తరచూ తలెత్తుతున్న వైరస్ లపై విస్తృతంగా అధ్యయనం చేసి, ప్రపంచాన్ని మహమ్మారుల నుండి కాపాడాలి.

**– సుంకవల్లి సత్తిరాజు**

# అల్యూమినియం ఫాయిల్‌తో బహుముఖ ప్రయోజనాలు

ఇటీవల కాలంలో విస్తృతంగా అందుబాటులోకి వచ్చి, దైనందిన జీవితంలో భాగమైపోయిన వస్తువులు, సౌకర్యాల జాబితాలో అల్యూమినియం ఫాయిల్ కూడా చేరుతుంది. ఆహారాన్ని ఎక్కువ సమయం తాజాగా, వేడిగా ఉంచేందుకు ఈ ఫాయిల్ను విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే, దీని వల్ల అదనపు ఉపయోగాలు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న సమాచారం, వీడియోలను అనుసరించి అల్యూమినియం ఫాయిల్‌ను పాదాల చుట్టూ చుట్టడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉంటాయి. నొప్పుల నివారణకు దీనిని ఒక వంటింటి సాధనంగా వాడుకోవచ్చు. చలికంలోనూ దీనివల్ల ఉపయోగాలు ఉన్నాయి. రోజుల పొడవునా నడిచిన తరువాత కాళ్లలో అలసట రావడం సాధారణమే. కూర్చొని పడుకున్నప్పటికీ, శరీ



రానికి పూర్తి విశ్రాంతి దొరకదు. ఈ సమయంలో, మీరు ఎవరినీ సహాయం కోసం పిలిచే అవకాశం ఉండదు. కాబట్టి అలసటను తగ్గించేందుకు అల్యూమినియం ఫాయిల్ను ఉపయోగించడం ఒక మంచి ఆలోచన. ఫాయిల్‌ను పాదాల చుట్టూ కాసేపు చుట్టుకుంటే, కండరాలు రిలాక్స్ అవుతాయి. అలసట నుండి ఉపశమనం లభిస్తుంది. చలికాలంలో ముఖ్యంగా, పాదాలు వాపులు రావడం ఒక సాధారణ సమస్య. చలితో వాపు మరింత పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో, అల్యూమినియం ఫాయిల్ను ఉపయోగించి ఈ ఇంటి హ్యాక్‌ను ప్రయత్నించవచ్చు. ఈ విధానం పాదాల వాపు ప్రాంతంలో వెచ్చదనాన్ని అందించడమే కాకుండా, వాపు నుండి మంచి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ఫాయిల్ వాడకం రక్తప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. పాదాలు ఎప్పుడూ నొప్పితో బాధపడుతుంటే, ఈ హ్యాక్‌ను ప్రయత్నించవచ్చు. ఫలితం ఎలావున్నా, మందులు వాడినప్పుడు వచ్చే సైడ్ఎఫెక్ట్స్ ఫాయిల్ వాడకం వల్ల ఉండనేది నిజం. బాగా నొప్పిగా ఉన్న ప్రాంతంలో ఫాయిల్‌ను బాగా చుట్టుకోవాలి. ఈ ఫాయిల్ వేడిను ట్రాప్ చేసి, కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. రక్తప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది, నొప్పి నుండి కొంత ఉపశమనం ఇస్తుంది. పాదాలు చాలాసార్లు చల్లగా ఉండటంతో, కొంతమంది నిద్రలేమితో కూడా బాధపడతారు. ఇలాంటి సందర్భంలో, అల్యూమినియం ఫాయిల్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొద్దిగా ఆవ నూనెతో పాదాలకు మసాజ్ చేసి, పాదాల చుట్టూ బాగా చుట్టుకోవాలి. కొద్దిసేపట్లో, పాదాలు వేడెక్కుతాయి, మీ నిద్ర కూడా మెరుగుపడుతుంది. అల్యూమినియం ఫాయిల్‌తో బహుముఖ ప్రయోజనాలు ఉన్న నేపథ్యంలో, దీని వాడకం వల్ల లాభాలే అధికం. ఔషధాల వాడకంతో శరీరంలోని రోగ నిరోధక శక్తిని తగ్గించుకునే బదులు, సాధారణ సమస్యలకు ఇలాంటి ప్రయత్నామ్నాయ మార్గాలను అన్వేషించడం మంచిది. వీటి వల్ల ప్రమాదం ఏమీ ఉండదనేది బహిరంగ రహస్యం.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

# పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- ప్రస్తుతం రాజ్యాంగం ద్వారా పౌరులకు గల ప్రాథమిక హక్కులు:
  6
- విద్యుత్ బల్బును కనుగొన్నది:
  ఎడిసన్
- జాతీయాభివృద్ధి మండలి అధ్యక్షుడు:
  ఆర్థికశాఖామంత్రి
- గోవర్ధన్ చిత్రకారుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
  జహంగీర్
- శూన్యంలో ధ్వనివేగం:
  శూన్యం
- నెహ్రూ ప్రభుత్వం జాతీయం చేసింది:
  జీవిత బీమా సంస్థలను
- ప్రపంచంలో ఎక్కువ అభివృద్ధి చెందిన ఖండం:
  ఉత్తర అమెరికా
- డాన్యూబ్ నది ఈ దేశం గుండా ప్రవహించదు
  ఫ్రాన్స్
- రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు యదార్థ పాలకుడయ్యే వారు
  గవర్నర్
- భారత రిజర్వు బ్యాంకు స్థాపింపబడిన సంవత్సరం:
  1935
- ఈ ద్రవం ఉత్తమ ఉష్ణవాహకము:
  పాదరసం
- హైడ్రాలిక్ యంత్రాలు ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి?
  పాస్కల్
- ఈ రాష్ట్రంలో ముందుగా క్రైస్తవ మిషనరీలు క్రొత్త పాఠశాలలను స్థాపించారు?
  మద్రాసు
- అజీవక శాఖకు నాయకుడు ఎవరు?
  గోసాల మస్కరిపుత్ర
- భారతదేశంలో ఎక్కువ దూరం ప్రయాణించే రైలు?
  హిమసాగర్ ఎక్స్‌ప్రెస్
- ప్రపంచాన్ని చుట్టి వచ్చిన ఇంగ్లాండ యాత్రికుడు
  ఫ్రాన్సిస్ డ్రేక్
- ద్వీపకల్ప నదులలో పెద్దది:
  గోదావరి
- భారతీయులకు ఉన్నతోద్యోగాలను ఇచ్చుటకు నిరాకరించినది?
  కారన్ వాలీస్
- ఓడలు నీటిపై తేలియాడటానికి కారణం ఏమిటి?
  ఉత్ప్లవన సూత్రం
- దక్షిణ భారతదేశ నదులలో పెద్దది
  గోదావరి
- థర్మామీటర్ వాడు ద్రవం?
  పాదరసం
- హైదరాబాద్ ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
  600
- జైన తీర్థంకరులందరూ ఏ వంశానికి చెందిన వారు?
  క్షత్రియ
- రైలు మార్గాలు మనదేశంలో ప్రవేశపెట్టబడిన సంవత్సరం?
  1853

## బెజవాడ పిచ్చమ్మ మృతి బాధాకరం


సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లును పరామర్శించిన, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/కోదాడ:** బెజవాడ పిచ్చమ్మ మృతి బాధకరమని కొత్తగూడెం ఎంఎల్ఎ కూనమనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాతృమూర్తి పిచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతి చెందిన రోజు అసెంబ్లీ ఉండటంతో హాజరు కాలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృవియోగంతో బాధపడుతున్న జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లును పరామర్శించి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. అమరజీవి పిచ్చమ్మ తమ కుమారులను విద్యావంతులను చేసి పెద్ద కుమారున్ని పార్టీకిసేవచేసే అవకాశం కల్పించారని వారిని నిరంతరం తన కుమారులను పార్టీలో కొనసాగేలా ఉంటూ తన తుదిశ్వాస వరకు పార్టీ సభ్యులుగా కొనసాగారాని వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, నంద్యాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత అభివృద్ధే దేశ ప్రగతి

ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్




**ప్రజాపక్షం/కాప్రా :** సామాజిక సేవ, దేశాభివృద్ధి కోసం నేటి యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో కీలక పాత్ర పోషించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు పిలుపిచ్చారు. ఇసిఐఎల్ చౌరాస్తాలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు బలీయమైన శక్తి సామర్థ్యాలున్నాయన్నారు. యువత విద్య, ఆరోగ్యం విషయాలపై ప్రాముఖ్యతనిస్తూ తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలపై అవసరమైన రీతిలో ఒత్తిడి తీసుకురావాలన్నారు. యువత నిజమైన అభివృద్ధి సాధిస్తేనే దేశం నిజమైన పురోగతి సాధించగలుగుతుందని, దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం చేపట్టే పథకాలను చిత్తశుద్ధితో అమలుపరచి లక్ష్యాలు చేరుకొనేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నియోజకవర్గ నేతలు అజీమ్ పాషా, ఇంతియాజ్, పర్వేజ్, జిల్లా సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, బ్రహ్మం, హరికృష్ణ, సాయి, మనోహర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

విజేతలకు బహుమతులు అందజేసిన సిపిఐ, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎం డి క్వార్టర్స్ కేఎల్ మహేంద్ర కాలనీలో సిపిఐ 28వ వార్డు కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, ఎఐటియుసి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరిమి రాజ్ కుమార్, సింగరేణి సేవా సమితి అధ్యక్షులు సునీత రెడ్డి పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీల్లో విజేతగా నిలిచిన పోటీదారులకు బహుమతులు అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా రాజకీయాల్లో, చదువుల్లో, ఆటల్లో మరింత రాణించాలని వారు అకాంక్షించారు. ఎండి క్వార్టర్స్‌లో కేఎల్ మహేంద్ర నగర్ లో గత ఐదు సంవత్సరాల నుండి సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో సుమారు వందమంది పైగా మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికార ప్రతినిధి మారుతి, సిపిఐ జిల్లా సమితి నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్, కొరిమి సుగుణ, క్యాథరాజు సతీష్, మాతంగి రామచందర్, తాళ్ల పోశం, నేరెళ్ల జోసఫ్,రాజా మహమ్మద్, రాజా రామ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కార్యాలయంలో యాదగిరిగుట్ట మండల కార్యవర్గం ముద్రించిన 2025 క్యాలెండర్‌ను ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్ సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్ ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు , మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారు మాటూరు మల్లయ్య యాదగిరిగుట్ట పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, పాకాల పాటి రాజు పాల్గొన్నారు.

## సిపిఐ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** సిపిఐ పార్టీ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఆదివారం ములుగు బిసి భవన్ కార్యాలయంలో జరిగిన సిపిఐ, జోనల్ కమిటీ సమావేశం బండి నర్సయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ ములుగు, వెంకటా పూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, మండలాల లో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులు, కర్షకులు, పేద, దిగువ మధ్య తరగతి ప్రజల కొరకు, విద్యార్థులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ తదితర వర్గాల ప్రజల కోసం నిత్యం పోరాటాలు సాగిస్తున్న సిపిఐ పార్టీ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నికలలో పోటీ చేస్తేనే ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అందుకుపై వర్గాల ప్రజలు కార్మిక వర్గ పార్టీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముత్యాల రాజు, బండి నర్సయ్య, వడి సారయ్య, బండారి శ్రీనివాస్, ఎండి నాసర్, రైతు సం ఘం జిల్లా కన్వీనర్ ఎండి అంజద్ పాష, ఇంజం కొమురయ్య, జక్కుల అయిలయ్య, ప్రజా సంఘాల నాయకులు కొక్కుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నర్సంపేట:** అమ్మ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ ముగ్గుల పోటీలు మినీ స్టేడియంలో గోక లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి గోక వినోద్ బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందించారు.

## దళిత రైతులను ఆదుకోరూ!



* సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మండెపల్లి గ్రామంలో 377సర్వే నెం బర్‌లో 120 దళిత కులాలకు సంబంధించిన 350 ఎకరాల భూమిని దళితులు ఆరుతడి పంటలు వేసుకుంటూ సాగు చే సుకుంటున్న భూములను గత బిఆర్ఎస్ ప్రభు త్వం భూమినిని గుంజుకున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఆ భూముల మీద ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వేలాది దళిత కుటుంబాల భూములు లాక్కోవడంతో వారి జీవనోపాధి కోల్పోయి దుర్భరమైన జీవి తా లను అనుభవిస్తున్నారన్నారు. ఎప్పుడో గత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములనీ్ం టిని ఆనాటి దళిత పేదలకు పంచారని, జీవనోపాధి కోల్పోయిన దళిత పేదలకు అప్పటి రాష్ట్ర మంత్రి కేటిఆర్ ఇంటి స్థలం భూమి ఇస్తామని చెప్పి మాట దాట వేశా రని,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రులను, అధికారులను కలిసిన ఉపయో గం లేదన్నారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కుటుం బాలను ఆదుకోవడానికి ఒక్కొక్క ఎకరానికి 40లక్షల పరిహారం అందించాలని కోరా రు. అదే విధంగా ఆ భూములలో కొందరికైనా డబుల్ బెడ్ రూం లు కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎక్క డైనా ప్రభుత్వ భూమిని తీసుకు ంటే ఆ భూముల మీద ఆధారపడిన భూ మిని ప్రభుత్వం తీసుకుంటే ఆ భూములపై ఆధార పడిన దళిత పేదలకు పరిహారం ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇవ్వాలని 2013 భూ సేకరణ చట్టం చె బుతున్నప్పటికి పాలకులు దాన్ని పెడచెవిన పెడు తూ దళిత పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభు త్వం పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. ఆదివారం సిపిఐ కార్యాలయం ఎదుట తోట విజయ్ స్మారక సంక్రాంతి ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలనుద్దేశించి ఆయన మాటాడుతూ దేశంలో చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరగాలని, అన్నిరాంగాల్లో మహిళలే ముందుంటున్నారని, క్రీడల్లో చదువుల్లో విద్యార్థినులే దూసుకుపోతున్నారన్నారు. సిపిఐ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మహిళల సృజనాత్మకతను వెలికితీసేందుకు, అన్నిరంగాల్లో ముం దుండేందుకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా ప్ర ధానకార్యదర్శి మామిండ్లసాంబలక్ష్మి, న్యాయ నిర్ణేతలు నూకల గీతారెడ్డి, మమత, పెరుగు కుమార్, రేషపల్లినవీన్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి మహమూద తోట రాజకుమారి, చీదిరాల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## పంచాయతీ కార్మికుల హర్షాతిరేకం

**ప్రజాపక్షం/తాండూరు:** తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల పంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. తాండూరు డివిజన్ కేంద్రంలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జేఎసి ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజ్, తాండూరు మండల అధ్యక్షులు బి.రాజు, గోవింద్, నర్సిములు ఉన్నారు.

## నిధుల మంజూరు సంతోషదాయకం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లికి రూ.1 కోటి 6 లక్షలు మంజూరు కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అద్రాస్‌పల్లి నుంచి ఎల్లగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి(సిఆర్ఆర్) నిధులు మంజూరు చేయడానికి కృషిచేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను గ్రామస్థులు సన్మానించారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మాజీ సర్పంచ్ భర్త నర్సింహా, మాజీ ఎంపిటిసి గోనె హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్ పత్తి యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, నాయకులు ప్రవీన్, నాగేష్, శ్రీనివాస్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి.
చిత్రంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, జగిత్యాల ఎంఎల్‌ఎలు డాక్టర్ సంజయ్‌కుమార్, ఎ.యశస్వినిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత జెట్టి కుసుమకుమార్, రోహిన్‌రెడ్డి తదితరులు

# సంక్రాంతికి బైక్‌లపైనే...

- ఆర్‌టిసి బస్సులు, స్పెషల్ రైళ్లల్లో కిటకిట
- ట్రావెల్స్ బస్సులో అధిక ఛార్జీలు వసూలు
- కార్లు లేనివాళ్లు కుటుంబాలతో బైక్‌పైనే ప్రయాణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతికి హైదరాబాద్ వాసులు సొంతూళ్లకు వెళ్తుండడంతో ఆర్‌టిసి బస్సులు, ప్రైయివేటు బస్సులు, కార్లతో పాటు బైక్‌లతో రహదారులు కిటకిటలాడుతున్నాయి. కార్లు లేని మధ్యతరగతి ప్రజలు అటు ఆర్‌టిసి, ఇటు ప్రైయివేటు బస్సుల చార్జీలను భరించలేక, రైళ్లలో కూడా రద్దీ కారణంగా తమ సొంత వాహనమైన బైక్‌పైనే సొంతూర్లకు ప్రయాణమవుతున్నారు. హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై గత రెండ్రోజులు వాహనాల రద్దీ విపరీతంగా నెలకొనిఉంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన సెంటర్లలో కూడా రద్దీ పెరిగింది. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద శనివారం మధ్యాహ్నం వాహనాల రద్దీ కొంచెం మోస్తరుగా ఉంది. కాగా, ఆటిసి స్పెషల్ బస్సులు, ప్రత్యేక రైళ్లు క్రిక్కిరిసిపోయి ఉండడం, ట్రావెల్స్ బస్సుల్లో చార్జీలు మోత మోగుతుండడం, ప్రైవేటు వాహనాలకు అధికంగా చెల్లించాల్సి రావడం, సొంత కార్లు లేకపోవడం వంటి కారణాలతో... హైదరాబాద్‌లో నివాసముంటున్న ఆంధ్రవాసులు



తమ కుటుంబాలతో సహా బైక్ లపై సొంతూళ్లకు పయనమయ్యారు. హైదరాబాద్‌విజయవాడకోల్ కతా జాతీయ రహదారులపై బైక్ ప్రయాణాలు పెరిగాయి. ఆయా రహదారులపై కార్ల కంటే బైకులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆ బైకులపై పిల్లాపాపలతో దంపతులు ప్రయాణిస్తున్న దృశ్యాలు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. హైదరాబాదు నుంచి ఎపికి బైకులపై ప్రయాణించే కొందరిని మీడియా పలకరించగా, తగినన్ని ఆర్‌టసి బస్సులు లేకపోవడంతో బైకులపై వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. కాగా, హైదరాబాద్ విజయవాడ హైవేపై నందిగామఐతవరం మధ్య రోడ్డును వెడల్పు చేస్తున్నారు. రోడ్డు పనుల కారణంగా వాహనాలు కిలోమీటర్ల మేర నెమ్మదిగా కదులుతున్నాయి. ప్రయాణానికి ఎక్కువ సమయం పడుతోందని వాహనదారులు అంటున్నారు.

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/అల్వాల్:** వజ్ర ఎంక్లేవ్ కల్చులర్ వింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించిన కాలనీ మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి అద్భుతాలను సృష్టించారు. సంక్రాంతి పండుగకు సంస్కృతిక విలువలను ప్రతిబింబించింది. ముగ్గుల పోటీ విజేతలను సన్మానిస్తూ ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత



**ప్రజాపక్షం/నాగారం:** సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించిందని కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి,మాజీ ఎంపిపి మాదిరెడ్డి స్వప్నలు గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 5 వేలు,రెండవ బహుమతి 3వేలు,మూడవ బహుమతి 1500 వందల రూపాయలు ఇందులో పాల్గొన్న 114 మందికి,మున్సిపల్ సిబ్బందికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఆదం షఫీ,ఎన్‌జికె మూర్తి,వెంకటరమణ,జస్వంత్‌సింగ్,సుధాకర్,ప్రభాకర్,ప్రవీణ్,వెంకట్ నవీన్‌అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం,నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి,మాజీ ఎంఎల్‌ఎ బేతి సుభాష్ రెడ్డి,కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు.రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి,రెడ్డి జెఎసి ప్రెసిడెంట్ అప్పమ్మ వారి రామిరెడ్డి,రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నూతన మండల అధ్యక్షులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి పార్టీ ఎన్నికల్లో మండల అధ్యక్షులుగా కొత్త ప్రతినిధులు ఎన్నికయ్యారని జిల్లా రిటర్నింగ్ అధికారి డా.వి.మురళీధర్ గౌడ్ ప్రకటించారు. గుండ్ల పోచంపల్లి మండల అధ్యక్షుడిగా కె.శ్రీధర్, మేడ్చల్ మండల అధ్యక్షుడిగా దేవి శ్రీశైలం యాదవ్, తూంకుంట మండల అధ్యక్షుడిగా నర్సింహా రెడ్డి, శామీర్‌పేట మండల అధ్యక్షుడిగా కృష్ణ, జవహర్‌నగర్ వెస్ట్ అధ్యక్షుడిగా కమలాకర్, జవహర్‌నగర్ ఈస్ట్ అధ్యక్షుడిగా జోగారావు, నాగారం అధ్యక్షుడిగా నాగరాజ్ యాదవ్, ఘట్‌కేసర్ రూరల్ అధ్యక్షుడిగా రాజు గౌడ్, ఘట్‌కేసర్ మున్సిపాల్ అధ్యక్షుడిగా సురేష్ నాయక్, ఫిర్జాడిగూడ ఈస్ట్ అధ్యక్షుడిగా ప్రభాకరరెడ్డి, ఫిర్జాదిగూడ వెస్ట్ అధ్యక్షుడిగా యాదగిరి గౌడ్, బోడుప్పల్ వెస్ట్ అధ్యక్షుడిగా రవి యాదవ్, బోడుప్పల్ ఈస్ట్ అధ్యక్షుడిగా మహేష్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడిగా జల్లి శైలజలు ఎన్నికయ్యారు.

## పేదల పెన్నిధి పిజెఆర్



**ప్రజాపక్షం/అల్వాల్ :** పేద ప్రజల కార్మిక నాయకుడు పేదల పెన్నిధి తెలంగాణ రాష్ట్రం కోసం పాటుపడిన మహా నాయకుడు మాజీ మంత్రి పి జనార్ధన్ రెడ్డి జయంతిని వెంకటాపురం డివిజన్ లోని కంటెస్టెంట్ కార్పొరేటర్ టీఎస్ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో పిజెఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి, చంద్రశేఖర్, సూర్య కిరణ్, నాగేశ్వరరావు, నందకుమార్, శివకుమార్, సాయికుమార్, నిరంజన్, వీనస్ మేరీ, పద్మ, నిర్మల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/అల్వాల్:** బిజెపి అల్వాల్ డివిజన్ అధ్యక్షులు కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఆల్వాల్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద స్వామి వివేకానంద జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత దేశంలోని యువతను దేశ భక్తి పెంపొందించేలా ఇనుప ఖండరాలు, ఉక్కు నరాలు వజ్ర సంకల్పం మనసున్న యువత ఈ దేశానికి అవసరం ఉందని యువతకు స్ఫూర్తి నింపే సందేశాలతో యువతను దిశ నిర్దేశం చేసిన మహా దిక్సూచి స్వామి వివేకనందుడి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ కో కన్వీనర్ మల్లికార్జున్ గౌడ్, జిల్లా నాయకులు బాబి అధికారి, తూప్రాన్ లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి, సర్వేశ్వర్ రావు, కార్తీక్,రామ్ సింగ్, నాగి, రవి, అనిల్, రాకేష్, చంద్ర కాంత్,రాజు, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువతకు స్ఫూర్తిగా నిలిచి భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహానీయుడు స్వామి వివవేకనంద అని మూడుచింతలపల్లి మాజి సర్పంచ్ జాం రవి, మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డిలు అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి ప్రధాన చౌరస్తాలో వివేకనంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళ్లర్పించారు.

తూం వేణుగోపాల్‌రావు, సుధాకర్‌నాయక్, బాలకృష్ణ, శ్రీశైలం, బాబు, రవి, భూపాల్‌రెడ్డి, సందీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నాగారం:** స్వామి వివేకానందస్వామి 162వ జయంతిని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్పా నగర్,సెరినిటీ స్కూల్‌లో వద్ద వేడుకలు,2 కె రన్‌ను బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ యువత స్వామి వివేకాంద అడుగు జాడల్లో నడుస్తూ ఆయన సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.2 కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు ట్రోపిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్యాం సుందర్‌శర్మ,మాజీ ఎపిపి సుదర్శన్‌రెడ్డి,కౌన్సిలర్ లక్ష్మి వేణుగోపాల్,బుచ్చిరెడ్డి, నక్క కిషోర్‌గౌడ్, రవిందర్‌రెడ్డి,యువ నాయకులు కౌకుట్ల రాహుల్ రెడ్డి, జూపల్లి నరేష్,గిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో వెల్ఫేర్ అసోసియేషన్,బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి విచ్చేసి వివేకానందస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి,మహేష్‌గౌడ్,డి నాధం,చక్రపాణిగౌడ్,తాళ్ల ఆనంద్‌గౌడ్,వెంకులు,యావపురం రవి,హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అల్వాల్:** భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన స్వామి వివేకానందుని బోధనలు భావాలు ముందు తరానికి అందించాలని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మహేష్ చంద్ర చారిటబుల్ ట్రస్టు మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభ లోని కళా వెంకట దీక్షితులు కళావేదిక నందుస్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సమాజ



హితం కోరే హైదరాబాద్ కు చెందిన బిఆర్ఎస్ నాయకులు సమాజ సేవకులు నర్ల సురేష్ ను స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డు శాలువా మొమెంటోతో ప్రశాంసాపత్రం మెడల్‌తో ఘనంగా సత్కరించారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో సినీ దర్శకులు డాక్టర్ నిట్టల గోపాల కృష్ణ, రిటైర్డ్ డిప్యూటి రిజిస్ట్రార్ ఎస్ వేణుగోపాల శర్మ, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, ఇంటర్నేషనల్ ఫిలిం ఫస్టివల్ కన్సల్టెంట్ వివి మహేశ్వర రావు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## సంక్రాంతి వేళ రైల్వే కీలక నిర్ణయం

### విశాఖ-హైదరాబాద్ వందేభారత్ రైలుకు అదనంగా 8 బోగీలు!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విశాఖపట్నం—హైదరాబాద్ మధ్య ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20707/20708) బోగీలను పెంచుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రస్తుతం 8 కోచ్లతో రైలు ప్రయాణిస్తుండగా ఆదివారం నుంచి మరో 8 జోడిస్తున్నట్టు తెలిపింది. దీంతో మొత్తం కోచ్ల సంఖ్య 16కు పెరగనుంది. అలాగే, ప్రస్తుతం 530 సీట్లు మాత్రమే అందుబాటులో ఉండగా, ఆదివారం నుంచి 1,128 సీట్లు అందుబాటులోకి వస్తాయి. నిరుడు మార్చిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ రైలులో ఎగ్జిక్యూటివ్ కోచ్ 1, చైర్కార్లు 7 ఉన్నాయి. తాజా పెంపుతో ఎగ్జిక్యూటివ్ కోచ్ల సంఖ్య రెండుకు, చైర్కార్ల సంఖ్య 14 పెరుగుతుంది.



## ప్రశ్నించే గొంతుక 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకగా ప్రజాపక్షం దినపత్రిక అహర్నిషలు కృషి చేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ నివాసంలో శామీర్‌పేట దినపత్రిక విలేకరి క్యాతం రవి ఆధ్వర్యంలో ప్రజాపక్షం 2025 నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్న ప్రజాపక్షం సిబ్బందికి దన్యవాదాలు తెలిపారు. అలాగే మూడుచింతలపల్లిలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మూడుచింతలపల్లి మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి, క్యాలండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, విశ్వకర్మ సంఘం మూడుచింతలపల్లి అధ్యక్షుడు బాలకృష్ణ, డైరక్టర్ నర్సింహాగౌడ్, మాజీ ఎంపిటిసి హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహా ముదిరాజ్, పత్తి యాదగిరి, నాగేష్, ప్రవీన్, బండి జగన్నాధం, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై అశ్రద్ధ తగదు




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** సమాజ శ్రేయస్సు కోసం రేయింబవళ్లు పరితపిస్తూ విధులు నిర్వహించే పాత్రికేయులు తమ ఆరోగ్యాల విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ కనపరచవద్దని పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. వివాకానందనగర్ కాలనీలోని బండారి ఆస్పత్రిలో మేడ్చల్ జిల్లా శాఖ తెలంగాణా రాష్ట్ర జర్నలిస్టుల సంఘం కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జర్నలిస్టుల వైద్య శిబిరంలో ఆయనతో పాటు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివేకానందనగర్ కాలనీ అధ్యక్షుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కాంగ్రెస్ సీనియర్ నేత సంజీవరెడ్డిలు హాజరయ్యారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిలో నిలిచే పాత్రికేయుల పాత్ర సమాజానికి ఎంతో అవసరమన్నారు. విధి నిర్వహణలో ఎంతో మానసిక ఒత్తిడికి లోనయ్యే తరచు ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీరక్షించుకోవాలన్నారు. జర్నలిస్టులు ఆరోగ్యపర సమస్యలు ఉంటే తాము వైద్యపరంగా సహకరిస్తామని బండారు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ సుశృత్‌కుమార్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 60 మంది జర్నలిస్టులకు వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో అధిక శాతం బిపి, డయాబిటిస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణా రాష్ట్ర జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షుడు బాలరాజుతో పాటు ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, పరమేష్, దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, రాహుల్, నాగరాజు యాదవ్, మాణిక్యరెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్‌కు చెందిన కరీం, లక్ష్మణ్, హరి, భాస్కర్, చంద్ర, బంటు ప్రవీణ్, అంజిబాబు, నగేష్, కిషోర్, నరసింహా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హింస, హత్యలకు వ్యతిరేకంగా పోరాడాలి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** మహిళలపై జరుగుతున్న హింస, హత్యలు, హత్యచారాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఐద్వా, డివైఎఫ్ఐ, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ సీఐటీయూ కార్యాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐద్వా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి ముగ్గులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం ఐద్వా,డివైఎఫ్ఐ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.లక్ష్మీ, సింధు, ఉమా లు వ్యవహరించారు. సిఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులు పసుల అంజయ్య, మండల కోశాధికారి కుమ్మరి శ్రీను, కరుణాకర్, మహిళా సంఘం మండల నాయకులు జమున, స్రమానీ, డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు, నాయకులు బి.శ్రీనివాస్, కె.సైదులు, మైసయ్య, మందాటి నవీన్, సీపీఎం పార్టీ మండల నాయకులు బి.సత్యం, జి.వెంకన్న, పి.శంకర్, డి.కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



## 21నుండి గ్రామ సభలు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా ,ఇందిరమ ఇంళ్లు ,కొత్తరేసన్ కార్డు ల జారీ .అత్మియ భారోసా పథకాలకు సంబంధించిన ఈనెల 21నుండి 24వరకు పంచాయతీల పరిధిలో గ్రామ సభలను మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను అదేశించారు. గణతంత్రదినోత్సవ సందర్భంగా 26నుండి రైతు భరోసా పథకం అమలు చేయనున్నట్లు కలెక్టర్ చేపట్టవలసిన పనులపై అధికారులతో దృశ్యమాధ్యం ద్వారా దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా పథకం పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు ఖరీఫ్ రబీ సీజన్లకు కలుపుకుని 12వేలు రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. భూభారతి నమోదుఅయిన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆదారంగా రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతును గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ నింబదనలకు లోబడి కొత్త రేషన్ కార్డులనుఅందించడమే కాకుండా పాత కార్డులలో మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్ , సుధీర్,డిఆర్‌డిఓ శ్రీనివాస్ పాల్గోన్నారు.

## ఘనంగా వివేకానంద జయంతి

**ప్రజాపక్షం/దుండిగల్:** భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని విగ్రహానికి నివాళులు అర్పించిన వారిలో బిజెపి నాయకులు పీసరి కృష్ణారెడ్డి, గోనె మల్లారెడ్డి,డి ప్రభాకర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ,పి మాధవరెడ్డి ఉన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖులు సందీప్ జీ.లక్ష్మారెడ్డి, జీవన్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి,నరేందర్ రెడ్డి, ప్రశాంత్,నవభారత్ యువజన సంగం నాయకులు సీతారాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కమ్మరి రమేష్‌చారి, మండల పద్మశాలి సంగం అధ్యక్షులు అందె అశోక్, స్థానిక నాయకులు ధర్మారెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు. దొమ్మర పోచంపల్లిలో జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షులు ఏ.శ్రీశైలం యాదవ్ తదితరులున్నారు.

## పదవీ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదనలను విరమించుకోవాలి

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 63 ఏండ్లకు పెంచే ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం విరమించుకోవాలని జాతీయ ఒబిసి ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఆళ్ల రామకృష్ణ కోరారు. ఆదివారం పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్‌లను కలిసి అభ్యర్థించిన అనంతరం ఖైరతాబాద్‌లోని ఫోరం కార్యాలయంలో మాట్లాడారు. ఉద్యోగుల విరమణ వయస్సు పెంచితే నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు.

# మహానగరి

## బిజెపి నూతన జిల్లా కమిటీల ఎంపిక

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: సంస్థాగత ఎన్నికల పర్వంలో భాగంగా బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా సంస్థాగత ఎన్నికల నియామకంలో 24 మంది నూతన మండల అధ్యక్షులతో పాటు 24 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మినారాయణ,జోనల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి ఎడ్ల అశోక్ రెడ్డిలు ఆదివారం ప్రకటించడం జరిగింది. సంస్థాగతంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ రాబోవు స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేస్తూ అందరిని కలుపుకు పోయే విధంగా పార్టీ కోసం పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




ప్రజాపక్షం/కొందుర్గు: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ చివరి రోజు ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందుర్గు మండలంలో ప్రతి సంవత్సరం వివిధ క్రీడల టోర్నమెంట్లను నిర్వహిస్తున్నారని, దీని ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారన్నారు. క్రీడల నిర్వాహణ కోసం మండల కేంద్రంలో స్టేడియం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన కొందుర్గు ఉమ్మడి మండల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కెరాములుగౌడ్, కెయాదయ్య, బి పెంటయ్య,డి శ్రీనివాస్, చేవెళ్ల కృష్ణయ్య, జిబి కృష్ణ,మాణయ్య, టి గోపాల్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం

కార్పొరేటర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వ కలుగుతుందని వనస్థలిపురం, హయత్ నగర్ కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, వనస్థలిపురం సర్కిల్ సిఐ శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్‌లోని క్రాంతి హిల్స్ కాలనీలో నూతన్గా ఏర్పాటు చేసిన టెన్నిస్ బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాయమం చేయడంతో పాటు క్రీడాల్లో రాణించడం ద్వారా కలిగే ప్రయోజనాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వేదుకొండలు,కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్, మకుటం సదాశివుడు, ప్రొప్రెటర్ సురేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు బద్దం రామ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సాయికిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

## యువత క్రీడారంగంలో రాణించాలి



ప్రజాపక్షం/కొందుర్గు: యువత క్రీడా రంగంలో రాణించాలని బిఆర్‌ఎస్ నాయకులు వై.మురళీయాదవ్ కోరారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కొందుర్గు ప్రిమీయర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందుర్గు మండలం క్రీడలకు నిలయంగా మారిందని, ప్రతి సంవత్సరం వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్ల నిర్వాహణ వల్ల ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. అంతకు ముందు మండల పరిధిలోని పర్వతాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను మురళీయాదవ్ ప్రారంభించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వి నారాయణ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, దర్గా రాంచంద్రయ్య, జనార్ధన్‌గౌడ్, డి శ్రీనివాస్, రామకృష్ణ, బి రవీందర్‌రెడ్డి, సి చంద్రశేఖర్, వాసూరి, ప్రభాకర్, సాయి, ప్రశాంత్, జి బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## మాంజాతో ప్రజల ప్రాణాలకు హాని

ఇపో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య




ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: మాంజాల పతంగులతో ప్రజల ప్రాణాలకు హాని కలుగుతుందని ఈపో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. ఆదివారం ఎన్విరాన్మెంటల్ ప్రొటెషన్ ఆర్గనైజేషన్(ఇపిఒ) ఆధ్వర్యంలో వనస్థలిపురం, బిఎన్‌రెడ్డి నగర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, ఈపో ఆర్గనైజర్స్ పి. శివకుమార్‌లు మాట్లాడుతూ పర్యావరణం కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులను ఎగరవేయటం ప్రజల సంస్కృతిలో ఒక బాగం అని వారు తెలిపారు. మాంజాల ద్వారా మూగ ప్రాణాలు, పక్షులు గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్నాయని వారు పేర్కొన్నారు. చివరికి మనుసులు కూడా మాంజాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గత సంవత్సరం బండ్లగూడ జాగిర్ ప్రాంతంలో సైనికుడు మాంజా తగిలి ప్రాణాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిన విషయమే అని గుర్తు చేశారు. ఈ మద్యలో ఒక పోలీస్ అధికారి మాంజా చుట్టూ గాయాలు అయిన విషయాన్ని మరవకూడదని తెలిపారు. మాంజాల అమ్మకంపై నిషేధం ఉన్న అమ్మకం దారులు బభిరంగంగా, దొంగచాటున అమ్ముతున్నారని వారు ఆరోపించారు. అమ్మకదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఈపో ద్వారా ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, పృధ్వి, శివ, హరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్‌లో..

# ఔటర్ పురపాలికల విలీనం

ఈనెల 25తో ముగియనున్న శివారు పురపాలికల పాలకమండళ్ల పదవీకాలం

ఒకటి నుంచి నాలుగు కార్పొరేషన్‌లుగా జిహెచ్‌ఎంసి

విభజన, విలీనం అంశాలు పరిశీలిస్తున్న ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)వరకున్న 27 పురపాలికలు త్వరలో జిహెచ్‌ఎంసిలో విలీనం కానున్నాయి. ఈనెల 25వ తేదీతో పురపాలికల పాలకమండళ్ల గడువు ముగిసిపోగానే వాటిని జిహెచ్‌ఎంసిలో విలీనం చేసే ప్రక్రియ కార్యరూపం దాల్చనుంది. విలీనం జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రానుంది. జిహెచ్‌ఎంసిలో పురపాలికలు విలీనమయ్యాక గ్రేటర్ హైదరాబాద్ మొత్తాన్ని ఒకే కార్పొరేషన్‌గా (గ్రేటర్ హైదరాబాద్ సిటీ కార్పొరేషన్) ఉంచుతారా ?, లేక ఎక్కువ కార్పొరేషన్లుగా చేస్తారా ? అనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిలో సమలోచనలు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ సంవత్సరం ముగిసేలోపు కొత్త కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకుగాను కన్సల్టెన్సీఏజెన్సీ లేదా ప్రత్యేక కమిటీ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కల్పించాల్సిన మౌలికసదుపాయాలు, ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు తదితరమైన వాటిపై నివేదిక రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఒకటి కంటే ఎక్కువ కార్పొరేషన్లు ఏర్పాటు చేసే పక్షంలో ఒక కార్పొరేషన్‌లోకి పూర్తిగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు, మరో కార్పొరేషన్‌లోకి అభివృద్ధి చెందని ప్రాంతాలు రాకుండా ఓఆర్‌ఆర్‌లోపలి అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేందుకు ఒక కార్పొరేషన్‌లో రెండూ ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

**కార్పొరేషన్ ఒకటి, రెండు, మూడు, నాలుగు.. యోచనలో సిఎం...** ఔటర్ రింగ్‌రోడ్డులోని 27 పురపాలికలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయనున్నారు. మొత్తం పరిధిని ఒకే కార్పొరేషన్ చేస్తే ఎలా ఉంటుందనే యోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలిసింది. ఒకే కార్పొరేషన్ ఉంటే కనీసం రెండు కార్పొరేషన్‌లుగా ఏర్పాటు చేయాలనే సంకల్పంతో సిఎం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇంతపెద్ద విస్తీర్ణం వరకు ఒకే కార్పొరేషన్‌గా ఉంటే పలు ఇబ్బందులు ఎదురవుతాయనే అభిప్రాయంలో ఉన్నతాధికారులు ఉన్నారు. దీంతో రెండు లేదా నాలుగు కార్పొరేషన్‌లు ఏర్పాటుకే అధికార వర్గాలు మొగ్గ చూపుతున్నట్లు తెలిసింది. నగరంలోని పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే యోచనలో సైతం సమలోచనలు జరుగుతున్నట్లు తెలిసింది. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా నాలుగు కార్పొరేషన్‌లు చేస్తే ఎలా ఉంటుందనే విషయంపై కూడా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే అధికారులు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా నాలుగు కార్పొరేషన్‌లుగా నగరాన్ని విభజిస్తే పౌరసేవలు, పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ప్రాథమిక అధ్యాయనాన్ని ప్రారంభించినట్లు తెలిసింది.

**సంవత్సరం పాటు ఒఆర్‌ఆర్ వరకు ఒకే కార్పొరేష-న్‌గా..** అయితే సంవత్సరం పాటు ఒఆర్‌ఆర్ పరిధి వరకు ఒకే కార్పొరేషన్‌గా ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్పుతున్నాయి. ఈనెల 25న ఒఆర్‌ఆర్ పరిధిలోని కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల పాలకమండళ్ల పదవికాలం ముగియనుంది. దీంతో వీటిలో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వస్తుంది. వెంటనే వాటిని




జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిహెచ్‌ఎంసి విస్తీర్ణం ప్రస్తుతం 625 చదరపు కిలోమీటర్లు కాగా, ఓర్‌ఆర్ వరకు ఉన్న పురపాలికలను కలిపితే దాదాపు 2,500 చదరపు కిలోమీటర్లకు పెరగనుంది. ఏర్పాటు చేసే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి అన్నింటి విస్తీర్ణం దాదాపు సమానంగా ఉండనుంది. ఉదాహరణకు మూడు కార్పొరేషన్లు అయితే 600, 650 చదరపుకిలోమీటర్లు, నాలుగైతే 500 చదరపుకిలోమీటర్లు, రెండైతే సుమారుగా 1000చదరపు కిలోమీటర్ల వంతున విస్తీర్ణంతో ఏర్పాటు కానున్నాయి. గత సంవత్సరం ఓఆర్‌ఆర్‌కు దగ్గరలో ఉన్న 51 గ్రామపంచాయతీలను సమీప 13 పురపాలికల్లో(శంషాబాద్, పెద్ద అంబర్‌పేట, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, గుండ్లపోచంపల్లి, తూంకుంట, ఘట్‌కేసర్, తెల్లాపూర్,అమీన్‌పూర్) విలీనం చేశారు. ఇవన్నీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి రానున్నాయి.

- కొత్తగా ఏర్పాటయ్యే కార్పొరేన్‌ల సంఖ్యను బట్టి, ఒక్కో కార్పొరేషన్లో ఎన్ని జోన్లు, ఎన్ని వార్డులుండాలో నిర్ణయం తీసుకోనున్నారు.
- వార్డుల మధ్య సైతం వ్యత్యాసం లేకుండా జనాభా దాదాపుగా సమానంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు.
- కొత్త కార్పొరేషన్‌లలోనే ఎన్నికలు జిహెచ్‌ఎంసి ప్రస్తుత పాలకమండలి గడువు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో ముగియనుంది. ఆలోగా ఈ కసరత్తు మొత్తం పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.
- మెగా మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఓఆర్‌ఆర్ వరకు అర్బన్‌గా, తర్వాత ఆర్‌ఆర్‌ఆర్ వరకు సెమి అర్బన్‌గా పరిగణించి, అభివృద్ధి చేసేందుకు మెగా మాస్టర్‌ప్లాన్ 2050 రూపొందిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అందుకనుగుణంగానే కొత్తకార్పొరేషన్‌లు ఏర్పాటు కానున్నాయి.
- ఎన్ని కార్పొరేషన్‌లు చేయాలనేది రాజకీయ నిర్ణయంగా ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న ఎంఐఎం ఆలోచనను పరిగణనలోకి తీసుకుని ఎన్ని కార్పొరేషన్లు చేయాలనేది ఖరారు చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### జిహెచ్‌ఎంసిలో ప్రస్తుతమున్న 6 జోన్‌ల విస్తీర్ణం..

| జోన్ | విస్తీర్ణం (చ.కి.మీ.) |
|---|---|
| ఖైరతాబాద్ | 76.10 |
| ఎల్.బి. నగర్ | 128.21 |
| సికింద్రాబాద్ | 61.37 |
| కూకట్‌పల్లి | 113.15 |
| చార్మినార్ | 98.61 |
| శేరిలింగంపల్లి | 132.22 |

## 'దగ్గుబాటి' కుటుంబంపై కేసు

ఎ2గా సినీనటుడు వెంకటేష్

ఓ స్థల వివాదంలో నాంపల్లి కోర్టు ఆదేశాలు

కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్: డెక్కన్ కిచెన్ హోటల్ వివాదంలో సినీ హీరో దగ్గుబాటి వెంకటేశ్ కుటుంబంపై కేసు నమోదైంది. ఈ కేసు ఎఫ్‌ఐఆర్‌లో విక్టరీ వెంకటేశ్‌ను ఏ2గా పేర్కొన్నారు. నందకుమార్ అనే వ్యక్తికి, దగ్గుబాటి కుటుంబానికి డెక్కన్ కిచెన్ హోటల్ స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. 2022లో జిహెచ్‌ఎంసి సిబ్బంది, బౌన్సర్లతో కలిసి దగ్గుబాటి కుటుంబం ఈ హోటల్ ను కొంతమేర ధ్వంసం చేసింది. నందకుమార్ దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో... ఆ స్థలంలో ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ... గతేడాది జనవరిలో దగ్గుబాటి ఫ్యామిలీ ఆ హోటల్ ను పూర్తిగా నేలమట్టం చేసింది. దాంతో నందకుమార్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. శనివారం నందకుమార్ పిటిషన్‌ను విచారించిన కోర్టు...దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఫిలింనగర్ పోలీసులను ఆదేశించింది. అంతేకాకుండా, హైకోర్టు ఆదేశాల ఉల్లంఘనపైనా చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. నాంపల్లి కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో...ఫిలింనగర్ పోలీసులు దగ్గుబాటి ఫ్యామిలీపై 448, 452, 458, 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎఫ్ ఐఆర్ లో ఏ1గా దగ్గుబాటి సురేశ్, ఏ2గా వెంకటేశ్, ఏ3గా దగ్గుబాటి రానా, ఏ4గా దగ్గుబాటి అభిరామ్ లను పేర్కొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌తో రైతులకు మేలు

త్వరలోనే భూసేకరణ చేపడుతాం...డిప్యూటీ సిఎం విక్రమార్క

ప్రజాపక్షం/షాద్‌నగర్ : లక్ష్మీ దేవి పల్లి రిజర్వాయర్‌తో తెలంగాణ రైతులకు ఎంతొ మేలు జరుగుతుందని రాష్ట ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం షాద్‌నగర్ బై పాస్ కేశంపేట్ చౌరస్తా నుండి నాగర్ కర్నూల్‌కు పర్యటనకు వెళ్తున్న రాష్ట ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఎంపి మల్లురవిలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పార్టీ నాయకులతో పెద్ద ఎత్తున ఘణ స్వాగం పలికారు. అనంతరం నాయకులకు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ.. లక్ష్మీ దేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణంకు త్వరలోనే భూ సేకరణకు ప్రణాళిక సిద్దం చేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు తప్పని సరిగా దశల వారిగా అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటి వైజ్ చైర్మెన్ మహమ్మద్ హాలీఖాన్ పాల్గొన్నారు.

### కులమతాలకతీతంగాదైవభక్తిని అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే శంకర్

కుల మతాలకు అతీతంగా దైవభక్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొత్తూర్ మండల పరిధిలోని హజరత్ జహంగీర్ పీర్ల దర్గా జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మార్కెట కమిటి చైర్మెన్ సులోచన కృష్ణా రెడ్డి, వైజ్ ర్మెన్ హాలీఖాన్ బాబర్‌లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పరమ పవిత్రమై దేవాలయంగా హజరత్ జహింగీర్ పీర్ల దర్గాను భక్తులకు మౌలిక వసతులు కల్పించే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.





## మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ సంక్రాంతి శుభాకాంక్షలు




ప్రజాపక్షం/హైదరాబాద్ : నగర ప్రజలకు గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే అద్భుతమైన పండుగన్నారు. ఈ పండుగ స్నేహభావం, ఐక్యత, అనురాగం పెంపొందించేందుకు ప్రేరణ కలిగిస్తుందన్నారు. మకర సంక్రాంతి నాడు సూర్యుని పూజించి, ప్రకృతి ప్రసాదాలకు కృతజ్ఞతలు తెలియచేయడం మన పురాతన ఆచారాలలో ఒకటన్నారు. ఇది రైతుల పండుగగా, వారి కష్టానికి ప్రతిఫలమైన పంట కోతల పండుగగా కూడా ప్రసిద్ధి చెందిందన్నారు. పండుగ వేళ ప్లాస్టిక్ ఉపయోగం తగ్గించి, పర్యావరణానికి హానికరం కానీ వస్తువులను వినియోగించాలని వారు ప్రజలను కోరారు. నగర ప్రజలందరూ పండుగను ఆనందంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని వారు సూచించారు. గాలి పటాలు ఎగురవేయడంలో యువత జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు.

# నేటితరానికి ఆదర్శప్రాయుడు వివేకానందుడు

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: నేటి తరానికి వివేకానందుడు ఆదర్శప్రాయుడని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం వివేకానంద జయంతిని ఎన్జీవోస్ కాలనీలో స్వామి వివేకానంద పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ నేతి యువతరం చేడు అలవాట్లకు బానిసలై వారి విలువలను కోల్పుతున్నారన్నారు. యువత ఆదర్శమైన జీవితంలో ఉండాలని, మంచి లక్ష్యాన్ని ఎంచుకోని తన లక్ష్యాన్ని చేరువాలన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరావు, దామోదర్‌రెడ్డి, నారాయణమూర్తి, చక్రధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం కుమార్, శరత్, రాజు, కామేష్, ఫణి, శంకర్ పాల్గొన్నారు.

**ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో...** వివేకానంద జీవితం నేటి యువతకు ఆదర్శమని రంగారెడ్డి జిల్లా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్ గౌడ్ కొనియాడారు. ఆదివారం ఎన్జీవోస్ కాలనీలో వివేకనందుడి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి




నివాళిలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానికలవుతున్నారని, వాటి నుంచి యువత బయటపడడానికి వివేకనందుడి మార్గదర్శకాలను పాటించాలని కోరారు. విబిన్న కుల, మతాలతో ఉన్నటువంటి ఈ భారతదేశంలో నిబద్దత కలిగిన జీవితానికి వివేకానందుడి బోధనలు ఉపయోగపరంగా ఉంటుందున్నారు. కుల మతాల విష సంస్కృతి పోవాలని అందుకు యువకులంతా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ఓరుగంటి పృధ్వీ, హరిచందన్, గండికోట శివ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**కొందుర్గు:** నేటి యువత వివేకానంద స్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలని గంగన్నగూడెం మాజీ ఉపసర్పంచ్ చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంగన్నగూడలో వివేకానంద స్వామి జయంతి వేడుకలను వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి గ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు రాజు యాదవ్, రాజేష్ పటేల్, సత్యనారాయణరెడ్డి, మధు, రాజు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పవన్ కళ్యాణ్, రాజశేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, భీమయ్య, యాదయ్య, వెంకటేష్, రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ :** వివేకానందుడి ఆశయ సాధనకు యువత కృషి చేయాలని వివేకానంద స్వామి పొదుపు సంఘం సభ్యులు, జర్నలిస్టు ఎగురి మల్లిఖార్జున్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులకు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రజినీకాంత్, చంద్రయ్య, గౌరీశ్వర్, రాము సత్యనారాయణ, శ్రీను పంతులు, మల్లేష్, వీరేష్, రమేష్ పాల్గొన్నారు.







# క్రీడ

# వన్డేల్లో 'ట్రిపుల్ 'సెంచరీ!

## 14 ఏళ్ల అమ్మాయి సంచలనం..



భారత యువ మహిళా బ్యాటర్ ఇరా జాదవ్ సంచలనం సృష్టించింది. వన్డే మ్యాచ్‌లో జట్టంతా 350+ కొడితేనే గొప్ప అని భావిస్తారు. అలాంటిది ఇరా జాదవే ఏకంగా ట్రిపుల్ శతకం బాదడం విశేషం. ఇది అండర్ 19 స్థాయిలోనే అయినప్పటికీ తొలి మహిళా భారత క్రికెటర్‌గా ఇరా జాదవ్ అవతరించింది. ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 14 ఏళ్ల ఇరా మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో 157 బంతుల్లోనే 346 పరుగులు చేసింది. ఇందులో 42 ఫోర్లు, 16 సిక్సర్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన డబ్ల్యూపీఎల్ వేలంలో ఇరా జాదవ్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు.

### ముంబయి స్కోరు 563/3

వన్డేల్లో రెండు జట్లు కలిసి చేసే స్కోరును ముంబయి ఒక్కటే సాధించింది. ఇరా జాదవ్ ట్రిపుల్ సెంచరీతోపాటు కెప్టెన్ హుర్లే గాలా (116) సెంచరీ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 50 ఓవర్లలో కేవలం మూడు వికెట్లను కోల్పోయి 563 పరుగులు చేసింది. ఎలినా ముల్లా (8)తో కలిసి ఇరా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ముల్లా త్వరగానే ఔటైనా.. హుర్లేతో కలిసి ఇరా రెండో వికెట్‌కు 274 పరుగులు జోడించింది. సెంచరీ తర్వాత హుర్లే ఔటైనప్పటికీ.. దీక్ష పవార్ (39)తో కలిసి ఇరా జాదవ్ మూడో వికెట్‌కు 186 పరుగులు రాబట్టింది. దీక్ష పెవిలియన్‌కు చేరిన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మితాలీ హర్షద్ (26*)తో కలిసి ఇరా జాదవ్ మరో వికెట్ పడనీయకుండా స్కోరును 563 పరుగులకు చేర్చింది. నాలుగో వికెట్‌కు కేవలం 33 బంతుల్లోనే 64 పరుగుల భాగస్వామ్యం నిర్మించడం గమనార్హం.

### 19 పరుగులకు మేఘాలయ ఆలౌట్

ముంబయి నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మేఘాలయ కుప్పకూలింది. కనీసం పోరాటం కూడా చేయకుండానే చేతులెత్తేసింది. ముంబయి బౌలర్ల దెబ్బకు 19 పరుగులకే ఆలౌటైంది. దీంతో మేఘాలయపై 544 పరుగుల భారీ తేడాతో ముంబయి విజయం సాధించింది. మేఘాలయ ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేదు. అదనంగా వచ్చిన 10 పరుగులే టాప్ స్కోరర్. ముంబయి బౌలర్లలో జీయా 3, యయాతి 3, రితికా 2, అక్షయ 2 వికెట్లు తీశారు.



# మార్చి 23న నుంచి ఐపిఎల్

## మే 25 ఫైనల్ : రాజీవ్ శుక్లా

ఐపీఎల్ 2025 సీజన్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. మార్చి 23 నుంచి ప్రారంభం కానుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. మే 25న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. బీసీసీఐ ప్రత్యేక సాధారణ సమావేశం ముంబయిలో జరిగింది. ఈ క్రమంలో రాజీవ్ శుక్లా ఐపీఎల్ ప్రారంభం స్పందించారు. అయితే, పూర్తి స్థాయి షెడ్యూల్‌ను మరికొద్ది రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉంది.

### జై షా స్థానంలో దేవజిత్ సైకియా



బీసీసీఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి ఐసీసీ ఛైర్మన్‌గా జైషా వెళ్లిన సంగతి తెలిసిందే. జైషా స్థానంలో కొత్త కార్యదర్శిగా దేవజిత్ సైకియా, ట్రెజరర్‌గా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఎంపికైనట్లు బీసీసీఐ ఎస్‌జీఎం వెల్లడించింది.

# సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి!



పారిస్ ఒలింపిక్స్ 2024 అనంతరం భారత షట్లర్ల నిరాశజనక ప్రదర్శన కొనసాగుతోంది. ఇప్పటికే స్టార్ షట్లర్లు పేలవ ప్రదర్శన కనబరుస్తుండగా.. కాస్తో కూస్తో మెరుగ్గా ఆడుతున్న డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టిలు కూడా టైటిల్ అందుకోలేకపోతున్నారు. కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనే లక్ష్యంతో మలేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో బరిలోకి దిగిన ఈ జోడీ సెమీస్‌లోనే ఇంటిముఖం పట్టింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్‌చిరాగ్ ద్వయం 1021, 1521 తేడాతో కొరియా జోడీ కిమ్ వాన్ సియో సెంగ్ చేతిలో చిత్తయ్యింది. తొలి గేమ్‌లో పూర్తిగా తేలిపోయిన భారత ద్వయం.. అనవసర తప్పిదాలతో బ్రేక్ సమయానికి 611తో వెనుకబడింది. అనంతరం కొరియా జోడీ ఆధిపత్యం చెలాయించడంతో తేరుకోలేక గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లో కాస్త మెరుగ్గా ఆడి బ్రేక్ సమయానికి 118తో ఆధిక్యంలో నిలిచింది. కానీ విరామం తర్వాత కొరియా జోడీ దూకుడుగా ఆడుతూ ఆధిపత్యం చెలాయించడం తేలిపోయింది. దాంతో భారత ద్వయానికి ఓటమి తప్పలేదు. ప్రత్యర్థి జోడీ అసాధారణ ప్రదర్శన కనబర్చిందని, తమకంటే మెరుగ్గా ఆడిందని సాత్విక్ తెలిపాడు. తమ ప్రణాళికలకు తగ్గట్లు ఆడలేకపోయామని దాంతోనే ఓటమి పాలయ్యామని చెప్పాడు.

# ఐర్లాండ్‌తో వన్డే సిరీస్.. కప్ భారత్‌దే!



ఐర్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే గెలుచుకుంది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత అమ్మాయిలు నిర్ణీత 50 ఓవర్లలో రికార్డు స్థాయిలో 370 పరుగులు చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ ఏ దశలో ఆ టార్గెట్‌ను ఛేజ్ చేసేలా కనిపించలేదు. ఆఖరికి 50 ఓవర్లు పూర్తయ్యేసరికి 254/7 దగ్గర నిలిచింది. దీంతో టీమ్ ఇండియా 116 పరుగుల తేడాతో గెలుపొందింది.

# రీల్

# దర్శకులకు సారీ

• రష్మిక





జిమ్‌లో వర్కౌట్లు చేస్తూ నటి రష్మిక గాయపడిన విషయం తెలిసిందే. తన గాయం గురించి తెలియజేస్తూ.. కాలికి కట్టు కట్టుకుని ఉన్న ఫొటోని తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. గాయం మానడానికి ఎంత సమయం పడుతుందో తెలియదన్నారు. 'నూతన సంవత్సర శుభాకాంక్షలు! నేను ఎంతో పవిత్రంగా భావించే జిమ్‌లో గాయపడ్డాను. పూర్తిగా ఎప్పుడు కోలుకుంటానో ఆ భగవంతుడికే తెలియాలి. త్వరగా కోలుకుని 'సికందర్', 'థామ', 'కుబేర' సెట్స్‌లో పాల్గొనాలని ఆశిస్తున్నా. ఈ ఆలస్యానికి క్షమించాలని ఆయా చిత్రాల దర్శకులను కోరుతున్నా. నా కాలు ఏమాత్రం సెట్ అయినా వెంటనే షూట్‌లో భాగం అవుతా'' అని ఆమె రాసుకొచ్చారు. 'పుష్ప 2'తో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'సికందర్'లో నటిస్తున్నారు. గాయంతో షూటింగ్‌కు కొన్ని రోజులు బ్రేక్ ఇచ్చారు. సల్మాన్ ఖాన్ హీరోగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. కాజల్ అగర్వాల్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ యాక్షన్ మూవీ ఈద్‌కు విడుదల కానుంది. మరో బాలీవుడ్ చిత్రం 'థామా'లోనూ ఆమె నటిస్తున్నారు. మరోవైపు, ఆమె హీరోయిన్‌గా నటించిన 'ఛావా' ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ ఇది. తెలుగులో 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతో అలరించనున్నారు.

# 'మజాకా' రిలీజ్ డేట్ ఖరారు!



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రమే మజాకా. వరుస హిట్స్ దర్శకుడు త్రినాథరావు నక్కిన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నిజానికి ఈ సంక్రాంతిలోనే రావాల్సి ఉంది కానీ వాయిదా పడింది. అయితే ఈ సంక్రాంతి సీజన్లో మాత్రం మేకర్స్ మంచి టీజర్ కట్‌ని వదిలారు. అయితే ఈ టీజర్‌తో మళ్ళీ త్రినాథరావు నక్కిన నుంచి ఒక సాలిడ్ ఎంటర్టైనర్ రాబోతుంది అని చెప్పొచ్చు. అయితే ఈ సినిమాలో సందీప్ కిషన్ హీరో అయినప్పటికీ తన తండ్రి రోల్‌లో చేసిన వెర్సటైల్ నటుడు రావు రమేష్‌కి కూడా ఇంట్రెస్టింగ్ రోల్ ఉన్నట్టుగా ఈ టీజర్‌లో కనిపిస్తుంది. ఇద్దరికీ మంచి ఎంటర్టైనింగ్ లవ్ స్టోరీలు కనిపిస్తుండగా థియేటర్స్‌లో మంచి నవ్వులు పూయించేలా సాలిడ్ ఎపిసోడ్స్ ఉన్నట్టుగా కనిపిస్తుంది. అలాగే సందీప్ కిషన్, రావు రమేష్ నడుమ కామెడీ సీన్స్ కూడా వర్కౌట్ అయ్యేలా ఉన్నాయని చెప్పాలి. అలాగే రీతూ వర్మ కొంచెం గ్లామర్ డోస్‌ని కూడా ఈ సినిమాకి పెంచింది. ఇంకా లియోన్ జేమ్స్ మ్యూజిక్ కూడా సాలిడ్‌గా ఉంది. ఇలా మళ్ళీ మొత్తానికి ఒక ప్రామిసింగ్ ఎంటర్టైనర్‌గా మజాకా టీం రాబోతున్నారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రాన్ని టీజర్ తోనే ఈ ఫిబ్రవరి 21న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. అలాగే ఈ సినిమాని ఏకే ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

మన టాలీవుడ్ దగ్గర ఈ సంక్రాంతి కానుకగా ప్లాన్ చేసిన చిత్రాల్లో రెండు ఆల్రెడీ రిలీజ్ అయ్యాయి. ఇక ఈ చిత్రాలు తర్వాత మోస్ట్ లవబుల్ హీరో విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం కూడా ఒకటి. కాగా సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఇప్పటికే పాటలు, ట్రైలర్‌లతో మళ్ళీ అనీల్ రావిపూడి మార్క్ ఎంటర్టైన్మెంట్‌ని ప్రామిస్ చేసింది. దీనితో ఈ సినిమాపై మంచి బజ్ నెలకొనగా ఇపుడు సినీ వర్గాల్లో

# 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రెండ్ కూడా గట్టిగానే!



అయితే ఈ చిత్రానికి భారీ ఓపెనింగ్స్ దక్కే ఛాన్స్ ఉందనే ట్రెండ్ కనిపిస్తుంది. వెంకీ మామ గత చిత్రాలతో పోలిస్తే ఈ సినిమాకి బుకింగ్స్ మరింత స్ట్రాంగ్‌గా కనిపిస్తుండగా వీటితో సంక్రాంతి కానుకగా వస్తున్న ఈ సినిమాకి కూడా గట్టి ఓపెనింగ్స్ ఖచ్చితంగా ఉంటాయని తెలుస్తుంది. మరి ఈ అవైటెడ్ సినిమాకి తెలుగు ఆడియెన్స్ ఎలాంటి నంబర్స్ అందిస్తారో చూడాలి.

## రాష్ట్ర ప్రజలకు సిఎం 'సంక్రాంతి' శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు భరోసాను రూ.12 వేలకు పెంచడం, వ్యవసాయ కూలీ కుటుంబాలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం', కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతి సంక్షేమ పథకం చేరాలనే తమ సంకల్పమన్నారు. తెలుగు ప్రజలందరికీ సిఎం రేవంత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని సిఎం ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు తెస్తుందన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనం సాధిస్తుందని సిఎం ధీమా వ్యక్తం చేశారు. స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని, పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# రేస్ కోర్సు ముద్దు.. రాజేంద్రనగర్ వద్దు

## హైకోర్టు తరలింపుపై మండిపడ్డ లాయర్లు




ప్రజాపక్షం/హైదరాబాద్: హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైకోర్టు పరిరక్షణ సమితి కన్వీనర్ మామిడి వేణు మాధవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ హైకోర్టు ఎక్కడ తరలించాలనే విషయంపై హైకోర్టు జడ్జీలకు, న్యాయవాదులకు ఎలాంటి సంబంధం లేదు. ఇది సిఎం రేవంత్ రెడ్డి, చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే తీసుకున్న ఏకపక్ష నిర్ణయం అని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ కి తరలించాలనే నిర్ణయం కేవలం రియల్టర్ల ప్రయోజనాలకోసమేనని, ఆదాయ వనరుల కోసం ప్రభుత్వ స్థలాలను అమ్మేసి రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఇందులో భాగంగానే రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంపై ప్రభుత్వం కన్ను పడిందని వేణుమాధవ్ అన్నారు.

అది 3 వేల ఎకరాలు ఉందని, అప్పట్లో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి స్థానిక రైతులు వ్యవసాయ పరిశోధనల వల్ల పంటలు బాగా పండించవచ్చని మంచి ఉద్దేశంతో స్థలాన్ని ఇచ్చారన్నారు వేణుమాధవ్. ఆ భూముల్ని ఈ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం మేరకు మొదట 100 ఎకరాలు ఇచ్చేసి తర్వాత ఆ భూములను కూడా కబ్జా చేసి ఇక్కడ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఎత్తేసి సిద్దిపేటకు తరలించాలనే యోచనలో ఉన్నారని వేణుమాధవ్ విమర్శించారు. హైకోర్టును తరలిస్తే సామాన్య ప్రజలు, జడ్జిలు, లాయర్లు, కోర్టు సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు వస్తాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిఘటిస్తుండటంతో హైకోర్టు కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని తొలగించి ప్రస్తుత హైకోర్టు స్టోర్ రూమ్‌లో పడేశారన్నారు. తాము గవర్నర్‌కి హైకోర్టును తరలించవద్దని వినతిపత్రం ఇచ్చాం, గవర్నర్ కార్యాలయం ఎండార్స్ చేసి సిఎం ఆఫీసుకు పంపారు, కానీ అక్కడ నుంచి ఇంత వరకు స్పందనలేదని వేణుమాధవ్ వాపోయారు. ఎల్ అండ్ టి నివేధిక ప్రకారం ప్రస్తుతమున్న హైకోర్టు మరో వందేళ్లు పటిష్టంగా ఉంటుందన్నారు. పార్కింగ్ సమస్య తీరడానికి మల్టీలెవెల్ పార్కింగ్ పద్ధతి ఏర్పాటు చేస్తే సరిపోతుంది. రాజేంద్రనగర్ పారిశ్రామిక ప్రాంతం, హైదరాబాద్ లో కెల్లా అత్యధిక కాలుష్య ప్రాంతం. రేస్ కోర్సులో 168 ఎకరాల స్థలం ఉందన్నారు. అక్కడికి హైకోర్టును తరలిస్తే రైల్వే స్టేషన్, మెట్రో స్టేషన్, బస్ స్టేషన్ తో పాటు ఇతర ప్రయాణ సదుపాయాలు ఉన్నాయన్నారు.

రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం హైకోర్టును వాడుకోవద్దు. హైకోర్టు పరిరక్షణ సమితి సారధ్యంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లి ప్రస్తుత హైకోర్టును రాజేంద్రనగర్ ప్రాంతం నుంచి మలక్పేట్ రేస్ కోర్సుకు తరలించే వరకు పోరాటం కొనసాగిస్తామని మామిడి వేణుమాధవ్ అన్నారు. సమావేశంలో అడ్వకేట్లు భానుమూర్తి, యాదగిరి, కటకం శారద, శివకుమార్, బార్ల మల్లేష్, కీర్తి, కులకర్ణి, భూమారావు, సారధి, కొమరయ్య, వెంకట్రావు పాటిల్, విజయ్ గోపాల్ తదితరులు ప్రసంగించారు.

# 24 నుంచి 'ఆన్‌లైన్ గ్రీవెన్స్'

## 'ఆన్‌లైన్'లో 'పంచాయతీ, గ్రామీణాభివృద్ధి' ఉద్యోగుల సమస్యల పరిష్కారం

### ప్రతి రెండు, నాలుగో శుక్రవారాల్లో సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం సచివాలయం చుట్టూ తిరగకుండా ఉండేందుకు 'ఆన్‌లైన్' సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగుల సమస్యలు, సర్వీస్ అంశాల పరిష్కారానికి ప్రతి నెలా రెండు, నాలుగో శుక్రవారాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4గంటల వరకు ఒక గంట పాటు ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని 24వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు తరచూ సచివాలయం, పంచాయతీ రాజ్ కమిషనరేట్ల చుట్టూ తిరగడంతో క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకం కలగడంతో పాటు, హైదరాబాదులో ఉన్నతాధికారుల సమయం కూడా వృధా అవుతుందని, అందుకే ఉద్యోగుల సమయం, వ్యయ ప్రయాసలకు చెక్ పెట్టేలా ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించాలని ఆ శాఖ నిర్ణయించింది. ఆన్‌లైన్ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్స్ సిఇఒ దివ్య దేవరాజన్, పిఆర్ఆర్‌డి డైరెక్టర్ సృజన, మిషన్ భగీరథ, రూరల్ ఇంజనీరింగ్ ఇఎన్‌సిలు అందుబాటులో ఉంటారు. అవసరమైతే మంత్రి సీతక్క కూడా ఆన్‌లైన్ సమావేశానికి హాజరవుతారు.ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను స్వీకరించి, సత్వర పరిష్కారాన్ని చూపడం, పెండింగ్ ఫైల్స్‌ను కూడా పరిష్కరిస్తారు.

### 'ఆన్‌లైన్ గ్రీవెన్స్'ను సద్వినియోగం చేసుకోండి: మంత్రి సీతక్క

సచివాలయంలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, కమిషనరేట్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ గ్రీవెన్స్ విధానాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులంతా ఆన్‌లైన్ మీటింగ్‌లో అందుబాటులో ఉంటారని, తద్వారా సమన్వయ లోపం లేకుండా వెంటనే ఉద్యోగ సమస్యలకు, సర్వీస్ సంబంధిత అంశాలకు పరిష్కార మార్గం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

# ప్రబోవో సుబియాంటో?

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో ప్రధాని నరేంద్రమోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చలు జరిపారు. 1950 నుంచి భారత్ మిత్ర దేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించారు. 2007లో పుతిన్ (రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్సోయిస్ హోలన్ (ఫ్రాన్స్)లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చీఫ్‌గెస్ట్‌గా ఆహ్వానించారు. కానీ, కొవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దయింది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. 2024 గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మెక్రాన్‌ను ఆహ్వానించింది.

# ఎవరూ ఆందోళన చెందొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఒక్కరికీ లబ్ధి జరిగేలా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని, సర్వే అనంతరం కూడా అధికారులకు సమాచారం ఇవ్వచ్చున్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అర్హులందరికీ న్యాయం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం రేషన్ కార్డులు నిరుపేదలకు అందించేందుకు స్పష్టమైన నిర్ణయం తీసుకుందన్నారు. రేషన్ కార్డులు ఇవ్వడానికి కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు అధికారులతో సమావేశం నిర్వహించి, వారి సూచనలు పరిగణలోకి తీసుకొని అవసరమైతే ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ఈనెల 16, 20వ తేదీల మధ్య క్షేత్ర స్థాయి పరిశీలన జరుగుతుందని, ఈ పరిశీలనలో తరువాత వచ్చిన జాబితా ఈనెల 20, 24 మధ్య వార్డుల వారీగా గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేస్తారన్నారు. ఈనెల 21, 25 తేదీల మధ్య డేటా ఎంట్రీ పూర్తి చేసి, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు.

### ఈనెల 26 నుండి కొత్త రేషన్ కార్డులు..

ఈనెల 26 నుండి కొత్త రేషన్ కార్డులు వస్తాయని, ఇందిరామ్మ ఇళ్ల లబ్దిదారుల ప్రకటన ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో స్వంత స్థలం ఉండి ఇళ్లు లేని వారికి 50 శాతం దరఖాస్తులు వచ్చాయని, ఇంకా సర్వే త్వరలో పూర్తి చేసిన తర్వాత అర్హత ఉన్న లబ్దిదారుల జాబితా తెలుస్తుందని మంత్రి చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 10 లక్షల 70 వేల 463 దరఖాస్తులు ప్రజాపాలనలో రాగా అందులో 50 శాతం సర్వే చేయగా అందులో ఇంటి స్థలం ఉన్నవారు 9,913 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. అయినప్పటికీ హైదరాబాద్‌లో స్థలం అంశం ప్రత్యేకమైనదని అందుకు నిరుపేదలకు మంచి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు సూచన మేరకు బహుళ అంతస్తుల భవనాలు కట్టడానికి లేదా మురికివాడలను అభివృద్ధి చేసి ఇళ్లు నిర్మించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

### హైదరాబాద్‌లో ఇళ్ల సమస్య పరిష్కారం చేస్తాం..

ముఖ్యమంత్రి ప్రభుత్వం ఇళ్లపై ఒక నిర్ణయం తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ ప్రజలకు ఎక్కడ అన్యాయం జరగనివ్వమన్నారు. వలసవచ్చిన వారికి ఇళ్లు రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఈ విషయంలో ప్రజలు సహకరించాలని, జీరో టూ క్రెటీరియ ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలకు న్యాయం జరగాలని, పేద ప్రజల సొంతింటి కళ నిజం చేయాలని ప్రజలు స్వచ్ఛందంగా సానుకూలంగా ఈ ప్రక్రియను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ఆయన తెలిపారు. ఇప్పుడు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. రేషన్ కార్డులలో చేర్పులు మార్పులు నిరంతర ప్రక్రియ అన్నారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. విలేఖరుల సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎలు అహ్మద్ బాలాల, జాఫర్ హుస్సేన్ మేరాజ్, మీర్ జుల్ఫీకర్ అలీ, కౌసర్ మొయినుద్దీన్, ఎంఎల్‌ఎ దానం నాగేందర్, ఎంఎల్‌సి బాల్మూరి వెంకట్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com